ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-2-2026 మంగళవారం సంపుటి: 31 సంచిక: 363 పేజీలు: 10+4 వెల: 6.50



## దేశభక్తులెవరో ప్రజలకు తెలుసు

రాహుల్ వ్యాఖ్యలపై లోక్‌సభలో రగడ

స్పీకర్ జోక్యం, మైక్‌కట్ చేసిన ఓంబిర్లా

5

---

ప్రకటించిన ట్రంప్

వాణిజ్య ఒప్పందానికి ఓకే



# భారత్‌పై సుంకాలు 18%కి తగ్గింపు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** భారత్ అమెరికాలమధ్య వాణిజ్యడీల్‌కు పరస్పర అంగీకారం కుదిరిందని, ఇపుడు ప్రతీకార సుంకాలను తగ్గిస్తున్నట్లు ట్రంప్‌ప్రకటించారు. ప్రస్తుతం భారత్‌పై విధించిన 25 శాతం సుంకాలను 18శాతానికి తగ్గిస్తామని ఆయనట్రూత్ సోషల్‌మీడియాలో ప్రకటించారు. అంతకుముందే ట్రంప్ ప్రధానిమోడీతో ఫోన్‌లోమాట్లాడారని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియోగోర్ వెల్లడించారు. ఆయన తన ఎక్స్‌పోస్టులో స్టేట్యూస్డ్ అటూ ఆసక్తికర వ్యాఖ్యలు కూడాచేసారు. అయితే ఇరువురునేతలు ఏవిషయంపై మాట్లాడారన్న వివరాలు వెల్లడికాలేదు. బహుశా భారత్ అమెరికావాణిజ్య ఒప్పందంపైనే అయింటుందన్న ప్రచారంజరిగింది. అనుకున్నట్లుగానే ట్రంప్ తన సోషల్‌మీడియాలో భారత్ అమెరికాలమధ్య వాణిజ్యఒప్పందానికి అంగీకారం కుదిరిందని, ప్రస్తుతం భారత్ దిగుమతులపై విధించిన 25 శాతం సుంకాలను 18శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఓపక్క భారత్‌యూరోప్‌ల మధ్య >>2

---



సోమవారం మీడియాతో ద.మ రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

# తెలంగాణలో రైల్వేకు భారీగా నిధులు

### రూ. 5,454 కోట్ల కేటాయింపు: రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

### వివరాలు వెల్లడించిన ద.మ రైల్వే జీఎం సంజయ్ శ్రీవాస్తవ

**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధికి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గరిష్ట స్థాయిలో రూ.5,454 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించినట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన రైల్వే కేటాయింపులపై సోమవారం న్యూఢిల్లీ నుంచి వర్చువల్‌గా మీడియాతో ఆయన సమావేశమయ్యారు. సికింద్రాబాద్ రైల్వే నిలయంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో పాటు ఇతర సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి తెలంగాణకు రికార్డు స్థాయిలో రూ.5,454 కోట్ల బడ్జెట్ కేటాయింపులు మంజూరైనట్లు తెలిపారు. 2009-14 మధ్యకాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వార్షిక సగటు రైల్వే బడ్జెట్ కేటాయింపులు కేవలం రూ.886 కోట్లు మాత్రమేనని గుర్తు చేశారు. అప్పటి సగటుతో పోలిస్తే ప్రస్తుతం తెలంగాణకు కేటాయింపులు దాదాపు ఆరు రెట్లు పెరిగాయని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం రూ.47,984 కోట్ల విలువైన >>2

---

# తప్పు చేస్తే విచారణ తప్పదు

### అధికారంలో ఉండగా ఉద్యమకారులు గుర్తు రాలేదా?

- జాతిపిత అంటే ఆస్తులు కొల్లగొట్టేవారు కాదు..
- జాతికోసం సర్వం త్యాగం చేసినవారు
- తెలంగాణ కోసం రావి నారాయణ రెడ్డి సర్వం కోల్పోయారు..
- జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అవార్డు సముచితం
- రావినారాయణరెడ్డి జాతీయ పురస్కార ప్రదానోత్సవంలో సీఎం రేవంత్




సోమవారం హైదరాబాద్‌లో జస్టిస్ సుదర్శన్ రెడ్డికి రావినారాయణరెడ్డి జాతీయ పురస్కారాన్ని అందజేస్తున్న సీఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** తప్పు చేస్తే ఎంతటి వారైనా విచారణ ఎదుర్కోక తప్పదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కెసిఆర్, బిఆర్ఎస్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బంజారాహిల్స్‌లోని రావినారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగిన రావి నారాయణ రెడ్డి జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెలంగాణ కోసం సర్వం కోల్పోయిన మహనీయుడు రావి నారాయణరెడ్డి అని సీఎం గుర్తు చేశారు. ఈ మధ్య తెలంగాణ జాతిపిత అని కొందరు వాళ్లకు వాళ్లే రాసుకుంటున్నారని, ఉద్యమకారులమని వాళ్లే చెప్పుకుంటున్నారని విమర్శించారు. పోలీసులు చిన్న నోటీసులు ఇస్తే జాతిపితకు నోటీసులు ఇస్తారా అని అంటున్నారని, తెలంగాణ సమాజానికి అవమానం జరిగిందని ప్రచారం చేస్తున్నారని సీఎం ఎద్దేవా చేశారు. ఆనాడు జాతిపిత గాంధీజీ పదవులను త్యాగం చేశారని, దుర్మార్గుల తూటాలకు ప్రాణాలు వదిలారని గుర్తు చేశారు. ఇప్పుడు జాతిపిత అని చెప్పుకుంటున్న వాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులను ఏకం చేసి ఉద్యమాన్ని నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా? అని ప్రశ్నించారు. ఆనాడు తలుపులు బద్దలు కొట్టి కోదండరాంను అరెస్టు చేసినప్పుడు ఉద్యమకారులు గుర్తుకురాలేదా? అని సిఎం రేవంత్ విమర్శించారు. నోటీసులు ఇచ్చి విచారణకు పిలిస్తేనే ఏదో జరిగినట్లు రాద్ధాంతం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రావి నారాయణ రెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని, పదవులు, వేలకోట్ల ఆస్తులు సంపాదించుకున్న వాళ్లు ఉద్యమకారులు ఎలా అవుతారని ప్రశ్నించారు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించినప్పుడు అర్థం >>2

---



## రాష్ట్రంలో 500 కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు

### దేశవాప్తంగా 15 వేల ప్రభుత్వ పాఠశాలలు, 500 కళాశాలల్లో ఏర్పాటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి2:** దేశంలో ఈసారి నుంచి పాఠశాలల్లో కొత్తగా యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్స్ (ఏవీజీసీ) కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు రానున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 15 వేల ప్రభుత్వ పాఠశాలలు, 500 కళాశాలల్లో వీటిని ఏర్పాటు చేస్తామని కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు. ఇక తెలంగాణ రాష్ట్రం విషయానికొస్తే కనీసం 500 వరకు కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీన్ని ముఖ్య ఉద్దేశం పాఠశాల విద్యార్థుల్లో రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లపై అవగాహన పెంచేందుకు 2016లో అటల్ ఇన్నోవేషన్ మిషన్ మొదలైంది. >>2

---

# కోర్టు తేల్చకముందే ఇల్లీగల్ ఎలా?

### సజ్జనార్‌తీరుపై హరీష్‌రావు నిశిత విమర్శ

### సిట్ చీఫ్ వ్యాఖ్యలు చట్టబద్ధం కావు..



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి2:** ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) చీఫ్ విసి సజ్జనార్ తీరుపై బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. న్యాయస్థానం తుది తీర్పు ఇవ్వకముందే ఫోన్‌ట్యాపింగ్‌ను ఇల్లీగల్ అని అధికారికంగా ఎలా ప్రకటిస్తారని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఆదివారం మాజీ సిఎం కెసిఆర్ విచారణ అనంతరం సిట్ చీఫ్ సజ్జనార్ చేసిన ట్వీట్‌కు ప్రతిస్పందనగా హరీష్ రావు ట్వీట్ చేశారు. సిట్ చీఫ్ హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చట్టబద్ధంగా నిలవదని, ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఒక ఆరోపణ నేరమని తేల్చాల్సింది న్యాయస్థానం మాత్రమేనని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం, నిందితుడు నిరపరాధి అనే భావన ప్రాథమిక సూత్రం అని, దీనిని విస్మరించరాదని అన్నారు. దర్యాప్తు చేయడం మాత్రమే పోలీసుల విధి అని, విచారణ దశలోనే ఒక చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి వారేమీ న్యాయమూర్తులు కాదని పేర్కొన్నారు. ఒక ఫోన్‌సంభాషణను రహస్యంగా వినడంచట్టబద్ధమా.. కాదా..? అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని నిబంధనలకు లోబడి ఉంటుందని వివరించారు. అలాగే, పియుసిఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జరిగిందా..లేదా? అన్నది న్యాయ సమీక్షద్వారానే తెలుతుందని, పోలీసుల అధికారిక సందేశాల ద్వారా కాదని అన్నారు. ఇల్లీగల్ ఫోన్‌ట్యాపింగ్(అక్రమ ఫోన్‌ట్యాపింగ్) అనే పదాన్ని అధికారికంగా ఉపయోగించడం ద్వారా, సిట్ చీఫ్ దర్యాప్తు ఫలితంపై ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చినట్లు స్పష్ట మవుతోందని ఆరోపించారు. ఆయన ప్రవర్తన తను నిర్వహిస్తున్న పదవికి తగదని, సీనియర్ అధికారులు పాటించాల్సిన నిష్పాక్షికత, సమగ్రతకు సంబంధించిన అఖిల భారత సర్వీసుల (ప్రవర్తనా) నిబంధనలు, 1968కు ఇది పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేతకు సంబంధించిన అత్యంత రాజకీయ ప్రాధాన్యమున్న కేసులో ఇలాంటి తొందరపాటు నిర్ధారణలు చేయడం వల్ల దర్యాప్తు రాజకీయ ప్రేరేపితంగా, పక్షపాతంతో సాగుతోందనే అనుమానాలకు తావిస్తోందని అన్నారు. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగడమే కాదు, అలా జరిగినట్లు ప్రజలకు కనిపించాలని సుప్రీంకోర్టు పలుమార్లు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికి లేదా రాజకీయ కథనాలను ముందుకు తీసుకెళ్లడానికి పోలీసుల అధికారిక ప్రకటనలను వాడుకోరాదని హితవు పలికారు. దర్యాప్తుసంస్థలు చట్టపరిధిలో స్వతంత్రంగా >>2

---

# 'చేతి'లో గెలుపు వ్యూహాలు!

### మున్సిపల్ ఎన్నికలపై సిఎం రేవంత్‌రెడ్డి ఫోకస్

### స్క్రీనింగ్ కమిటీ సిఫారసు మేరకే బిఫామ్స్ అందజేత

### నేడు మంత్రులు, నేతలతో సమావేశం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి2:** విదేశీ పర్యటన ముగిసి నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అప్పుడే పార్టీ, పాలనా వ్యవహారాలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికలపై సోమవారం ఆయన మంత్రులతో, నేతలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల బరిలో రెబల్స్ లేకుండా చూడాలని, గెలిచే అభ్యర్థులకే బిఫారాలు అందజేయాలని టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సూచించారు. అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచేలా వ్యూహాత్మకంగా వెళ్లాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఆయన మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా నియమితులైన మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్ మంత్రులతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, అభివృద్ధి పనులు, జిల్లాల వారీగా సంక్షేమ పథకాల అమలుపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా హాజరు కానున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై సిఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేయనున్నారు. కాగా, మున్సిపల్ ఎన్నికలపై టిపిసిసి ఎన్నికల కమిటీ చర్చించింది. జూమ్ మీటింగ్‌లో సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, నేతలు చర్చించారు. స్క్రీనింగ్ కమిటీ సిఫారసు మేరకే బిఫామ్స్ ఇవ్వాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఈ కమిటీ సిఫారసు చేసిన జాబితాను ఆమోదిస్తూ ఏకగ్రీ తీర్మానం చేశారు. కాగా, వివిధ జిల్లాల్లో కాంగ్రెస్‌లో బిఫారాల గొడవ కొనసాగుతోంది. పలు చోట్ల ఎమ్మెల్యేలు తమ అనుచరులకే టిక్కెట్ కావాలని పట్టుబడటంతో సర్దుబాటు కోసం మంత్రులకు సూచనలు చేసినట్లు తెలిసింది. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పలువురు ఎమ్మెల్యేలు ఉన్న చోట కాంగ్రెస్ పాత నేతలు తమకే టిక్కెట్ కావాలని పట్టుబడుతున్నట్లు సమాచారం.

## కోఠిలో దోపిడీ చేసిన నేరగాళ్ల గుర్తింపు 3

---




## ప్రభుత్వానికి సుప్రీంలో చుక్కెదురు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి2:** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త నల్లబాలుపై రాష్ట్ర హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను >>2

---

# మున్సిపోల్స్‌లో రెబెల్స్ బెడద




### సొంతపార్టీలోనే లెక్కకు మించి నామినేషన్లు

### ఆ సమస్య పరిష్కారానికి సమన్వయ కమిటీలు

### ఒక్క మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లోనే 60 డివిజన్లకు 328 మంది కాంగ్రెస్ అభ్యర్థులు

### నేడు నామినేషన్ల పత్రాల ఉపసంహారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి2:** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం ఉత్కంఠభరితంగా మారింది. ముందు ఇంటి పోరు గెలిచి, తర్వాత రచ్చ పోరు గెలవాల్సిన పరిస్థితి వచ్చింది. సొంత పార్టీ వారే లెక్కకు మించి నామినేషన్లు వేయడంతో, ప్రధాన పార్టీలకు వారిని బుజ్జగించడం సవాలుగా మారింది. దీన్ని పరిష్కరించేందుకు ఎక్కడికక్కడ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేశారు. నామినేషన్ల ఉపసంహారణకు 3వ తేదీ వరకు మాత్రమే సమయం ఉంది. అదే రోజు బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పొందుపరుస్తుంది. ఈ నేపథ్యంలో పోటీకి దిగిన వారిని తమ దారిలోకి తెచ్చుకోవల్సిన అవసరం ఉంది. మరోవైపు టికెట్ దక్కక దిగులు పడుతున్న వారిని మచ్చిక చేసుకునేందుకు ప్రత్యర్థి పార్టీ ఎత్తులు వేస్తోంది. ఈ నెల 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు మొత్తం 29,694 నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియ ముగిసింది. అభ్యర్థులిచ్చిన సమాచారాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి 19,608 నామినేషన్ పత్రాలను ఒకే చేశారు. వాటిలో కాంగ్రెస్ నుంచే 10,024 అంటే దాదాపు మూడో వంతు ఉన్నాయి. మొత్తం 2,996 వార్డులకు ఎన్నికలు జరుగుతుండగా సగటున కాంగ్రెస్ నుంచి ఒక్కో వార్డుకు మూడుకు పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ తరపున 7,556 మంది, బీజేపీ నుంచి 5,457 మంది నామినేషన్లు వేశారు. ఈ నేపథ్యంలో బరిలో రెబెల్ అభ్యర్థులు లేకుండా చూసేందుకు అన్ని పార్టీల నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. సహజంగానే అధికార పార్టీ అయిన కాంగ్రెస్ నుంచి పోటీ అభ్యర్థులు అధికంగా ఉన్నారు. అత్యధికంగా మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు 328 మంది కాంగ్రెస్ అభ్యర్థులు పోటీకి దిగారు. వీరిలో 268 మందిని ఉపసంహరించుకునేలా చేయాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ప్రాతినిధ్యం వహించి ఉండటం, మహబూబ్‌నగర్ పట్టణంతో ఆయనకు మంచి అనుబంధం ఉండటంతో స్థానిక నాయకులు తమ ఉనికి చాటుకునేందుకే పోటీకి దిగారని తెలుస్తోంది. పీసీసీ >>2

---



బాలిక ప్రాచి (ఫైల్)



నిందితుడు (ఫైల్)

## 'సర్పంచ్' కోసం కూతుర్ని కడతేర్చాడు..

### సహకరించిన గ్రామ సర్పంచ్

### మహారాష్ట్రలో ఎన్నికలు.. నిజామాబాద్‌లో దారుణం.. నిందితుల అరెస్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** సర్పంచ్ ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు వుంటే అనర్హులని నిబంధన వుండడంతో మహారాష్ట్రలో ఓ వ్యక్తి తన ముగ్గురు పిల్లలలో ఒక అమ్మాయిని హత్య చేసి శవాన్ని నిజామాబాద్‌లో పంట కాలువలో >>2



సోమవారం పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని సన్మానిస్తున్న సిఎం రేవంత్

## పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ నోరి దత్తాత్రేయుడుకు సిఎం రేవంత్ సన్మానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి2:** ప్రభుత్వ సలహాదారు, పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ నోరి దత్తాత్రేయుడు సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పద్మభూషణ్ అవార్డు పొందిన నోరి దత్తాత్రేయుడును ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దత్తాత్రేయుడుకు శాలువ కప్పి సన్మానించారు.

## రైల్వేకు భారీగా నిధులు

>> వివిధ రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అలాగే తెలంగాణలోని రైల్వే నెట్‌వర్క్ ఇప్పటికే 100 శాతం విద్యుదీకరణ సాధించిందని మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, అందులో మూడు కారిడార్లు హైదరాబాద్ నుంచి ప్రారంభమై లేదా హైదరాబాద్‌ను కలుపుతూ ఉంటాయని అశ్విని వైష్ణవ్ వివరించారు. ఇవి ప్రయాణ సౌకర్యాన్ని గణనీయంగా మెరుగుపరచడంతో పాటు ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గిస్తాయని అన్నారు. ఈ మూడు కారిడార్లు కలిసి ఒక త్రిభుజ ఆకారాన్ని ఏర్పరచి, విద్య, వైద్యం, వ్యాపారం వంటి రంగాలకు దోహదపడే ఆర్థిక వృద్ధి కారిడార్‌గా మారనున్నాయని తెలిపారు. హైస్పీడ్ రైళ్ల ప్రారంభంతో హైదరాబాద్-బెంగళూరు మధ్య ప్రయాణ సమయం సుమారు 2 గంటలు, హైదరాబాద్-చెన్నై మధ్య 2 గంటల 55 నిమిషాలు, హైదరాబాద్-పూణే మధ్య 1 గంట 55 నిమిషాలకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ నిరంతర ప్రయత్నాలు తెలంగాణను అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక, ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు అనుసంధానాన్ని బలోపేతం చేసి ప్రయాణికులకు మరింత సౌకర్యాన్ని కల్పిస్తాయని మంత్రి తెలిపారు.

### 'సర్పంచ్' కోసం కూతుర్ని

## కడతేర్చాడు..

>> పడవేశాడు. ఈ దారుణంలో సదరు కసాయి తండ్రికి స్థానిక గ్రామ సర్పంచ్ సహకరించడం విశేషం. వివరాలు ఇలావున్నాయి. మహారాష్ట్రలో త్వరలో సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో కెరూర్‌కు చెందిన పాండురంగ అనే వ్యక్తి సర్పంచ్‌గా పోటీ చేయాలనుకున్నాడు. అయితే ఇతనికి ముగ్గురు సంతానం కావడంతో పోటీకి అనర్హుడుగా సహచరులు తెలిపారు. ఇదే విషయాన్ని స్థానిక గ్రామ సర్పంచ్ గణేష్ షిండేను కలిసి సలహా అడగగా ముగ్గురు సంతానంలో ఒకరిని అంతమొందించాలని గణేష్ షిండే చెప్పాడు. దీని తరువాత పాండురంగ తన పెద్ద కుమార్తె ప్రాచి (10)ని చంపాలని నిర్ణయించుకున్నాడు. గ్రామ సర్పంచ్ గణేష్‌షిండేతో కలిసి తన కుమార్తెను మహారాష్ట్ర నుంచి నిజామాబాద్ జిల్లా ఏఆర్పీ వద్ద నిజాంసాగర్ కాలువ వద్దకు తీసుకువచ్చారు. అక్కడ ప్రాచి గొంతు నులిమి చంపారు. దీని తరువాత బాలికను నిజాంసాగర్ కాలువలో పడవేసి తమ గ్రామానికి వెళ్లి పోయారు. రెండు రోజుల క్రితం ప్రాచిని పాండురంగ, గణేష్‌లు చంపగా ఈ ఘాతుకం ఆదివారం వెలుగు చూసింది. అయితే పాండురంగ భార్య కుమార్తె ఏమయ్యిందని నిలదీయగా మొదట తనకేమి తెలియదని బుకాయించాడు. గట్టిగా నిలదీయడంతో నేరం అంగీకరించాడు. దీంతో పాండురంగ భార్యతో పాటు ఇతర కుటుంబ సభ్యులు నిజాంసాగర్ కాలువ వద్దకు రాగా అప్పటికే బాలిక శవాన్ని పోలీసులు బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించి ఈ శవం ఎవరిదనే దానిపై వాకబు చేస్తున్నారు. పాండురంగ భార్య తన కుమార్తె శవాన్ని గుర్తించడంతో దీనిపై కేసు నమోదు చేసిన నిజామాబాద్ జిల్లా పోలీసులు చేసి బాలికను హత్య చేసినందుకు పాండురంగతో పాటు గ్రామ సర్పంచ్ గణేష్ షిండేలను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ ఘటన అటు మహారాష్ట్రలో ఇటు నిజామాబాద్‌లో సంచలనం రేపింది.

## మున్సిపోల్స్‌లో రెబెల్స్ బెడద

>> అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సొంత జిల్లా అయిన నిజామాబాద్ కార్పొరేషన్‌లోని 60 డివిజన్లకు కాంగ్రెస్ నుంచి 319 మంది రంగంలోకి దిగారు. ఇక్కడ కూడా ఉపసంహారణలు సవాలుగా మారే పరిస్థితి ఉంది. ఇక్కడ ఛైర్మన్ ఎన్నికలో మజ్లిస్‌దే కీలకపాత్ర. ఉదాహరణకు గత ఎన్నికల్లో బీజేపీ 28 స్థానాలు గెలిచినా ఛైర్మన్ పదవి దక్కించుకోలేకపోయింది. కేవలం 13 స్థానాలు మాత్రమే పొందిన బీఆర్‌ఎస్, 15 స్థానాలు వచ్చిన మజ్లిస్‌తో కలిసి కార్పొరేషన్‌ను చేజిక్కించుకుంది. ఇప్పుడు మజ్లిస్ పార్టీ కాంగ్రెస్‌తో సన్నిహితంగా ఉండటంతో నిజామాబాద్ కార్పొరేషన్ దక్కించుకోవచ్చన్న ఆశావహ పరిస్థితులే ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేయడానికి కారణంగా భావిస్తున్నారు. బీజేపీ నుంచి కూడా ఇక్కడ 252 మంది నామినేషన్లు దాఖలు చేశారు. గత ఎన్నికల్లో అత్యధిక స్థానాలు దక్కించుకుంది.66 డివిజన్లు ఉన్న కరీంనగర్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ తరఫున 308 మంది నామినేషన్లు వేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి తీవ్రంగా పోటీ ఉన్నా కార్పొరేషన్‌ను దక్కించుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న కాంగ్రెస్ పార్టీ, అభ్యర్థుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. బీఆర్‌ఎస్ నుంచి కూడా అత్యధికంగా 257 మంది నామినేషన్లు వేశారు.మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఇంకో రకమైన పరిస్థితి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుటుంబం నుంచి ఆయన ఇద్దరు కుమారులు, భార్య నామినేషన్లు దాఖలు చేయడం చర్చనీయాంశంగా మారింది. తన ప్రమేయం లేకుండానే కొందరు నాయకులు అభ్యర్థులను ప్రకటిస్తున్నారన్న ఆగ్రహంతోనే లక్ష్మారెడ్డి ముగ్గురితో నామినేషన్లు వేయించారని తెలుస్తోంది. ఎమ్మెల్యేను బుజ్జగించేందుకు పార్టీ రాష్ట్ర నాయకులు ప్రయత్నిస్తున్నారు. నల్గొండ కార్పొరేషన్లో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఇక్కడి 48 డివిజన్లకు గాను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు 26 డివిజన్లకు తమ అభ్యర్థులను ప్రకటించారు. ఇందులో 4వ డివిజన్‌కు కత్తుల నాగేశ్వరి, 20వ డివిజన్‌కు నాంపల్లి అయ్యప్పల పేర్లు ప్రకటించారు. కానీ వీరిద్దరూ నామినేషన్లే వేయలేదు. గడువు కూడా ముగిసింది.

## ఇల్లీగల్ ఎలా?

>> పనిచేయాలని డిమాండ్ చేశారు. తీర్పులు ఇవ్వాల్సింది కోర్టులే తప్ప పోలీసుల సందేశాలు కాదని, రాజ్యాంగ పరిమితులను సంస్థలు అతిక్రమిస్తే ప్రజాస్వామ్యం మనలేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా, కెసిఆర్‌ను గౌరవ ప్రతిపక్ష నేతగా సిట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదో తెలంగాణ ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారని హరీష్ రావు ప్రశ్నించారు.

## రాష్ట్రంలో 500 కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు

>> దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 10 వేల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు (ఏటీఎల్) ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి దాదాపు 400 ల్యాబ్‌లు దక్కాయి.2024-25 బడ్జెట్‌లో వాటికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. 2025-26 రూ.500 కోట్లు కేటాయించారు. దేశవ్యాప్తంగా స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్)లో సుమారు 45 శాతం మంది అమ్మాయిలున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలో వీరి కోసం ఒక గర్ల్స్ హాస్టల్ నిర్మిస్తామని కేంద్రం ప్రకటించింది. ఈమేరకు తెలంగాణ రాష్ట్రానికి 33 హాస్టళ్లు రానున్నాయి.పరిశోధనలు, ఆవిష్కరణల అంశాలను కేంద్ర ఆర్థిక మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో హెచ్‌సీయూ, ఓయూ, జేఎన్‌టీయూ ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రయోగశాలల్లో కొనసాగుతున్న పరిశోధనలు మరింత వేగమందుకోనున్నాయి. ఓయూ, సురవరం ప్రతాపరెడ్డి తెలుగువర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, జేఎన్‌టీయూలకు రూసా (ఆర్‌యూఎస్‌ఏ రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్) నిధులు పెరగనున్నాయి. గతేడాది రూ.232 కోట్లు మంజూరు కాగా ఈ బడ్జెట్‌లో రూ.320 కోట్లు వచ్చే అవకాశాలున్నాయి. గ్రేటర్‌లో ప్రభుత్వ పాఠశాలకు పీఎంశ్రీ పథకం ద్వారా ప్రయోజనం లభించనుంది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వందకుపైగా పాఠశాలలకు ఈ పథకం కింద అదనంగా నిధులు రానున్నాయి. సమగ్ర శిక్షా అభియాన్ కోసం ఈ బడ్జెట్‌లో 10శాతం నిధులు ఎక్కువగా కేటాయించడం కూడా దీనికి కలిసొచ్చే అంశం.బాలికా విద్యకు భరోసానిచ్చేలా బడ్జెట్ కేటాయింపు చేశారు. యాదాద్రి, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో సాంకేతిక విద్యకు సంబంధించి జిల్లాకో బాలికా వసతిగృహం అందుబాటులోకి రానుంది. దాదాపు 2,879 ఉన్నత పాఠశాలల్లో ఎంపికైన వాటిలో కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు ఏర్పాటు కానున్నాయి. క్రీడాకారుల కోసం మౌలిక వసతులు దరిచేరనున్నాయి.

### వారం - వర్జ్యం

03-02-2026, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, శ్రవణ కార్తె
విదియ రా.12.45
మఖ రా.10.15
వర్జ్యం : ఉ.6.15-7.52
దు.ఉ.8.56-9.42, 2) రా.10.40-11.26
శుభసమయం:ఉ.5.15-6.00, సా.6.15-7.15
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం:**ఎంత చేసిన సంతృప్తి చెందని ఒక వర్గాన్ని దూరంగా ఉంచాలని కృత నిశ్చయానికి వస్తారు. శ్రమ అధికం.

**వృషభం:**నరఘోష అధికంగా ఉంటుంది. సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. కోపతాపాలకు దూరంగా వుండండి.

**మిథునం:** ముఖ్యమైన వనులలో సన్నిహితుల సహాయం అందుతుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం :**అంతరంగిక చర్చలు జరిగే చోట కొత్తవారికి చోటు కల్పించకండి. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**సింహం:**ముఖ్యంగా ఆర్థిక విషయాలలో గోప్యతకు ప్రాధాన్యతనిస్తే లాభపడగలుగుతారు.క్రయ విక్రయాలలో లాభాలు.

**కన్య:** ఏకపక్ష నిర్ణయాలు ఎంతమాత్రం లాభించవు. ఖర్చులను నిలువరించ లేకపోతారు.కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**తుల :** గాడి తప్పుతున్నాయని భావించిన అంశాలపైన దృష్టిని సారించి ఒకింత అనుకూల ఫలితాలు పొందుతారు.

**వృశ్చికం:**మీరు చేయాలి అనుకున్న కార్య క్రమాలను వెంటనే అమలు చేయడానికి కొన్ని ప్రతిబంధకాలు ఏర్పడతాయి.

**ధనుస్సు:**కాలయాలపనే తప్ప లాభనష్టాలు ఏర్పడవు. అలసటకు లోనవుతారు. ప్రయాణాలు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**మకరం:** బంధువుల సలహాలను పరిగణనలోనికి తీసుకోరు. దేవాలయ సందర్శనం చేస్తారు.వాహనసౌఖ్యం కలదు.

**కుంభం:** భూముల క్రయవిక్రయాలలో నిదానం అవసరం. ఓ మంచిపని చేసి చెడ్డవారవుతారు. వివాదాలకు దూరంగా వుండండి.

**మీనం :** ఇరువర్గాల మధ్య ఏర్పడిన విభేదాలను పరిష్కరించవలసిన గురుతర బాధ్యత మీపై పడుతుంది.వస్త్ర లాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తప్పుచేస్తే విచారణ తప్పదు

>> చేసుకుని.. హుందాగా తప్పుకుంటే కొంతైనా మీ గౌరవం నిలబడేదన్నారు. పైగా ప్రజలే తప్పు చేశారని చెప్పడం.. ఇదెక్కడి ప్రజాస్వామ్యం, ఇదెక్కడి ఉద్యమకారుడి లక్షణం, ఇదెక్కడి జాతిపిత లక్షణం అని ప్రశ్నించారు. అక్రమ మార్గం ఎంచుకున్న వారికి ప్రజాస్వామ్యంలో విచారణ ఎదుర్కోవాల్సిందే అని అంబేద్కర్ చెప్పారని, శిబు సోరెన్ లాంటి వాళ్లు విచారణ ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. మనమేం దైవాంశ సంభూతులం కాదు, మధ్య యుగాల చక్రవర్తులు తమ బాధను రాజ్యం బాధగా ప్రచారం చేసేవారని, ఇది ప్రజాస్వామ్య యుగమని, మధ్య యుగాల చక్రవర్తులకు కాలం చెల్లిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో తప్పు చేసినవారు విచారణ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు.

**జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అవార్డు దక్కడం సముచితం**

రావి నారాయణరెడ్డి జాతీయ పురస్కారం జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి దక్కడం సముచితమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. తొలి తరంలో బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి స్ఫూర్తినిస్తే, మలి తరంలో జైపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి లాంటి వాళ్లు తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తి నింపారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. 2019లో నిబద్ధత కలిగిన, ప్రశ్నించగలిగిన వారు రాజకీయాల్లో ఉండాలని జైపాల్ రెడ్డిని తాను కోరానని గుర్తు చేశారు. ఆ సమయంలో తరంమారింది.. ప్రత్యక్ష రాజకీయాలకు తను దూరం అని, యువతరం రాజకీయాల్లో ఉండాలని జైపాల్ రెడ్డి తనను ప్రోత్సహించారని తెలిపారు. సమాజంలో వస్తున్న మార్పును, ప్రజల ఆలోచనని గౌరవించిన గొప్ప నాయకులు జైపాల్ రెడ్డి, రావి నారాయణరెడ్డి అని సీఎం అన్నారు.జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నిబద్ధతమోదీని బయపెడుతుందని ఆయనను రాహుల్ ఉపరాష్ట్రపతిగా బరిలో దించారన్నారు. ప్రజలకు ప్రజాస్వామ్య స్ఫూర్తిని అందించాలనే ఏక పార్టీ, ఏక వ్యక్తి పాలనకు వ్యతిరేకంగా సుదర్శన్ రెడ్డి ఉపరాష్ట్రపతి ఎన్నికల బరిలో దిగారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తికి రావి నారాయణరెడ్డి పురస్కారం అందించడం సముచితమని ముఖ్యమంత్రి తెలిపారు.

**రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం కల్పిస్తాం**

అరాచక శక్తులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు రావి నారాయణరెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పేద ప్రజల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడి వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆయన పోరాడారన్నారు. బండెనక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి అని తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన బండి యాదగిరి లాంటి నిరక్షరాస్యులను ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. దేశంలో మొట్ట మొదటి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారన్నారు. ప్రజా తీర్పును ప్రతిబింబించేలా ఆనాడు మొట్టమొదటి పార్లమెంట్ భవనాన్ని రావి నారాయణరెడ్డితో నెహ్రూ ప్రారంభింపజేశారని సీఎం తెలిపారు. అరవై ఏళ్ల వయసులో ప్రజలకు స్ఫూర్తినిస్తూ పార్టీ, రాజకీయ పదవుల నుంచి తప్పుకున్న గొప్ప నేత రావి నారాయణరెడ్డి అన్నారు. ఈ కాలంలో ప్రజలు ఓడించినా కొందరు పదవులు వదులుకోవడానికి సిద్ధంగా ఉండటం లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల తరువాత రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. సచివాలయంలో అందరితో సమావేశమై తెలంగాణలో సముచిత గౌరవం కల్పించే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

**రాజ్యాంగంపై దాడిని తిప్పి కొట్టాలి**

రాజ్యాంగాన్ని రద్దు చేయడమే బీజేపీ రహస్య ఎజెండా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. మోదీ ప్రభుత్వం దేశంలో ఏక పార్టీ, ఏక వ్యక్తి వ్యవస్థను తీసుకువచ్చే కుట్ర చేస్తోందన్నారు. అబ్ కీ బార్ చార్ సౌ పార్ అనే నినాదం ఫలించకపోవడంతో రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాలరాయాలని బీజేపీ సర్(ఎస్ఐఆర్)ను తీసుకువచ్చిందన్నారు. ఓటు హక్కును కాలరాయాలన్న కుట్రపై కమ్యూనిస్టులు గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. రాజ్యాంగంపై దాడి జరుగుతోందని.. దీనిపై మనమంతా ప్రజల్లో చైతన్యం కలిగించాలని పిలుపునిచ్చారు. నాణానికి ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు కమ్యూనిస్టులు నిలిచి రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడాలని తెలిపారు. రావి నారాయణరెడ్డి నేషనల్ అవార్డు పొందడం ఎంతో గొప్పదిగా భావిస్తానని అవార్డు గ్రహీత జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు.రావినారాయణరెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. సొంత అస్తులను ప్రజలకు పంచిన మహానుభావుడని ప్రశంసించారు.

## ఇక కవిత దంపతుల విచారణ!

### ఫోన్ ట్యాపింగ్ కేసు:

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ విచారణ తరువాత తదు పరి విచారణ కవిత దంపతులతో పాటు ఉమ్మడి వరంగల్, కరీంనగర్‌కు చెందిన బిఆర్ఎస్ ముఖ్య నేతలను విచారించాలని సిట్ నిర్ణయించినట్లు తెలిసింది. ఈ కేసులో సిటీ పోలీసు కమిషనర్ సజ్జన్నార్ నేతృత్వంలోని రెండవ సిట్ ఏర్పాటయ్యాక దర్యాప్తు వేగం పుంజుకోవడం తెలిసిందే. రెండు వారాల వ్యవధిలో బిఆర్ఎస్ ఎంఎల్‌సి నవీన్ రావు, మాజీ మంత్రులు హరీష్ రావు, కెటిఆర్, మాజీ ఎంపి సంతోష్ రావులను వరుసగా సుధీర్ఘంగా విచారించిన సిట్ ఈ విచారణలో వెలుగు చూసిన సమాచారం ఆధారంగా ఆదివారం నాడు పార్టీ అధినేత కెసిఆర్‌ను నాలుగు గంటల 45 నిమిషాల పాటు విచారించడం విదితమే. కెసిఆర్ విచారణలో అనేక సంచలన విషయాలు వెలుగు చూసినట్లు తెలిసింది. అప్పట్లో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌లో చాలా వరకు వ్యవహారాలు కెసిఆర్‌కు తెలియకుండానే ఎస్ఐబి అధికారులు చాటుమాటుగా నడిపించారని నిర్ధారణ అయినట్లు తెలిసింది. ఎస్ఐబి చీఫ్‌గా ప్రభాకర్ రావుకు వరుసగా ఎందుకు ఎక్స్‌టెన్షన్ ఇచ్చారనే దానిపై కెసిఆర్ సరైన సమాధానం చెప్పలేదని తెలిసింది. ఇదే సమయంలో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కెసిఆర్ ఇచ్చిన వాంగ్మూలంలో కొత్త విషయాలు వెలుగు చూసినట్లు తెలిసింది. ఇందులో ఉమ్మడి వరంగల్, కరీంనగర్‌కు చెందిన బిఆర్ఎస్ ముఖ్య నేతలు ఫోన్ ట్యాపింగ్‌లో కీలకంగా వ్యవహరించారని సిట్ నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో అప్పట్లో ఉమ్మడి వరంగల్‌లో బిఆర్ఎస్‌ఓ కీలకంగా వ్యవహరించి, ప్రభుత్వంలోనూ పదవి అనుభవించిన ఓ ముఖ్యనేతతో పాటు మరో ముగ్గురు నేతలను సిట్ విచారించాలని భావిస్తున్నట్లు తెలిసింది. అప్పట్లో వరంగల్‌లో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఏకంగా ఒక ప్రత్యేక కేంద్రాన్నే ఆ కీలక నేత ఏర్పాటు చేసినట్లు సిట్‌కు ఆధారాలు లభించినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో నాటి పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతల ఫోలను ట్యాపింగ్ చేసేందుకు మొబైల్ ట్యాపింగ్ విభాగం ఏర్పాటు చేసినట్లు, వరంగల్‌లోనూ ఇలాంటిది నెలకొల్పినట్లు సిట్ అధికారులకు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అప్పట్లో సదరు నేత ఎవరి నంబర్‌ను ట్యాపింగ్ చేయాలని చెబితే దానిని ఎస్ఐబి అధికారులు ట్యాప్ చేసినట్లుగా సిట్ గుర్తించినట్లు తెలిసింది. వరంగల్ కేంద్రంగా సాగిన ఈ ట్యాపింగన ఖమ్మం జిల్లా నేతలను కూడా టార్గెట్ చేసినట్లుగా సిట్ గుర్తించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే అప్పట్లో ప్రతిపక్ష నేతలకు చెందిన డబ్బులు భారీగా పట్టుబడినట్లు సిట్‌కు ఆధారాలు లభించాయని సమాచారం. వరంగల్ తరువాత ఉమ్మడి కరీంనగర్‌లోనూ ఇలాంటి మొబైల్ ట్యాపింగ్ కేంద్రం పనిచేసిందని సిట్ గుర్తించిందని తెలిసింది. ఈ కేంద్రం కరీంనగర్‌లోని ప్రతిపక్ష నేతలతో పాటు స్వపక్ష నేతలను టార్గెట్ చేసినట్లుగా సిట్ గుర్తించిందని తెలిసింది. దీంతో పాటు నిజామాబాద్ జిల్లాలోని ప్రతిపక్ష, స్వపక్ష నేతలను ఈ కేంద్రం టార్గెట్ చేసిందని సిట్ నిర్ధారించినట్లుగా తెలిసింది. ఈ నేపథ్యంలో ఈ మొబైల్ కేంద్రాల నిర్వాహకులను విచారించేందుకు సిట్ నిర్ణయించి నట్లు సమాచారం. అంతకు ముందు ఫోన్ ట్యాపింగ్‌లో కవిత దంపతుల వాంగ్మూలం తీసుకునే వీలుందని తెలిసింది.



పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై చర్చించడానికి సోమవారం న్యూఢిల్లీలోని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను కలవడానికి వెళ్తున్న బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

## సంక్షోభం నుంచి గట్టెక్కాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి2:** ఏ మార్పు కావాలని తెలంగాణ ప్రజలు ప్రజాప్రభుత్వంపై విశ్వాసం ఉంచారో రెండేళ్లలోనే ఆ మార్పు స్పష్టంగా చూపించి ప్రజల విశ్వాసాన్ని నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి అన్ని రంగాలలోనూ మరీ ముఖ్యంగా ఆర్థిక రంగంలో పెను సంక్షోభమని ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఒక్కోమెట్టు పేర్చుకుంటూ సంక్షోభం నుంచి గట్టెక్కుతూ అభివృద్ధి,సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు.ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పునకు నాంది పలుకుతున్నాయని అన్నారు.వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నాయన్నారు. ఈ మార్పులను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకం. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాలనను రెండేళ్ల పూర్తి చేసుకుని మూడో వసంతంలోకి అడుగుపెట్టాం. రెండేళ్ల కాలం మరీ తక్కువే కానీ ప్రభుత్వం సాధించిన విజయాలు మాత్రం అత్యద్భుతం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టాం. ఎన్నికల్లో హామీలు ఇవ్వకపోయినా ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశాం అని చెప్పారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నాం. ఆర్థికవృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలను నిర్దేశించుకొని మరోవైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తూ, ద్విముఖ వ్యూహంతో మా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ తెలంగాణను రెండేళ్లలో దేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐపిఆర్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సీపీఆర్‌వో జి.మల్సూర్, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డిఎస్ జగన్, జాయింట్ డైరెక్టర్ రమణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## భారత్‌పై సుంకాలు 18%కి తగ్గింపు

>> వాణిజ్య ఒప్పందం ఖరారుకావడంతో అమెరికాకు సైతం కదలిక వచ్చింది. భారత్ తమకు అత్యంత ఆత్మీయమిత్రుడని, భారత్‌తో వాణిజ్యానికి నిరంతరం ప్రాధాన్యతనిస్తామంటూ అమెరికా వాణిజ్యమంత్రి, విదేశాంగమంత్రులు వంటివారుప్రకటనలిచ్చారు. ట్రంప్ అయితే ఒకసారి మోడీ తనకు మంచి మిత్రుడని, గొప్ప నాయకుడని, విజన్‌కలిగిన నాయకుడంటూ ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం భారత ప్రధానిమోడీతో ఫోన్‌లోసంభాషించానని, భారత్‌లాంటి దేశానికి శక్తివంతమైన నాయకుడని, ప్రజలందరి గౌరవాభిమానాలున్న నాయకుడితో సుదీర్ఘ సంభాషణ జరిపానని అన్నారు. వాణిజ్యం, రష్యాతో ఉక్రెయిన్ యుద్ధం ముగింపు వంటి కీలక అంశాలు కూడా చర్చకు వచ్చాయని, మోడీ రష్యా చమురు కొనుగోలు నిలిపివేతకు అంగీకరించారని, అమెరికా, వెనిజులాలనుంచి ఎక్కువశాతం కొనుగోలుచేస్తామని అంగీకరించారని ట్రంప్ తన సోషల్‌మీడియాలో వివరించారు. ఈ కార్యాచరణ ఉక్రెయిన్‌లో యుద్ధం ముగించేందుకు దోహదంచేస్తుందని, ప్రతీవారం అక్కడ వేలాదిమందిగా చనిపోతున్నారని ట్రంప్ పేర్కొన్నారు. ప్రధానిమోడీ విజ్ఞప్తిమేరకు తాను ట్రేడ్‌డీల్‌కు ఇరువురం పరస్పరం అంగీకరించామని, అంతేకాకుండా తక్షణమే 25 శాతం ఉంకాలను 18శాతానికి తీసుకువస్తున్నట్లుట్రంప్ ప్రకటించారు. భవిష్యత్తులో మరింత తగ్గుతాయని ఇక సుంకాల అడ్డంకులు రెండుదేశాలమధ్య ఉండవని, కొన్నింటిపై అసలు పూర్తిగా ఉండబోవని కూడా అన్నారు. ఎక్కువశాతానికే ప్రధానిమోడీ 'బై అమెరికన్'కకు కట్టుబడి ఉన్నారని, అమెరికా ఇంధన, టెక్నాలజీ, వ్యవసాయం, బొగ్గు, ఇతర కీలక ఉత్పత్తులపరంగా వాణిజ్యం వద్ద 500 బిలియన్ డాలర్లు వరకూ జరిగేఅవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. ఈ అవగాహన ప్రధానిమోడీ, తాను నేరుగా సంభాషించుకోవడం వల్లనే పూర్తి అయిందని, వేరొకరికి అసాధ్యమని ట్రంప్ సంతృప్తి వ్యక్తంచేసారు.

## ప్రభుత్వానికి సుప్రీంలో చుక్కెదురు

>> సుప్రీం న్యాయస్థానం డిస్మిస్ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్త నల్లబాలు పోస్టులు పెట్టారని పోలీసులు మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ కేసుపై గతంలో విచారణ చేపట్టిన రాష్ట్ర హైకోర్టు.. సదరు ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తూ పలు మార్గదర్శకాలను జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టులపై మెకానికల్‌గా కేసులు నమోదు చేయొద్దని పోలీసులకు సూచించింది. ఈ మార్గదర్శకాలు ఇబ్బందికరంగా ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వ తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా గతంలో ప్రస్తావించారు. ఈ కేసును సోమవారం విచారించిన సుప్రీం న్యాయస్థానం.. హైకోర్టు తీర్పును అభినందిస్తున్నామని, మార్గదర్శకాలు ఇవ్వడంలో తప్పేమీలేదని స్పష్టం చేసింది.

### ఎక్స్‌అఫిషియో సభ్యుల వివరాలు

## 14లోగా సేకరించాలి

### జిల్లా కలెక్టర్లకు ఎస్ఇసి రాణికుముదిని విడియో కాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి2:** కార్పొరేషన్ మేయర్,మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల కోసం ఎక్స్ ఆఫిషియో ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సూచించారు. మున్సిపల్ ఎన్నికలు జరగనున్న జిల్లాలకు సంబంధించి కలెక్టర్లు,అదనపు కలెక్టర్లతో సోమవారం ఎస్ఈసీ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 16న జరగనున్న మేయర్,డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ల పరోక్ష ఎన్నికపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్పొరేటర్లు,వార్డు కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యులకు ఓటు హక్కు ఉంటుందని కాబట్టి... ఆ జాబితా సిద్ధం చేయాలన్నారు. ఈనెల 11 నుంచి 14 వరకు కొత్తగా నమోదు చేసుకోవాల్సిన ప్రజాప్రతినిధుల వివరాలు సేకరించాలని, 16న కార్పొరేటర్లు,కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం తర్వాత చైర్‌పర్సన్,వైస్ చైర్‌పర్సన్,మేయర్,డిప్యూటీ మేయర్ ఎన్నిక ఉంటుందన్నారు. సమావేశానికి కనీసం సగం మంది సభ్యులుంటే కోరంగా పరిగణించాలని లేకపోతే మరుసటి రోజున నిర్వహించాలని, చేతులెత్తే విధానంలో ఓటింగ్ ఉంటుందన్నారు.

# కోఠిలో కాల్పులు జరిపి దోపిడీకి పాల్పడిన నేరగాళ్ల గుర్తింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** కోఠిలోని బ్యాంక్ స్ట్రీట్‌లో శనివారం ఉదయం ఎస్‌బిఐ ఎటిఎం వద్ద ఆరు లక్షల రూపాయల నగదు డిపా జిట్ చేసేందుకు వచ్చిన కేరళకు చెందిన వస్త్ర వ్యాపారి రిన్షద్‌పై రెండు రౌండ్ల కాల్పులు జరిపి అతని వద్ద వున్న నగదును దోచుకుని పారిపోయిన నేరగాళ్లను యుపికి చెందిన వారుగా గుర్తించారు. ఈ కేసులో పక్కాగా వ్యవహరించిన నేరగాళ్లు బాధితుడి స్యూటీపైనే కాచిగూడ వరకు పారిపోయి, అక్కడి నుంచి రైల్లే కొద్ది దూరం, అనంతరం బస్సులో కాటేధన్ వరకు వచ్చి ఆ తరువాత ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు ద్వారా యుపికి ఉడాయించారని పోలీసులు గుర్తించారు. నిందితులను గుర్తించే క్రమంలో పోలీసులు 800 సిసి కెమెరాలను జెల్లడ పట్టారు. నిందితులు వాడిన సెల్‌ఫోన్లను కూడా గుర్తించారు. నేరగాళ్లు వాడిన సెల్‌ఫోన్ల నంబర్లను విచారణ నిమిత్తం వెల్లడించలేదు. సెల్‌పోన్ పవర్ డంప్ ద్వారా వీటిని గుర్తించారు. ఫోన్ డంప్ అ నేది డిజిటల్ ఫోరెన్సిక్‌లో వాడే ఒక ప్రక్రియ. ఇందులో ఒక సెల్‌ఫోన్‌లోని మొత్తం డేటా బయటకు తీస్తారు. అంటే కాంటాక్ట్స్, మెసే జెస్, ఫోటో లు, వీడియోలు యాప్‌ల సమాచారం, బ్రౌజింగ్ హిస్టరీ లొకేషన్ డేటా వగైనా వుంటుంది. పోలీసు కేసుల విచారణకు క్రిమినల్ కేసులు, సివిల్ లి టిగేషన్ కార్పొరేట్ దర్యాప్తులో ఆధారాలు సేకరించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇద్దరు నిందితుల్లో ఒకతను పాత నేరగాడుగా గుర్తించారు. ఇత నిపై యుపిలో రివార్డు కూడా వున్నట్లు తేలింది. వీరిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు యుపికి వెళ్లి అక్కడి పోలీసుల సహకారంతో గాలింపు చేబట్టాయి. రెండు మూడు రోజుల్లోనే ఇద్దరు నేరగాళ్లు దొరికిపోయే వీలుందని సమాచారం.



# పోలీసులపై కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలకు హెచ్‌ఆర్‌సిలో టీంరైజ్ ఫిర్యాదు

## డిజిపి నుంచి నివేదిక కోరిన హక్కుల సంఘం

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** మేడారం జాతర సందర్భంగా కరీంనగర్ జిల్లా వీణవంక వద్ద పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ ఎస్ ఎంఎల్‌ఎ కౌశిక్ రెడ్డిపై రాష్ట్ర మానవ హక్కుల సంఘంలో ఫిర్యాదు అందింది. టీంరైజ్ అనే సంస్థ వైస్‌ఛైర్మన్ ఫహీం ఖురేషి సోమవారం దీనిపై హెచ్‌ఆర్‌సిలో ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులను, ముఖ్యంగా కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలంను ఉద్దేశించి కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇలాంటివి ఎంతమాత్రం సహించరానిదని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన హెచ్‌ఆర్‌సి సభ్యులు ప్రవీణ ఈ నెల 20వ తేదీలోగా దీనిపై నివేదిక ఇవ్వాలని డిజిపి శివధర్‌రెడ్డిని కోరారు. కాగా హెచ్‌ఆర్‌సిలో ఫిర్యాదు తరువాత మీడియాతో మాట్లాడిన ఫహీం ఖురేషి పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డిని బిఆర్‌ఎస్ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై తాను కెటిఆర్‌ను తాను ప్రశ్నిస్తే తనను బ్లాక్ చేశారని ఆయన తెలిపారు. ఎవరిని పడితే వారిని తిట్టడం, ఆ తరు వాత క్షమాపణలు చెప్పడం కౌశిక్‌రెడ్డికి అలవాటుగా మారిందని, ఇటు వంటిది మరోసారి పునరావృత్తం కాకుండా ఉండాలంటే తాజాఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# యుపి సోన్‌భద్ర రామ్‌లీల ప్రదర్శనలో అపశ్రుతి

## రావణ పాత్రధారి కంటికి గాయం చేసిన రాముడి బాణం

**సోన్‌భద్ర(యుపి), ఫిబ్రవరి 2:** ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లాలో జరిగిన రామలీల ప్రదర్శనలో అపశ్రుతి చోటుచేసుకుంది. రావణుడి వధ ఘట్టంలో రాముడి పాత్రధారి వేసిన బాణం గురితప్పి, రావణుడి పాత్ర పోషిస్తున్న వ్యక్తి కంటికి తగలడంతో తీవ్ర గాయమైంది. దీనితో పోలీసులు రాముడి పాత్రధారితో పాటు కార్యక్రమ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. షాగంజ్‌లో గతేడాది నవంబర్ 13న రామ్‌సనేహీ సింగ్ అనే వ్యక్తి రామలీల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సునీల్ కుమార్ రావణుడి పాత్ర పోషిస్తుండగా, నైతిక్ పాండే రాముడిగా నటించాడు. రామరావణ యుద్ధ ఘట్టం ప్రదర్శిస్తున్న సమయంలో నైతిక్ పాండే వేసిన బాణం రావణుడి కిరీటానికి బదులుగా సునీల్ కుమార్ కంటికి బలంగా తాకింది. దీంతో అతని కంటి నుంచి రక్తం వచ్చి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగినప్పటికీ నిర్వాహకుడు గానీ, రాముడి పాత్రధారి గానీ తనకు వైద్య సహాయం అందించలేదని బాధితుడు సునీల్ కుమార్ ఆరోపించాడు. చికిత్స కోసం ఆర్థిక సహాయం చేయాలని పలుమార్లు కోరినా వారు నిరాకరించారని వాపోయాడు. మరుసటి రోజు సాయం కోసం వారిని సంప్రదించగా, కులం పేరుతో దూషించి, చంపేస్తామని బెదిరించారని ఈ ఏడాది జనవరి 23న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై మొదట ఫిర్యాదు చేసినా పోలీసులు వెంటనే స్పందించలేదని బాధితుడు తెలిపాడు. చివరకు ఉన్నతాధికారుల సమీక్ష అనంతరం, షాగంజ్ పోలీసులు నిర్వాహకుడు రామ్‌సనేహీ సింగ్, నటుడు నైతిక్ పాండేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# టిజిపిఎస్‌సి ఒటిఆర్‌లో అదనపు సమాచారం అప్‌లోడ్‌కు గడువు పెంపు

## 25 వరకు అవకాశం.. ఎస్సీ వర్గీకరణను అభ్యర్థులు అప్‌డేట్ చేసుకోవాలి

## లేటెస్ట్ కలర్ ఫోటోను అప్‌లోడ్ చేయాలి: టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాబోయే నోటిఫికేషన్ల నేపథ్యంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి)లో వన్ టైమ్ రిజిస్ట్రేషన్ (ఒటిఆర్)లో మార్పులు చేర్పులు ఉంటే వెంటనే కమిషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని నిరుద్యోగ అభ్యర్థులకు కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం సూచించారు. ఒటిఆర్ అప్‌డేట్ ఈ నెల 25 వరకు అవకాశం కల్పించినట్టు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒటిఆర్‌లో వివరాలను అప్‌డేట్ చేసుకోవడానికి గత నెల 18న జారీ చేసిన వెబ్‌నోట్‌లో ఈ నెల 9వరకు అప్‌డేట్ చేసుకోవాలని సూచించిన నేపథ్యంలో.. ఆ గడువును కాస్త ఈ నెల 25 వరకు పొడిగించినట్టు ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అమలు చేస్తున్నందున.. ఎస్సీ అభ్యర్థులు తమ ఎస్సీ వర్గీకరణ వివరాలను తప్పకుండా ఒటి ఆర్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే అభ్యర్థులు గత ఒటిఆర్ నమోదు చేసుకున్న తరువాత వారి విద్యార్హత(క్వాలిఫికేషన్) పెరిగి ఉంటే అందుకు సంబం ధించిన క్వాలి ఫికేషన్‌ను అప్‌డేట్ చేసి వాటికి సంబం ధించిన పత్రాలను అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. దాంతోపాటు అభ్యర్థులు తమ లేటెస్ట్ కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫోటోను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

రాబోయే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ల నేపథ్యంలో అభ్యర్థుల వివరాలను సరిచూసుకోవడానికి ఈ అవకాశం కల్పించినట్టు కమిషన్ ఛైర్మన్ స్పష్టం చేశారు. అభ్యర్థికి సంబంధించిన చిరునామాలో మార్పు ఉన్నా, ఈడబ్ల్యుఎస్ వివరాలు, నాన్ క్రీమిలేయర్ వివరాలు, మొబైల్ నంబర్ మార్పు, ఈ-మెయిల్ ఐడీలో మార్పు ఉంటే వాటిని సరిచేసుకోడానికి ఒటిఆర్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ఇవి కాకుండా ఇతర వివరాలను మార్చడానికి ఒటిఆర్‌లో అవకాశం లేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఇపుడు సమర్పించే ఒటిఆర్ వివరాలనే భవిష్యత్తులో ఉద్యోగ దరఖాస్తులకు ప్రాథమిక సమాచారంగా పరిగణిస్తారని.. కాబట్టి ఒటిఆర్‌లో వివరాలను జాగ్రత్తగా పూర్తి చేయాలని కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం దాదాపు 31.56 లక్షల మంది అభ్యర్థులు ఒటిఆర్ వ్యవస్థలో నమోదు చేసుకున్నారు. భవిష్యత్తులో వచ్చే అన్ని నోటిఫికేషన్లు, దరఖాస్తులు, ఫలితాలు, తుది ఎంపికలను ఒటిఆర్‌లో అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా ఖచ్చితంగా ప్రాసెస్ చేయాలని కమిషన్ నిర్ణయించింది. ఒటిఆర్‌లో నమోదు చేసు కున్న అభ్యర్థులందరూ తప్పనిసరిగా అప్‌డేట్స్‌ను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

# సమాజంలో ఏకత, గుణాత్మకతతో దేశ భవిష్యత్తు

## సంఘ్‌ను అర్థం చేసుకోవాలంటే అందులో భాగం కావాలి

## శతాబ్ది ఉత్సవాల్లో ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భగవత్



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మోహన్ భగవత్ తదితరులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)ను అర్థం చేసుకోవాలంటే సంఘ్‌లో భాగం కావడం ద్వారానే ఆ అనుభవం సాధ్యమవుతుందని ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భగవత్ అన్నారు. సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన '100 ఏళ్ల సంఘ్ యాత్ర – కొత్త ఆశయాలు' కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన సుమారు వెయ్యి మంది మేధావులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలకే పరిమితం కాకుండా, వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం అనే సంఘ్ మూల సిద్ధాంతాన్ని మరింత విస్తరించేదిశగా పలు కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు. రెండు దశాబ్దాల్లో సంఘ్ కార్యం విస్తృతంగా పెరిగిందని, పైపైగా చూస్తే సంఘ్‌ను తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సంఘ్ ప్రధాన లక్ష్యం వ్యక్తి నిర్మాణమేనని స్పష్టం చేసిన డాక్టర్ మోహన్ భగవత్, ఈ కార్యం దీర్ఘకాలికమైనదని, పూర్తిగా కేంద్రీకృత ధ్యాసతో జరిగేదని చెప్పారు.

దేశవ్యాప్తంగా ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకులు లక్షా ముప్పైవేలకుపైగా సేవా కేంద్రాల ద్వారా సమాజసేవ చేస్తున్నారని తెలిపారు. అయితే సంఘ్ సేవా సంస్థ కాదని, పారా మిలటరీ సంస్థ కాదని, శారీరక అఖాడా లేదా సంగీత సంస్థ కూడా కాదని వివరిస్తూ, బయటి రూపాన్ని చూసి సంఘ్‌ను అర్థం చేసుకోవడం సరికాదన్నారు. కళ, రాజకీయాలు, విద్య, సామాజిక రంగాలు సహా అన్ని విభాగాల్లో స్వయం సేవకులు పనిచేస్తున్నారని, వారిని సంఘ్ ప్రత్యక్షంగా నియంత్రించదని, పూర్తి స్వయంప్రతిపత్తితో వారు పని చేస్తారని వెల్లడించారు. సమాజంలో ఏకత, గుణాత్మకత లేకుండా దేశ భవితవ్యం మారదని హెచ్చరించారు.

ఈ క్రమంలో సంఘ్ ప్రతిపాదిస్తున్న పంచ పరివర్తన్ అంశాలను వివరిం చారు. అవి కుటుంబ ప్రబోధన్, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ, పౌర విధులు అన్నారు. అంతర్జాతీయ సంబంధాలు, అంతర్గత భద్రత అంశాలపై స్పందించిన ఆయన, అక్రమ చొరబాట్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు పౌరులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని పిలుపు నిచ్చారు. సమాజ పరివర్తన ద్వారానే దేశ ఉన్నతి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

## 12 జిల్లాల్లో పరిశీలకులతో ఇంటర్ బోర్డు తనిఖీలు

## పరీక్షలకు 95 శాతం హాజరు

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సోమవారం నుంచి ప్రారం భమైన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్టు ఇంటర్ బోర్డు తెలిపింది. మొదటి రోజు పరీక్షలకు 95.72 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లలో పరీక్షలు ప్రారంభమ య్యాయి. మొదటి రోజు జరిగిన పరీక్షలను ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య నాంపల్లిలోని బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొదటి రోజు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి కొన్ని ప్రైవేటు కాలేజీల్లోని సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో.. వాటి గురించి ఇంటర్ బోర్డు అధికారులు ఆరా తీసి వెంటనే పనిచేసేలా చూశారు. రాష్ట్రంలోని 1440 పరీక్షా కేంద్రాల్లో అన్నింటిలో సీసీ కెమెరాలు పనిచేసేలా చూసినట్టు బోర్డు ఉన్నతాధికారులు తెలిపారు. మొదటి రోజు ప్రాక్టికల్ పరీక్షలకు 1,47,873 మందికి కేటాయించగా.. వారిలో 1,41,548 మంది పరీక్షలకు హాజరైనట్టు బోర్డు సెక్రటరీ తెలిపారు. 95.72 శాతం మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యారు. ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలించి, తనిఖీలు నిర్వహించడానికి రాష్ట్రంలో 12 జిల్లాల్లో ఇంటర్‌బోర్డు అబ్జర్వర్లను పంపించింది. నిజామాబాద్, కామారెడ్డి, నల్గొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జనగాం, హన్మకొండ జిల్లాల్లోని పరీక్షా కేంద్రాలకు పరిశీలకులను పంపి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలను ప్రశాంతంగా, ప్రశాంతంగా నిర్వహించినట్లు బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. రాష్ట్రంలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 5,26,192 మంది విద్యార్థులు హాజరు కానుండగా.. వారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1440 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఎంపీసీ విద్యార్థులు 2,74,007 మంది, బైపీసీ విద్యార్థులు 1,33,415 మంది హాజరు కానుండగా.. ఒకేషనల్ విద్యార్థులు 1,18,770 మంది హాజరు కానున్నారు.

# ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ సస్పెన్షన్

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ బి. వినోద పై వచ్చిన సమాచారంపై జిల్లా కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా కళాశాలను సందర్శించిన సమయంలో ప్రిన్సిపాల్ విధులకు గైర్హాజరు కావడం, ప్రిన్సిపల్ కార్యాలయ గదికి తాళం వేసి ఉందని, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులతో విచారణ జరిపినప్పుడు, ప్రిన్సిపాల్ ఈ నెల 29వ తేదీ నుండి తన చట్టబద్ధమైన విధులకు హాజరు కాలేదని, ఆసిఫాబాద్‌లో లేరని తెలిసిందని ప్రధాన కార్యాలయాన్ని వదిలివెళ్లేందుకు ప్రిన్సిపల్ ఎలాంటి ముందస్తు అనుమతి పొందలేదని తెలిపారు.

డిసెంబర్2025లో విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు విద్యా తరగతులు ప్రారంభించలేదని విద్యా ర్థులు, అధ్యాపకులచే నిర్ధారించబడిందని, విద్యా ర్థులు అపరి శుభ్రమైన పరిస్థితుల్లో ఉంటున్నారని, వారికి నాణ్యత లేని ఆహారం అందించబడుతుందని గమనించడం జరిగిందని తెలిపారు.

విద్యార్థులతో శుభ్రపరిచే పనులు, ప్రిన్సిపాల్ వ్యక్తిగత పనులు, వీధి కుక్కలు, పిల్లులకు ఆహారం పెట్టడం, వాటి పోషణ వంటి అంశాలపై ఒత్తిడి తెస్తున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారని తెలిపారు. విద్యార్థినుల వసతి గృహంలో సి.సి. కెమెరా అమర్చడం జరిగిందని, విద్యార్థినులు ఇబ్బం దులకు గురవుతున్నారని తెలిపారు.

ఈ కారణంగా ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయడం జరిగిందని, క్రమశిక్షణా చర్యలు ముగిసే వరకు/క్రిమినల్ అభియోగాలకు సంబంధించిన అన్ని చర్యలను ముగించే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని తెలిపారు. ఈ కాలంలో ప్రిన్సిపల్ బి.వినోద జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ఉండాలని, ముందస్తు అనుమతి పొందకుండా ప్రధాన కార్యాలయం నుండి బయటకు వెళ్లకూడదని తెలిపారు.



నర్సింగ్ విద్యార్థినులతో జిల్లా కలెక్టర్ కె.హరిత



# మోమోల వ్యామోహంలో 85 లక్షల ఆభరణాల చోరీ

## వ్యాపారుల మాయలో పడిన పూజారి కుమారుడు

**లక్నో, ఫిబ్రవరి 2:** చిరుతిండి మోమోల పట్ల ఒక బాలుడికి ఉన్న ఇష్టాన్ని గ్రహించిన వ్యాపారులు అతడ్ని ట్రాప్ చేశారు. ఇంట్లోని బంగారు ఆభరణాలు తెచ్చి ఇస్తే మోమోలు ఉచితంగా ఇస్తామని ప్రలోభపెట్టారు. ముగ్గురు మోమో విక్రేతలు ఆ బాలుడి నుంచి రూ.85 లక్షల విలువైన నగలు కాజేశారు. ఈ విషయం తెలుసుకున్న బాలుడి కుటుంబం షాక్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని డియోరియాలో ఈ సంఘటన జరిగింది. విమ్లేష్ మిశ్రా వారణాసిలో ఒక ఆలయ పూజారి. ఆయన కుమారుడు 7వ తరగతి చదువుతున్నాడు. ఆ బాలుడికి మోమోలంటే చాలా ఇష్టం. మోమోలు అమ్మే వ్యాపారులు ఆ బాలుడ్ని మెల్లగా ట్రాప్ చేశారు. ఇంట్లోని బంగారు ఆభరణాలు తెచ్చి ఇస్తే ఉచితంగా మోమోలు ఇస్తామని ఆశపెట్టారు. దీంతో ఆ బాలుడు కొంత కాలంగా ఇంట్లోని నగలు తెచ్చి వారికి ఇవ్వసాగాడు. ఉచితంగా మోమోలు తింటున్నాడు. మరోవైపు విమ్లేష్ మిశ్రా సోదరి ఇటీవల వారి ఇంటికి వచ్చింది. తన నగలు ఇవ్వాలని ఆమె అడిగింది. దీంతో ఆ కుటుంబం బీరువా తెరిచి చూడగా రూ.85 లక్షల విలువైన బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. ఆ బాలుడ్ని ప్రశ్నించగా మోమో వ్యాపారులకు నగలు ఇచ్చి వాటిని తిన్నట్లు చెప్పాడు. ఇది తెలుసుకుని కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. ముగ్గురు మోమో వ్యాపారులపై బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శిరోమణి అకాలీదళ్ నేత మజీతియాకు సుప్రీంకోర్టు బెయిల్

**చండీగఢ్, ఫిబ్రవరి 2:** కేబినెట్ మంత్రిగా అవినీతి కార్యకలాపాలతో రూ.700 కోట్ల అక్రమాస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న శిరోమణి అకాళీదల్ నేత బిక్రం సింగ్ మజితియాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీం ధర్మాసనం సోమవారం బెయిల్‌పై ఆదేశాలు జారీ చేసింది. కేసు పూర్వాపరాలు, విచారణ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు సుప్రీం పేర్కొంది. నిందితుడు ఏడు నెలలుగా జైల్లోనే ఉన్నాడని, అక్రమాస్తులు కలిగి ఉన్న సమయం 2007-17 అని, ఎఫ్ఐఆర్ నమోదైంది 2025లో అని అందువల్ల 2025 నాటి పీసీ యాక్ట్ ప్రకారం బెయిల్ ఇస్తున్నామని కోర్టు చెప్పింది. అక్రమాస్తుల కేసుకు సంబంధించి బిక్రం సింగ్‌పై సిట్ 2025 జూన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ వెంటనే అతడిని అమృత్ సర్‌లోని తన ఇంటి నుంచి పంజాబ్ విజిలెన్స్ బ్యూరోకి చెందిన పోలీసులు అరెస్టు చేశారు. అప్పటినుంచి అతడు న్యూ నభా జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. దీంతో బిక్రం సింగ్ పంజాబ్, హరియాణా హైకోర్టులో గతంలోనే బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఈ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. తర్వాత అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించగా బెయిల్ మంజూరు చేసింది. మరోవైపు ఈ కేసులో గత ఆగష్టులోనే పోలీసులు సప్లిమెంటరీ ఫైల్స్‌తోకలిపి 40వేల పేజీల చార్జిషీటు దాఖలు చేశారు. పంజాబ్‌కు చెందిన మజితియా శిరోమణి అకాళిదల్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, క్యాబినెట్ మంత్రిగా కూడా పని చేశారు.

# రాష్ట్రానికి పెరిగిన కేంద్ర పన్నుల వాటా

## 2026-27లో రూ.33,181 కోట్లు ఖరారు

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** కేంద్ర పన్నుల వాటాలో తెలం గాణకు పెరుగుదల చోటుచేసుకుంది. ఈ మేరకు రాష్ట్రానికి సంబంధించిన పన్నుల వాటా, వివిధ కార్యక్రమాల నిమిత్తం నిధుల కేటాయింపులను కేంద్రం 2026-27 వార్షిక అంచనా బడ్జెట్‌లో ఖరారు చేసింది. కేంద్ర పన్నుల నుండి తెలంగాణకు వచ్చే వాటా సొమ్ములో స్వల్ప పెరుగుదల ఉంది. దీని ప్రకారం 2026-27 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుండి పన్నుల్లో వాటాగా రాష్ట్రానికి మొత్తం రూ.33,180.78 కోట్లు విడుదల కానున్నాయి. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత వార్షిక అంచనా బడ్జెట్‌లో కేంద్ర పన్నుల కింద తెలంగాణకు మొత్తం రూ. 29,899.77 కోట్లు కేటాయిం పులు చేసింది. 2025-26 వార్షిక బడ్జెట్‌తో పోలిస్తే ఈ కొత్త బడ్జెట్ 2026-27లో రాష్ట్రానికి వస్తున్న పన్నుల వాటాగా నిధులు రూ.3,281.01 కోట్లు అధికం.

ఈ నేపథ్యంలో ఈసారి కొత్త బడ్జెట్‌లో రాష్ట్రానికి 2.174 శాతం మేర కేంద్ర పన్నుల వాటాగా మొత్తం రూ.33, 180.78 కోట్లు రాష్ట్రానికి ఖరారు చేసింది. ఇందులో ఆదాయపు పన్ను కింద రూ.11,808.15 కోట్లు కాగా, కేంద్ర జీఎస్టీగా రూ.9,074.92 కోట్లు, కస్టమ్స్ సుంకం నిమిత్తం రూ. 1,779.30 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీగా రూ.754.15 కోట్లు, కార్పొ రేషన్ పన్నుగా రూ.9,740.28 కోట్లు, ఇతర పన్నుల కింద రూ.32.98 కోట్లు రాష్ట్రానికి విడుదల కానున్నాయి.

NOTICE
IN THE COURT OF THE HONBLE 1ST ADDL SENIOR CIVIL COURT AT NEREDMET
O.S.NO. 487 OF 2025
BETWEEN
D. Lavanya & others Plaintiffs
and
The Thasildar R.R.Dist & All Concerned Defendants
To,
All Concerned
Please Take notice that my clients 1.D. Lavanya 2.Mrs Bhaylaxmi 3.Mr. Pradeep Raj has filed the suit for declaration to declare them as the legal heirs of deceased namely D.Shankar Raj alis D. Rajamani for the purpose of legal status against you
The main suit is posted on 18th February 2026 at 10:30 AM before the Honble 1ST Addl. Senior Civil Court at Neredmet. You are hereby inform to attend the court to above mention date and time if you fail to appear then the Honble court will proceed with the matter as per law.
HENCE THIS NOTICE
FROM
N. Chandra Sheela
(Advocate & Associales)
Office at 13-2-757/2, Rahimpura
Puranapul, Hyderabad
Cell.No. 8008635104
E Mail Id. Sheelachandra49@gmail.com

# ఎటిఎంలను టార్గెట్ చేస్తున్న ఉత్తరాది నేరగాళ్లు

## నిన్నటి వరకు ఎటిఎంల లూటీ

## నేడు ఎటిఎంల వద్దకు వచ్చే వారు, నగదు ఉంచే ఉద్యోగులపై కాల్పులు

## సిసి కెమెరాలను పోలీసుస్టేషన్లకు అనుసంధానం చేసే ప్రతిపాదన విఫలం

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎటిఎంలను ఉత్తరాది నేరగాళ్లు టార్గెట్ చేస్తున్న వైనం పోలీసులకు సవాల్‌గా మారింది. నిన్నటి వరకు జనావాసానికి దూరంగా వుండే ఎటిఎంలను లూటీ చేసిన నేరగాళ్లు ఇప్పుడు పట్టపగలు ఎటిఎంలలో నగదు నింపేందుకు వచ్చే సిబ్బందితో పాటు ఎటిఎంలలో నగదు డిపాజిట్ చేసే వారిపై జనం చూస్తుండగానే కాల్పులు జరుపుతూ దోపిడీలకు పాల్పడుతున్న తీరు పోలీసులను సైతం నివ్వెర పరుస్తోంది. శనివారం ఉదయం కోఠిలోని బ్యాంక్ స్ట్రీట్ వద్ద గల ఎటిఎంలో ఆరు లక్షల రూపాయలను డిపాజిట్ చేసేందుకు వచ్చిన వ్యాపా రిపై ఇద్దరు దుండగులు కాల్పులు జరిపి మొత్తం నగదును దోచుకుని రెప్పపాటులో ఉడాయించారు. ఎటిఎంల వద్ద నేరాలను నివారించేందుకు సిసి టివిలను సమీప పోలీసు స్టేషన్లకు అనుసంధానించాలనే ప్రతిపాదన ఏళ్ల తరబడి వున్నా ఆచరణలో పూర్తిగా అమలు కావడం లేదు.

ఎటిఎంలు ప్రజలకు ఎనీ టైం మనీ ఇచ్చేదిలా కాకుండా దొంగలకు ఎనీ టైం దోపిడి చేసేందుకు వీలుగా మారుతున్నాయి. గతంతో పోలిస్తే ఇటీ వల కాలంలో ఎటిఎంలను దుండగులు దోచుకుంటున్న ఘటనలు ఎక్కువయ్యాయని చెప్పాలి. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే నగదు చలామ ణి ఎక్కువగా వుండే దక్షిణాది రాష్ట్రాలలోనే ఎటిఎంల లూటీ, ఎటిఎంలలో నగదు జమా చేసేందుకు వచ్చే సిబ్బందిపై దాడులు జరిపి దోపిడీలు చే స్తున్న ఉదంతాలు ఎక్కువగా జరుగుతున్నాయి. జాతీయ క్రైం రికార్డు బ్యూరోలోని గణాంకాలు ఈ విషయాలు తేటతెల్లం చేస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలో ప్రతీ ఏటా 50 వరకు ఎటిఎంల లూటీ లేదా అక్కడి ఉద్యోగులపై దాడిచేసి నగదు దోపిడి ఘటనలు జరుగుతున్నాయంటే వీటిపై నేర గాళ్ల పంజా ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. తెలంగాణ వరకే వస్తే నిజామాబాద్‌లో గడచిన ఆరు నెలల కాలంలో నాలుగు ఎటిఎంలను నే రగాళ్లు కొల్లగొట్టారు. ఈ కేసుల్లో నిందితులు ఇప్పటి వరకు పట్టుబడలేదు. ఇదే సమయంలో గత ఏడాది తెలంగాణలో పదికి పైగా ఎటిఎం చోరీలు జరగగా ఇందులో కొని ్నంటిని దుండగులు ఏకంగా పెకిలించి ఎత్తుకెళ్లారు. ఈ నేరాలన్నీ బిహార్‌తో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన నేరగాళ్లే కార ణమని పోలీసులు చెబుతున్నారు. గతంలో గజ్వేల్‌తో పాటు పూర్వపు రాచకొండ పరిధిలో జరిగిన ఎటిఎం చోరీలు ఆయా ప్రాంతాల్లో కలకలం రే పాయి. ఏడేళ్ల క్రితం సంగా రెడ్డి జిల్లాలో మహారాష్ట్రకు చెందిన దొంగల ముఠా పెట్రోల్ బంకులతో పాటు రక్షణ తక్కువగా వున్న నాలుగు ఎటిఎం లను ధ్వంసం చేసి 50 లక్షల రూపాయలకు పైగా నగలను దోచుకున్న తీరు అప్పట్లో సంచలనం రేపింది.

ఈ డోపిడీలకు పాల్పడ్డ దుండగులలో కొందరు పట్టుబడినా చోరీకి గురైన నగదులో కొంతమేరకే లభించింది. 2021 ఏప్రిల్ నెలలో కూకట్‌పల్లిలోని పటేల్‌కుంట పార్క్ వద్ద జనం వున్న సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు నేరగాళ్లు హెచ్‌డిఎఫ్‌సి ఎటిఎంలో నగదు నింపుతున్న ఉద్యోగులపై కాల్పులు జరిపి ఐదు లక్షల రూపాయలను లూటీ చేశారు. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే నగదు చలామణి దక్షిణాది రాష్ట్రాలలో ఎక్కువగా వుండడం ఎటిఎంల దోపిడీ, లూటీలకు ప్రధాన కారణంగా పోలీసులు చెబుతున్నారు. తాజాగా శనివారం కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో నగదు డిపాజిట్ చేసేందుకు వచ్చిన వ్యాపారిపై కాల్పులు జరిపి ఆరు లక్షల రూపాయలను దుండగులు దోచుకున్నారు. ఈ దోపిడికి బిహార్ నేరగాళ్లు కారణమని భావిస్తున్నారు. ఎటిఎంలను దుండగులు పక్కా పథకంతో దోచుకుంటున్న తీరు పోలీసులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎటిఎంలపై జరుగుతున్న దాడులు, దోపిడీల ఉదంతాలు అక్కడ వున్న భద్రత డొల్లగా వుందని తేటతెల్లం చేస్తోంది.

### సిసిటివిలను పోలీసు స్టేషన్లతో అనుసంధానిస్తే..

ఇదిలా ఉండగా రాష్ట్రంలో వున్న 20 వేలకు పైగా వున్నాయి. రాష్ట్రంలోని ఎటిఎంల వరకు వస్తే దాదాపు అన్నింటి వద్ద సిసిటివిలు వున్నాయి. వీ టిని ఆయా బ్యాంకులకు అనుసంధానం చేస్తున్నా వీటివల్ల పెద్దగా ప్రయోజనం లేకుండా పోతోంది. దీనికి బదులు ఆయా ప్రాంతాల పోలీసు స్టేషన్లు లేదా ఓమ్ని పోలీసు వ్యవస్థతో అనుసంధానం చేస్తే నేరగాళ్ల భరతం పట్టేందుకు వీలుంటుందని పోలీసు అధికారులంటున్నారు. ప్రస్తుతం అన్ని పోలీసు స్టేషన్ పరిధుల్లో వేల సంఖ్యలో సిసిటివిలు వుండగా వీటిని నిరంతరం పర్యవేక్షించేందుకు స్టేషన్లలో ప్రత్యేకించి ఓ వ్యవస్థ వుంది. ప్రతి క్షణం అన్ని కెమెరాలను గమనించే సిబ్బంది వుంటారు. ఈ క్రమంలోనే అనేక నేరాలకు సంబంధించి నేరగాళ్లు సులభంగా దొరికిపోతున్నారు.

వార్త

మీరు చేయబోయే పని ఆధారంగా పేరు ప్రఖ్యాతులు పొందలేరు. చేసిన పని ద్వారా మాత్రమే.

-హెన్రీఫోర్డ్

# సత్వర న్యాయం.. అందని ద్రాక్ష

సమయానికి అందని న్యాయం అన్యాయం కిందే జమ చేసుకోవాల్సి వస్తుందని దేశంలో ఎంతో మంది కక్షిదారులు వారి దుస్థితికి వారే వాపోతున్నారు. దేశ న్యాయవ్యవస్థ ఎన్ని సంస్కరణలు చేపట్టినా వాటి ఫలాలు సామాన్యునికి చేరువ కావట్లేదు. దాంతో సత్వర న్యాయం పొందాలని కోర్టు మెట్లెక్కితే వాయిదాలతో కాలయాపన జరిగి తామెందుకు కోర్టును ఆశ్రయించామా అనే ధోరణిలో కక్షిదారులు ఆవేదన చెందుతున్నారు. ఎంతో కాలం ఎదురు చూసినా న్యాయం అందుతుందా లేదా అనే అంశంపై ఇప్పటికీ ఎన్నో సందేహాలున్నాయి. అందుకేనేమో ఓడిపోయిన వాడు కోర్టులో ఏడిస్తే, గెలిచిన వాడు కోర్టు బయట ఏడుస్తాడనే జనవాక్యం వింటుంటాం. ఇది అక్షరలా నిజం. అందుచే ఎలాంటి వివాదమైనా కోర్టు బయట పరిష్కారం వెతుక్కున్నవాడే విజేత అనే రోజులొచ్చాయి. ఏళ్ల తరబడి పరిష్కారం కాని కేసులెన్నెన్నో కోర్టులో ఉండిపోవడం వాయిదాలకు తిరగలేక, వయసుడిగిపోయి దేవుని మీదే భారం వేసి ఇంట్లో కూర్చున్న కక్షిదారులెంతో మంది తమ గెలుపు కోసం మీనమేషాలు లెక్కపెడుతున్నారు. అపుడెపుడో రావిశాస్త్రి అనే రచయిత న్యాయవ్యవస్థ, పరిపాలన, కక్షిదారుల గోడు వంటి అంశాలను క్రోడీకరించి ఓ నవల రాసారు. అది న్యాయ వ్యవస్థ, చట్టాలతీరు, జడ్జిల వ్యవహారశైలిని కూడా విస్మరించే అంశాలున్నాయి. వీటన్నిటిని ఆకళింపు చేసుకున్న బుద్ధిజీవి ఎవరైనా కోర్టు దరిదాపుల్లోకి రాడన్నమాట. అయినా వివాదాలు, విభేధాలు, ఓర్వలేనితనం, ఆశలు ఇవన్నీ వ్యక్తుల మధ్య తగాదాలు సృష్టిస్తాయి. మనిషిని నిలకడగా నిలబడనీయవు. బుద్ధికుశలతను కూడా ఉపయోగించనీయవు. అలా కోర్టుల వరకూ వివాదాలొస్తే ఏళ్లూ పూళ్లూ అయిపోయాక గాని తీర్పు బయటకురాదు. వచ్చినా దాని వల్ల లాభమో! నష్టమో! తెలియక కొన్ని జీవితాలు కొడిగట్టేస్తాయి. న్యాయ సంస్కరణల పేరిట సుప్రీంకోర్టు, ప్రభుత్వం కలిపి ఎన్నో సూచనలను కింది కోర్టులకు చేస్తున్నా అవి అమలులో సత్వర న్యాయానికి స్వల్పంగానైనా అడుగులు పడటం లేదు. వాయిదాల పర్వంలోనే కక్షిదారుల బతుకులు తెల్లారిపోతున్నాయి. దేశవ్యాప్తంగా చూస్తే 5.1 కోట్లకుపైగా పెండింగ్ కేసులు తీర్పుల కోసం ఎదురుచూస్తున్నాయి. కొన్ని విచారణకు నోచుకోలేదు. యేటా 2 నుంచి 2.5 కోట్ల కేసుల మేరకు పరిష్కారం జరుగుతున్నా కొత్తగా వచ్చే కేసులు కూడా అదేస్థాయిలో పెరుగుతన్నందున పెండింగ్ కేసులు తగ్గట్లేదు అనేది సుప్రీంకోర్టు భావన. వాళ్లదగ్గర ఉన్నఅంకెలు, అంచనాలు అవి. సుప్రీంకోర్టులో 90వేల కేసులు పరిష్కారం కోసం ఎదురు చూస్తుంటే అన్ని హైకోర్టుల్లో మొత్తం 63 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

నేషనల్ జుడీషయల్ డేటాగ్రిడ్ సమాచారం మేరకు తాజాగా మరికొన్ని కేసులు పెండింగ్ జాబితా లోకి చేరి పోయాయి. నిజానికి సామాన్యుని కేసులకే చెదలు పడ్తున్నాయని కక్షిదారులు వాపోతున్న అంశాలే. కింది కోర్టులో విచారణకు నోచుకోని కేసులుంటాయి. హైకోర్టుల్లో అప్పీల్ కేసులు ఉంటుంటాయి. ప్రస్తుతం సుప్రీం కోర్టు, హైకోర్టు, కిందికోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 'జీరో'కి రావాలంటే కనీసం 20 ఏళ్లుపడ్తుంది. అదీ కొత్త కేసులు, వ్యాజ్యాలు లేకపోతే, కానీ కొత్తవి వస్తే మళ్లీ అవీ పెండింగ్ జాబితాలోనే పడిపోతాయి. రోజుకిదోటి, అదోటి అని వంతులువేసుకున్నా కోర్టుల్లో తీర్పులు త్వరితగతిన రావాలంటే కష్టమే. కొత్త కేసులు నమోదు, కోర్టుల్లో జడ్జీల సంఖ్య తక్కువ, వాయిదాలు, స్టేలు వంటి అంశాలు కూడా కోర్టుల్లో పెండింగ్ కేసుల పెరుగుదలకు దారి తీస్తుంటాయి. న్యాయ సంస్కరణల పేరిట లోక్ అదాలత్‌ల నిర్వహణ మధ్యవర్తిత్వ పరిష్కారాలు వంటి ప్రయత్నాల వలనకూడా పెద్దగా ఫలితం ఉన్నట్లు కనపడదు. ఇదిలా ఉండగా న్యాయమూర్తుల సంఖ్య తగినంతగా లేనందున కోర్టుల్లో కేసుల పరిష్కారాలు ఆలస్యమవుతున్నాయి. భారతీయ న్యాయవ్యవస్థ సజావుగా నడవాలంటే కోర్టుల్లో ఖాళీగా ఉన్న న్యాయ మూర్తుల పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయాలి. అవన్నీ లేకనే ఆ వ్యవస్థ విమర్శలకు గురవుతోంది. దేశంలో ప్రతీ 10 లక్షల మందికి 50 మంది జడ్జీలు ఉండాలని లా కమిషన్ ఆఫ్ ఇండియా తన 120వ నివేదికలో సూచించింది. కానీ ప్రస్తుతం ప్రతీ 10 లక్షల మందికి కేవలం 22 మందే ఉన్నారు. ఈవిధమైన లోపభూయిష్ట విధానాల వలన సత్వర న్యాయం అందడంబహుకష్టమే. 2011 జనాభా లెక్కల ప్రకారం 2026నాటికి న్యాయమూర్తుల సంఖ్యపై కేంద్రం వద్ద స్పష్టమైన నివేదికలున్నాయి. సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులుండాల్సి ఉండగా 33 మందే ఉన్నారు. అలాగే దేశంలోని వివిధ హైకోర్టుల్లో 1122 మంది న్యాయమూర్తులు ఉండాలి. కానీ 814 మంది మాత్రమే ఉన్నారు. కింది కోర్టుల్లో 20,833 మంది న్యాయమూర్తులు పనిచేస్తున్నారు. వాయిదాలపై నిర్ణీత పద్ధతి లేకపోవడం వలన కోర్టుల్లో కేసులు సత్వర పరిష్కారానికి నోచుకోవడంలేదు. వ్యవస్థమొత్తం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. కోర్టులపైనున్న ఒత్తిడి జైళ్లమీదనూ ఉంటుంది. కోర్టుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడమేకాదు న్యాయాధికారుల సంఖ్యనూపెంచాలి. 'స్టే'విధానంపై కక్షిదారులకు ఇబ్బంది లేని విధానాన్ని ప్రవేశపెట్టాలి. ఒక కేసులో 'స్టే' లభిస్తే అదిసుదీర్ఘకాలం అటకెక్కినట్లే! ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం న్యాయవ్యవస్థ సరైన దిశగా నిర్ణయాలు తీసుకోగలి గితే కక్షిదారుకు సత్వర న్యాయం అందించే ప్రయత్నం జరగడమొక్కటే శరణ్యం.

న్యాయం గెలవడానికి ఒక్క కారణం చాలు. అన్యాయం గెలవడానికి సవాలక్ష సాకులు కావాలి.



తిరుక్కురళ్

మంచి చేయడానికి సిగ్గుపడకు. సత్యంగా ఉండు. నీవు ఆలోచిస్తున్నదే సరైనదని నిర్ణయించుకుంటే దానికి కట్టుబడి ఉండు.



జార్జ్ ఇలియట్

# ప్రజావాక్కు



### ఆచితూచి మాట్లాడాలి

ఆంధ్రప్రదేశ్ 2024 ఎన్నికలలో కూటమి పార్టీల మీద ఘోరాతిఘోరంగా ఓడిపోయిన వైసీపీ ఏదోవిధంగా వార్తల్లోనిలవాలని చంద్రబాబు ప్రభుత్వంమీద అనేక అపనిందలు మోపుతూ కాలం గడుపుతున్నట్లు కనిపిస్తునట్లుంది. ఈ పార్టీ ప్రతిపక్ష నాయకుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు గారి మీద అనుచిత వ్యాఖ్యలుచేసి పొరబాటు జరిగిందని తరు వాత అన్నా తెలుగు దేశం శ్రేణులు సంయమనం పాటించక ఆందోళనకుదిగారు. ఒక్కొక్కసారి ఇవిఉద్రిక్తలకు దారితీస్తున్నాయి. మౌనం, శాంతి మార్గాలనుపాటిస్తే అవతలి వారు వెనకకి తగ్గవచ్చు. మాజీ ప్రధాని పి.వి.ఎన్.ఆర్. ఈ పాలసీనిపాటించి అనేక ప్రత్యర్థుల నోళ్ళు మూయించారు. ఏమయినా వైసిపి నాయకులు తమ నోళ్ళను అదుపులో పెట్టుకోలేకపోవడం విచారకరం.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పిల్లలు.. వార్తా పత్రికలు

ఒకప్పటి వార్తా పత్రికలు చదివితే విజ్ఞానం పెరిగేది. ఎన్నో విషయాలు తెలిసేవి. అదే ఇప్పటి వార్తా పత్రికలు చదివితే ఉన్న విజ్ఞానం కాస్తా పోతుంది. ఇప్పుడు వస్తున్న వార్తాపత్రికల్లో మంచివార్తలు పాఠకులకు ఉపయోగపడే వార్తలు ఉండటం లేదు. చెత్త రాజకీయాలు, నాయకులతిట్లపురాణాలు పార్టీలగొడవలు, అక్రమ సంంధాలు, అత్యాచారాలు యువత పెడధోరణులు, విద్యార్థుల ఆత్మహత్యలు, సైబర్ నేరాలు, ఘోరాలు దారుణాలు నేడు బయట సమాజంలో జరుగుతున్నవి. ఇవే కనుక వార్తా పత్రికల్లో హెడ్‌లైన్‌లో ఇలాంటి వార్తలే ప్రచురించబడుతున్నాయి. ఇలాంటి వార్తలు పిల్లలు చదివితే వారి చిన్ని మనసుల్లో చెడు ప్రభావం పడుతుంది.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

భారతదేశంలో నిరుద్యోగం చాలా పెరిగిపోయింది. యువతే దేశానికివెన్నుముక. అలాంటి యువత ఈరోజున సరేనావాళ్ల చదువుకు దగ్గ ఉద్యోగాలు లేకపోవడం చాలా బాధాకరం. కనీసం ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ప్రత్యేక చట్టం తీసుకొచ్చి విద్యార్థికి వాళ్ళ వాళ్ల విద్యా సంవత్సరం పూర్తి అవగానే ఒక ఉద్యోగంఇవ్వాలి.

- నాగసూర్య రాఘవేంద్ర బాబు, తీపర్రు

### పేరులో ఏముంది?

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చారే కాని పూర్తిగా రద్దు చేయలేదు. అలానే ఈ పథకంలో ఎన్నో మార్పులు చేశారు. అయితే ఈ మార్పులు రాష్ట్రాలకు భారంగా ఉన్నాయని, అలాగే పేదలకు ఉపయోగపడేలా లేవని అందువల్ల ఈ పథకంలో ఎటువంటి మార్పులు చేయకుండా పేరుతోసహా మొదటి నుంచి ఎలా ఉందో అలానే యధాతథంగా అమలు చేయాలని ప్రతిపక్ష పార్టీలు గొడవ చేస్తున్నాయి. నిరసనలకు సిద్ధపడుతున్నాయి. ఇదంతా ఎందుకు? మనిషి పేరు ఎలా ఉన్నా జాతకం బావుంటే అతడు జీవితం కూడా బావుంటుంది. ఇది కూడా అలాంటిదే. గ్రామీణ పేదలకు ఏదో ఒక పేరుతో ఉపాధి దొరకటం ముఖ్యం.

- మిథునం, హైదరాబాద్

### మద్యనిషేధంపై అవగాహన పెంచాలి

భారతదేశం వంటి విభిన్న సాంస్కృతిక దేశంలో మద్యం వినియోగం ఎప్పటి నుంచో సామాజిక, ఆరోగ్య, ఆర్థిక సమస్యలకు మూలమై ఉంది. మద్యం తాగడం వ్యక్తిగత నిర్ణయమని కొందరు అంటారు, కానీ దానిప్రభావం సమా జంపైతీవ్రమైనది. గృహహింస, రోడ్డుప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు, పేదరికం మద్యాసక్తి వల్లే పెరుగుతున్నాయి. మద్యం వ్యసనం మన సమాజాన్ని నిశ్శబ్దంగా కరిగిస్తు న్న రుగ్మత. ప్రతి సంవత్సరం వేలాది మంది కాలేయ వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలతో మరణిస్తున్నారు. కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి,

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### భూస్వాములకు కూలీల సరఫరా

భూస్వాములకు కూలీలను అందించడం కోసమే ఉపాధి హామీని మార్చారా అనే అనుమానం కలుగక మానదు. 60 రోజుల విరామం రెండు ఏనెలలో ఏరాష్ట్రంలో ఏ జిల్లాలో పని పెట్టాలి అన్నది కేంద్రం నిర్ణయంచేస్తుంది. గ్రామాల్లో రైతులతో మాట్లాడినప్పుడూ రైతులు అడిగే ప్రశ్న ఒకటి ఎప్పుడు ఎదురు అవుతుంది. వ్యవసాయానికి రైతులను కూలీలను పంపవచ్చుగా అనేది ప్రశ్న. ఇటీవలి కాలంలో కూలీలు దొరకడం పెద్ద సమస్యగా మారింది. అందుకే తెలంగాణలో పెద్ద సమస్యగా మారింది. ఎక్కువ భూమి ఉన్న రైతుల నుండి ఉపాధి హామీ మీద అభిప్రాయం చెడుగా ఉంటుంది. అదివాళ్ల అవసరాలు తీర్చడం కోసమే. తెలంగాణ వరకు వస్తే పప్పు బెల్లంలా డబ్బులు పంచకుండా సమయం నీర్దేశించుకొని ఆస్తుల సృష్టి జరపాలి.

- భారత అవినాష్, జనగాం

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# యుజిసి నిర్ణయాలపై 'స్టే' సమంజసమా?

***ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ మాత్రం 2026 రెగ్యులేషన్స్, కానిస్టిట్యూషన్‌లో హక్కులను (బి.సిలు-మార్జినలైజ్డ్ బాక్ వర్డ్ వారిని) కాపాడే విధంగా ఉన్నాయని అభిప్రాయపడింది. యుజిసి నిర్ణయాలు ఒక్కొక్కప్పుడు విద్యాసంస్థలలో గొడవలకు దారితీస్తాయి. దానికి కారణం సమాజం చిన్న కులాలతో విడిపోయి ఉండడం వల్ల ప్రతి రూల్, ప్రతి ప్రొవిజన్, భూతద్ధంలో చూస్తున్నారు. రాజకీయ రంగు పులుముకొని వారి మాట మాట్లాడుతున్న విద్యార్థి సంఘాలు, వారి హక్కుల కోసం స్వతంత్రంగా పోరాడితేనే ఫలితాలు దక్కుతాయి కాని రాజకీయ నాయకుల మాటల వల్ల కానేకాదు.***



రావులపాటి సీతారాం రావు

మనదేశంలో ఉన్నత విద్యవిలువ మసకబారుతున్నది. ఈ మధ్యనే సుప్రీంకోర్టు ఈ విషయంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 'సమన్యాయం' అనే పేరుతో ఉన్నత విద్యాలయాల రూల్స్‌ను ప్రోత్సహించే విషయంలో విడుదల చేసిన ఆదేశాలను నిలిపివేస్తూ 'టూస్వీపింగ్' అన్న అభిప్రాయాన్ని కూడా వెలిబుచ్చటం దేశమంతటా విద్యాధికుల్లోనూ, విద్యాలయాల్లోనూ ఎడతెగని చర్చలకు దారితీసింది. వివక్ష కులపరంగా జరుగుతున్న తీరును సంస్కరించటం కోసం జనవరి 2026లో యుజిసి ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలు విడిపోని ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో రోహిత్ వేముల దురదృష్టకర ఆత్మహత్య, తర్వాత అనేక రకాల ప్రొటెస్టులు, విధ్వంసకాండ, దేశంలో కుల వివక్షల నేపథ్యంలో యుజిసి సుప్రీంకోర్టు ఆదేశాలతో సమస్య పరిష్కారానికి ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉన్నత విద్యాలయాలు (హైయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్) 2012 యుజిసి మార్గదర్శక ఫ్రేమ్‌ను పూర్తిగా విస్మరించటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. కులం, కులపరమైన వివక్ష ముఖ్యంగా ఉన్నత విద్యాలయాల్లో తీవ్రంగా ఉన్న విషయం అందరికీ తెలిసిందే. నిజానికి ఈ వివక్షను రూపుమాపటం, సామాజిక, రాజకీయ విద్యాపరమైన బాధ్యతగా గుర్తించి సరైన చర్యలు తీసుకోనంత కాలం ఈ పరిస్థితి కొనసాగుతూనే ఉంటుంది. చాలా మంది విద్యార్థులు దీనివల్ల తీవ్ర నష్టాన్ని కెరియర్‌పరంగా అనుభవించటమే కాకుండా ఎటూ తోచని పరిస్థితులలో జీవితాలను వృధా చేసుకున్న ఉదంతాలు కూడా చాలా ఉన్నాయి. గతించిన అయిదు సంవత్సరాలలో ఇలాంటి వివక్షపరమైన సంఘటనలూ, కేసులూ ఇబ్బడి ముబ్బడిగా ఉన్న విద్యాలయాల్లో పెరిగినట్లుగా గణాంకాలు తెలుపుతున్నాయి. యుజిసియే ఈ లెక్కలను బయటపెట్టింది. అయితే 2026లో 2012 ఫ్రేమ్‌వర్క్‌ను పూర్తిగా నీరుకార్చి ఈ కొత్త రూల్స్‌ను యుజిసి నోటిపై చేయడం వివాదాస్పదంగా మారింది.

అంతకు మునుపు ఉన్న 2012 రూల్స్ వివక్షకు సంబంధించిన విషయాలను గుర్తించటమే కాకుండా, ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం ఏర్పరిచి రిజర్వేషన్లు ఈ తరగతుల వారు పొందని విషయాలను కూడా స్పష్టపర్చటం జరిగింది. సమాన అవకాశాలు పొందే విధంగా సెంటర్స్‌ను ఏర్పరచటం, ఈక్విటీ కమిటీలు, హెల్ప్‌లైన్లు, స్క్వాడ్‌లు, టైం ప్రకారం కంప్లయింట్స్‌ను, సరైన మానిటరింగ్ విధానంతో పరిష్కరించటం, ఎంక్వయిరీ కమిటీలకు రిప్రజంటేషన్లు అమలుపర్చాలని కొత్తరూల్స్ చేసింది. అయితే హైయ్యర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఈ రూల్స్‌ను ఆచరణలో అమలు చేసినట్లు లేదు. ఉత్తర భారత్‌లోని కొన్ని యూనివర్సిటీ క్యాంపస్‌లలో ఈరూల్స్ అమలులో పట్టింపులు వచ్చి ప్రొటెస్టులకు దారితీసాయి. ఈ రూల్స్‌తో ఎస్సీ, ఎస్టీ ఓబిసి కులాలకు సంబంధించిన వివక్షనే నిర్వచించారు. ఫాల్స్ కంప్లయింట్స్ ఇచ్చిన వారిపై చర్యల విషయంలో రూల్స్‌లో ఎలాంటి ప్రొవిజన్ లేకపో వటం వివాదాలకు దారితీసింది. ఈ వివక్ష అనేది నిమ్న కులాల వారిపై కాబట్టి ఇతర కులస్థుల విద్యార్థుల విషయా న్ని రూల్స్‌లో పేర్కొనకపోవడం తప్పుపట్టి ప్రొటెస్టులు చేసేంత పెద్ద విషయమేమీకాదు. 2025 డ్రాఫ్ట్ రూల్స్‌లో తప్పుడు నేరారోపణ విషయంలో నిబంధనలు (చర్య తీసుకొనేందుకు ఉన్నాయి) ఇప్పుడు ఆ నిబంధనలను తిరిగి పొందుపర్చటం జరిగితే రాజకీయ యుద్ధాలు జరిగే అవకా శం ఉంది. వివక్షను ఆరోపణ చేసే ప్రతి కంప్లయింట్‌ను క్షుణ్ణంగా విచారించి చర్యలుతీసుకొంటే సరిపోతుంది. అంతే కానీ




ప్రతి ఆరోపణ మీద చర్యలు తీసుకోవాలని కొందరు పట్టుపట్టటం సమంజసం కాదేమో! ఇలాంటి సున్నితమైన వివక్షాపరమైన విషయాలలో ప్రభుత్వాలు రాజకీయంగా తీసుకోవాల్సిన నిర్ణయాలను కోర్టుల ద్వారా తీసుకొనిపోవటం సమంజసం కానేకాదు. ప్రభుత్వానికి మూడు అంగాలు విస్పష్టంగా ఉన్నప్పుడు ఏ విభాగం పని ఆ విభాగం చేసినప్పుడే ప్రభుత్వాలు నిజమైన ప్రజాభిమానం పొందగల్గుతాయి. ఈ మధ్యకాలంలో దాదాపు అన్ని ప్రభుత్వాలు ఎన్నికలను, అధికారాన్ని దృష్టిలోపెట్టుకొనే నిర్ణయాలు తీసుకుంటున్నాయి. దానివల్ల అధికార విభజన సూత్రానికి అర్థమే లేకుండాపోతున్నది. దేశంలోని వివిధ పార్టీల నాయకులూ, విద్యార్థి నాయకులూ సుప్రీంకోర్టు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2026 ఈక్విటీ రెగ్యులేషన్స్ మీద ఇచ్చిన 'స్టే'ను స్వాగతించారు. అయితే కులాన్ని ఆధారం చేసుకొని చూపిస్తున్న వివక్ష నిర్వచనం విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థి సంఘాలు, ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ ఆర్డర్‌ను వ్యతిరేకించాయి. యుజిసి కాస్ట్ బేస్డ్ డిస్క్రిమినేషన్' డెఫినేషన్‌ను నిలిపివేస్తూ జనరల్ కేటగిరిని వదిలేయటాన్ని సుప్రీంతప్పు పట్టింది. దాంతో 2012 రెగ్యులేషన్లే అమలులో ఉంటాయి. బహుజన సమాజ్ పార్టీ (మాయావతి) సరైన నిర్ణయంగా భావించింది. పైతరగతుల సొసైటీ వారికి కూడా యుజిసి రిప్రజెంటేషన్ ఇచ్చినట్లయితే బాగుండేది అన్నట్లు అభిప్రాయపడింది. సమాజ్‌వాదీ పార్టీ అఖిలేష్ యాదవ్ కూడా సమర్థిస్తున్నట్లు తెలుస్తున్నది. ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ మాత్రం 2026 రెగ్యులేషన్స్, కానిస్టిట్యూషన్‌లో హక్కులను (బి.సిలు-మార్జినలైజ్డ్ బాక్ వర్డ్ వారిని) కాపాడే విధంగా ఉన్నాయని అభిప్రాయపడింది. యుజిసి నిర్ణయాలు ఒక్కొక్కప్పుడు విద్యాసంస్థలలో గొడవలకు దారితీస్తాయి. దానికి కారణం సమాజం చిన్న కులాలతో విడిపోయి ఉండడం వల్ల ప్రతి రూల్, ప్రతి ప్రొవిజన్, భూతద్ధంలో చూస్తున్నారు. రాజకీయ రంగు పులుముకొని వారిమాట మాట్లాడుతున్న విద్యార్థిసంఘాలు, వారిహక్కుల కోసం స్వతంత్రంగా పోరాడితేనే ఫలితాలు దక్కుతాయికాని రాజకీయ నాయకుల మాటల వల్ల కానేకాదు. •

# సమస్యల వలయంలో మహిళా వైద్యులు!

డాక్టర్ బుర్ర మధుసూధన్ రెడ్డి

పద్దెనిమిది వందల నలభై తొమ్మిదిలో అమెరికాలో వైద్య పట్టా పొందిన తొలి మహిళ డాక్టర్ ఎలిజబెత్ బ్లాక్‌వెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని 2016 నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి03న జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం (నేషనల్ వూమెన్ ఫిజీషియన్స్ డే) జరుపుకుంటున్నాం. పవిత్రమైన వైద్య వృత్తి నుండి మహిళలను దూరంగా ఉంచిన అడ్డంకులను ఈ చారిత్రాత్మక సంఘటన బద్దలు కొట్టింది. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవ వేదిక వైద్య రంగంలో మహిళల అంకితభావం, పోరాట పటిమ, కరుణ హృదయాలను హైలైట్ చేస్తుంది, అదే సమయంలో కార్యాలయాల్లో లింగ సమానత్వ సాధన, పౌర సమాజ మద్దతు అవసరాన్ని పరిష్కరించడానికి దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఆసుపత్రులు, క్లినిక్‌లు, వైద్య పరిశోధనా రంగాల్లో అద్భుతమైన నైపుణ్యాలు, సహానుభూతి, రోగుల సంరక్షణ, వృత్తి నిబద్ధత కలిగి తమ జీవితాలను వైద్యరంగానికి అంకితం చేసిన మహిళా వైద్యులు ఎందరో మన ముందు ఉన్నారు. జాతీయ మహిళావైద్యుల దినోత్సవం సందర్భంగా మహిళా వైద్యుల నిస్వార్థ సేవలను గుర్తించడం మాత్రమే కాకుండా, లింగవేతన అంతరాలు, నాయకత్వ బాధ్యతలతో సహా కొనసాగుతున్న పలు అసమానతలను పరిష్కరించడానికి పిలుపునిస్తున్నది. ప్రస్తుతం దాదాపు 35 శాతం మంది వైద్యులు మహిళలున్నప్పటికీ, వైద్యపరంగా మరింత మెరుగైన లింగ సమానత్వాన్ని కోరుతున్నారు. ఈరోజు మహిళా వైద్యులు అభివృద్ధి చెందడానికి, ఆవిష్కరణలు చేయడానికి, అడ్డంకులు లేకుండా నడిపించడానికి సమగ్ర వాతావరణాన్ని కూడా కల్పించాల్సి ఉంటుంది. మహిళా ఫిజీషియన్లు రోగులను నయం చేయడమే కాకుండా, రేపటితరం మహిళా వైద్యులకుస్ఫూర్తినిస్తున్నారు. పౌర సమాజ జీవితాలను మెరుగుపరచడం, రోగులను జాగ్రత్తగా చూసుకోవడం, ఆధునిక వైద్యం సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడం లాంటి అంశాల్లో వారి నిబద్ధతను అభినందించాలి. దాదాపు మూడింట ఒక వంతు మహిళా వైద్యులందరూ కార్యాలయంలో లైంగికవేధింపులు,



ఎక్కువ మంది లింగ పక్షపాతాన్ని ఎదుర్కొంటున్నారు. భారతదేశంలో 19వ శతాబ్దం చివరలో పాశ్చాత్య ఆధునిక వైద్యాన్ని మొదటగా అభ్యసించిన డాక్టర్ ఆనందీబాయి జోషి (1886), డాక్టర్ కాదంబినీ గంగూలీ (1886) వంటి మహిళామణులు ఇతర మహిళా వైద్యులకు మార్గదర్శకులుగా ఎదిగారు. ప్రస్తుతం ఎంబిబిఎస్ విద్యార్థులలో దాదాపు 50 శాతం మంది మహిళలు ఉండడం లింగ అంతర నివారణకు గొప్ప సంకేతం. ఎక్కువ మంది మహిళా వైద్యులు ప్రసూతి (60శాతం), గైనకాలజీ (60శాతం), పీడియాట్రిక్స్ (58 శాతం), జనరల్ ప్రాక్టీస్ (57 శాతం), పబ్లిక్ హెల్త్ (55 శాతం) రంగాలను ఎంచుకుంటున్నారు, కానీ ఇప్పుడు వారు సూపర్ స్పెషాలిటీల ద్వారా అన్ని రంగాల్లోకి ప్రవేశిస్తున్నారు. సంఖ్య పెరుగుతున్నప్పటికీ, భారతదేశంలోని మొత్తం వైద్యుల్లో 14.2 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. జాతీయ ఆరోగ్య సంస్థలలో నాయకత్వ పాత్రలలో 28 శాతం మాత్రమే మహిళా వైద్యులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ ఆనందీబాయి జోషి (మొదటి భారతీయ మహిళావైద్యులు), డాక్టర్ కేతన్యున్ అర్దేశిర్ దిన్షా (మొదటి మహిళా రేడియో థెరపిస్ట్), డాక్టర్ ఇందిరా హిందూజా (మొదటి టెస్ట్ ట్యూబ్ బేబీ) ఆధ్వర్యంలోనే జన్మించారు. డాక్టర్ మంజుల అనగాని (లాపరోస్కోపిక్ సర్జన్), డాక్టర్ గగన్‌దీప్ కాంగ్ (రాయల్ సొసైటీ మొదటి మహిళా ఫెలో) వంటి మేటి మహిళా వైద్యులు భారతదేశ వైద్య రంగానికి చారిత్రాత్మక కృషి చేశారు. భారతదేశంలోని మహిళా వైద్యులు నేడు తీవ్రమైన వృత్తికుటుంబ సంఘర్షణ, లింగ పక్షపాతం, పరి మిత కార్యాలయ అభద్రత, వివక్షత, వేధింపులు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వైద్యులకు వృత్తివ్యక్తిగత జీవన సమతుల్యత, మానసిక ఆరోగ్య మద్దతు అవసరాన్ని గుర్తిద్దాం. ప్రస్తుత పౌర సమాజం, తల్లిదండ్రులు తమ యువబిడ్డలు, బాలికలను వైద్య రంగంలోకి రావడానికి ప్రోత్సహించాలి. మహిళల వైద్య రంగప్రవేశం, సమానత్వ సాధనలకు సహాయపడే ఉద్యమాన్ని ప్రారంభించండి. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం రోజు మహిళా వైద్యుల అద్భుతమైన విజయాలను కొనియాడడం, సహోద్యోగుల సహాయపడడం, స్నేహితుల ప్రోత్సాహం అందించడం, కుటుంబ సభ్యుల చేయూత, ఇతర వైద్యుల సహకారం, పౌర సమాజం మద్దతు ఇవ్వడం మన కనీస కర్తవ్యం అని భావిద్దాం. •

# 'తెలంగాణ రైజింగ్'లో దావోస్ పెట్టుబడులు

ఐ.వి.మురళీకృష్ణ శర్మ

రాజ నీతిజ్ఞుడు చాణక్య ఆర్థిక రంగంపై చేసిన సూచనలు వ్యక్తిగతంగానే కాకుండా ప్రభుత్వ పాలకులకు కూడా కీలకమైనవి. చాణక్య నీతి ప్రకారం అందుబాటులో ఉన్న వనరులన్నింటినీ పూర్తిగా సద్వినియోగం పర్చుకుంటూ వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటే ఆర్థిక ఇబ్బందులు లేకుండా, ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ పేదరికాన్ని నిర్మూలించవచ్చు. ఈసూత్రాన్ని తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తుంది. రాష్ట్ర భవిష్యత్, అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ఇందుకు కావాల్సిన ఆర్థిక వనరులను పెంచుకోవడామే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం వేస్తున్న అడుగులు విజయవంతం అవుతున్నాయి. దావోస్ వేదికగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తూ గత రెండు పర్యాయాలు భారీ పెట్టుబడులు సాధించిన తెలంగాణ ఇప్పుడుమరోసారి2026లో కూడా దావోస్ సమ్మిట్‌ను దిగ్విజయంగా వినియోగించుకుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన 2025 గ్లోబల్ సమ్మిట్ 2026 దావోస్ సమ్మిట్ తెలంగాణలో పెట్టుబడులకు సోపానంగా మారింది. రాష్ట్రం ప్రగతిపథంలో పయనించాలంటే బలమైన ఆర్థిక పునాదులుండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలుసఫలమవుతున్నాయి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2024 నాటికి వందేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో మన రాష్ట్రం అగ్రగామిగా నిలవాలని తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. 2025 గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా రాష్ట్రప్రభుత్వం 5.75లక్షల రూపాయల పెట్టుబడులు సాధించింది. అంతేకాక ఈ సమావేశాలతో రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై తెలంగాణ నిర్దేశించుకున్న లక్ష్యాలు ప్రపంచానికి చాటిచెప్పడంలో 2026 దావోస్‌వేదికగా జరిగిన రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం నెరవేరింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ బృందం పలు దేశ, విదేశీ కంపెనీలతో పెట్టుబడులపై అవగాహన కుదుర్చుకుంది. రూ.12,500 కోట్లతో రష్మి గ్రూప్ స్టీల్ ఫ్యాక్టరీ, రూ. 6000 కోట్లతో న్యూక్లర్ సంస్థ విద్యుత్ ప్లాంట్, రూ. 3500 కోట్లతో లోరియల్ జీసీసీ, రూ.వెయ్యి కోట్లతో సర్గాడ్ విమానాల మరమ్మతు యూనిట్ ఏర్పాటు, రూ.5 వేల కోట్ల పెట్టుబడితో యూపీసీ వోల్ట్ డేటా సెంటర్, రూ.623 కోట్లతో స్పైడర్ సంస్థ యూనిట్ల విస్తరణ, నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రెన్యూవబుల్స్ గ్రూప్ 100 మెగావాట్ల సామర్థ్యంతో ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్, రూ.150 కోట్లతో గోద్రేజ్ డెయిరీ ప్లాంట్ విస్తరణకు దావోస్ వేదికగా తెలంగాణతో అవగాహన కుదుర్చుకున్నాయి. ఇవేకాక మరిన్ని కంపెనీలు కూడా రాష్ట్రంలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తూ ప్రణాళికలు రూపొందిస్తూ తెలంగాణ బృందంతో చర్చలు జరిపాయి. కంపెనీలు, పెట్టుబడులతో రాష్ట్రంలో ఉద్యోగావశకాలు కూడా పెరగనున్నాయి. ఉదాహరణకు రష్మి స్టీల్ ప్లాంట్‌తో 12వేలమందికి, యూపీసీ వోల్ట్ డేటా సెంటర్ ద్వారా 4 వేల మందికి, యూపీసీ రెవెన్యుబుల్స్ కంపెనీతో నిర్మాణ దశలోనే 3వేల మందికి ఉపాధి లభించనుంది. లోరియల్ కంపెనీ తన కొత్త గ్లోబల్ టెక్ హబ్ ఏర్పాటు కోసం హైదరాబాద్‌ను ఎంచుకోవడంతో ఏఐ నిపుణులు, టెక్ ఇంజినీర్లు, డేటా సెంటిస్టులకు 2వేలకు పైగా ఉద్యోగావకాశాలు రానున్నాయి. దావోస్ వేదికగా దిగ్గజ కంపెనీలను ఆకర్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం పలు నూతన విధానాలను తీసుకొచ్చింది. అందులో భాగంగా వచ్చే ఐదేళ్లలో 25 బిలియన్ యూఎస్ డాలర్లు అంటే 2.29 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు సుమారు 5 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా తెలంగాణ లైఫ్ సైన్స్ పాలసీ (2026-30) రూపొందించింది. రాష్ట్రాన్ని ప్రపంచంలోని అగ్రగామి ఐదు లైఫ్ సైన్స్ క్లస్టర్లలో ఒకటిగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా గ్రీన్ ఫార్మాసిటీ అండ్ ఫ్లాగ్ షిప్‌ఫార్మా విలేజెస్ కార్యక్రమాన్ని అమలు చేయనుంది. రూ. వెయ్యి కోట్లతో నిధితో ఈరంగంలో నూతన ఆవిష్కరణను ప్రోత్సాహించనుంది. 2036 ఒలింపిక్స్‌లో భారత్ పతకాలు సాధించేలా క్రీడాకారులను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి టాటా గ్రూప్‌తో చర్చలు జరపడంతో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు క్రీడా మైదానాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడానికి వారుముందుకొచ్చారు. తెలంగాణలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఉన్న సానుకూలమైన అవకాశాలు, అనుకూల వాతావరణం, పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రూపొందించిన విధానాలను దావోస్ సమ్మిట్‌లో పంచుకున్న సీఎం కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రతిఏటా దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు అనంతరం దానికి అనుగుణంగా గ్రేటర్ హైదరాబాద్‌లో జూలై, ఆగస్టు నెలల్లో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. దీని ద్వారా దావోస్ ఒప్పందాలను, పురోగతిని సమీక్షించడంతో పాటుప్రభుత్వం, కంపెనీల మధ్య సమన్వయం పెరిగే అవకాశాలుంటాయి. ఈ ప్రతిపాదన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. మరోవైపు తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలు, రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే ప్రణాళికలు దావోస్‌లో పెట్టుబడుదారులను ఆకర్షించాయి. తెలంగాణ రైజింగ్‌లో భాగంగా మూడు జోన్ల నమూనాతో పాటు క్యూర్, ప్యూర్, రేర్ ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో గ్రేటర్ నగరంలో భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో పలు కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చాయి. ఏరోస్పేస్, డిఫెన్స్, బయో డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా తదితర రంగాలకు గ్రేటర్ హైదరాబాద్ అనుకూలంగా ఉండడంతో పాటు ఇక్కడున్న స్థానికంగా ఉన్న సహజ వనరులు, మానవ వనరులతో కూడా తెలంగాణ పెట్టుబడులకు సానుకూలంగా మారింది. అంతేకాక నగరం చుట్టూ ఓఆర్ఆర్, రహదారులు, నగరం నలువైపులా మెట్రో రైలు విస్తరణ వంటి రవాణా సౌకర్యాలు పెంపుకు ప్రభుత్వం పనులు ప్రారంభించింది. రాష్ట్రాన్ని పెట్టుబడులకు కేరాఫ్‌గా మార్చేందుకు కృషిచేస్తున్న ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఒక్కొక్కటీ సఫలీకృతం అవుతండడంతో తెలంగాణకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. దావోస్ వేదికగా 2024లో రూ. 40,832 కోట్లతో 18పరిశ్రమలు, 2025లోరూ.1,78,950 కోట్లతో 26 పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్న తెలంగాణ ప్రభుత్వం వరుసగా మూడోసారి దావోస్‌లో మరిన్ని పెట్టుబడులను సాధించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ పేరుతో పెట్టుబడులకు కేంద్రంగా మారుతోంది. హైదరాబాద్, సికింద్రా బాద్, సైబరాబాద్ నగరాలకు తోడుగా నాలుగో నగరం ఫ్యూచర్ సిటీ నిర్మిస్తుండటంతో పెట్టుబడులకు అనుకూలంగా మారింది. ఈనాలుగో నగరంలో ఐటీ అభివృద్ధితో పాటు ఆపిల్ ఫోన్ విడిభాగాల పరిశ్రమ, ఎలక్ట్రిక్ ఈవీ బస్సుల తయారీ యూనిట్, టెక్స్‌టైల్ పరిశ్రమలకు ప్రాధా న్యతిస్తున్నారు. ఇక్కడ ప్రతిష్ఠాత్మకమైన విద్యా సంస్థలు, రెస్టారెంట్లు, వినోద కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు రేస్ క్లబ్, గోల్ఫ్ క్లబ్, ట్రేడ్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం పలుచర్యలు తీసుకుంటోంది. దావోస్‌లో వరుసగా మూడోసారి ధమాకాతో తెలంగాణ రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత లభించింది. •

# పాక్ నుంచి వలస వచ్చిన కుటుంబీకులకు ఇళ్లు



## ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** పాకిస్తాన్ నుంచి వలస వచ్చి, ఇక్కడే ఉండిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఇండ్లు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. పాకిస్తాన్ నుంచి కొంతకాలం క్రితం వలస వచ్చిన హిందువులు ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. ముఖ్యంగా మజ్ను కా తిలా ప్రాంతంలోని, సిగ్నేచర్ బ్రిడ్జి వద్ద ఎక్కువగా నివసిస్తున్నారు. అయితే, వీరి నివాసాలను తొలగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆక్రమణల పేరుతో తొలగించేందుకు ప్రయత్నిస్తుండటంతో నిత్యం భయంతో బతుకుతున్నారు. ఈ నేపథ్యంలో వీరికి భారత ప్రభుత్వం పౌరసత్వం కల్పించడంతోపాటు, ఇండ్లు మంజూరు చేసేలా ఆదేశించాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ జరిపిన కోర్టు తాజాగా కీలక ఆదేశాలిచ్చింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కోటేశ్వర్ సింగ్ ఆధ్వర్యంలోని బెంచ్ సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. పాక్ నుంచి వచ్చిన హిందూ దళితులకు కేవలం భారత పౌరసత్వం ఇస్తే సరిపోదని, గౌరవంగా బతికేలా ఇండ్లు కూడా ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. అలాగే, ఇతర పునరావాస చర్యలకు కూడా కోర్టు ఆదేశించింది. దీనికి సంబంధించి నాలుగు వారాల్లోగా సమాధానం తెలపాలని సూచించింది. ఆక్రమణల తొలగింపు లేదా అభివృద్ధి పనుల కోసం నివాసాల్ని తొలగిస్తే దళితులు ఇబ్బంది పడతారని కోర్టు అభిప్రాయపడింది. వీరి నివాసాల తొలగింపును ఆపేయాలని సూచించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 250 కుటుంబాలు పాక్ నుంచి వచ్చి జీవిస్తున్నాయి. దాదాపు వెయ్యి మంది వరకు ఉంటారని అంచనా. కొన్నేళ్లుగా ఉంటున్న వీరికి సరైన జీవన భద్రత లేకుండా పోయింది.

# దేశభక్తులెవరో ప్రజలకు తెలుసు!

## రాహుల్ వ్యాఖ్యలపై లోక్‌సభలో రగడరగడ

### ప్రచురితం కాని పుస్తకాన్ని ప్రస్తావించవద్దన్న రాజ్‌నాథ్, అమిత్ షా

### స్పీకర్ జోక్యం, మైక్ కట్‌చేసిన ఓం బిర్లా

### రాజ్యసభలోనూ గందరగోళం, పలుమార్లు వాయిదా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ, మాజీ సైన్యాధ్యక్షుడు జనరల్ ఎంఎం నరవాణే రాసిన పుస్తకంలోని అంశాలను ప్రస్తావించడం రాజకీయ దుమారానికి దారితీసింది. సభకు పదే పదే అంతరాయం కలిగించింది. సభ నియమాలను ఉటంకిస్తూ, విడుదల కాని పుస్తకం నుండి గాంధీ చదవడంపై రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, కిరణ్ రిజిజుతో సహా సీనియర్ మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో లోక్‌సభలో విధానపరమైన, ప్రవర్తనా నియమాల నియమం 349(ఐ)ని ప్రస్తావిస్తూ, స్పీకర్ ఓం బిర్లా గాంధీని పుస్తకం నుండి కోట్ చేయవద్దని ఆదేశించారు. అయినప్పటికీ, రాహుల్‌గాంధీ ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ, దాని ఆధారంగా కారవాన్ మ్యాగజైన్ కథనాన్ని ప్రస్తావించడం కొనసాగించారు, దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదానికి దారితీసింది. ఒక సమయంలో, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, చైర్ తీర్పును ధిక్కరించే సభ్యులతో ఎలా వ్యవహరించాలో కూడా సభ చర్చించాలని అన్నారు. 349వ నియమం ప్రకారం సభలో సభ్యులు పాటించాల్సిన నిబంధనలు ఉన్నాయి. క్లాజు (ఐ) ప్రకారం సభ వ్యవహారాలకు సంబంధించి తప్ప సభ్యుడు ఏ పుస్తకం, వార్తాపత్రిక లేదా లేఖ చదవకూడదు". పుస్తకం, దాని విషయాల గురించి తాను ప్రస్తావించడం రాష్ట్రపతి ప్రసంగానికి సంబంధించినదని, కాంగ్రెస్ దేశభక్తిని ప్రశ్నిస్తున్న బిజెపి ఎంపీ తేజస్వి సూర్య ఆరోపణలకు ప్రతిస్పందనగా అని గాంధీ వాదించగా, సీనియర్ మంత్రులు తాను ఒక పత్రిక వ్యాసం లేదా ప్రచురించని పుస్తకం నుండి కోట్ చేయలేనని వాదించారు. ఎవరు దేశభక్తులో ఎవరు కాదో ఈ దేశ ప్రజలకు తెలుసని రాహుల్‌గాంధీ అన్నారు, భారతదేశం-చైనా మధ్య 2020 సైనిక ప్రతిష్టంభనకు సంబంధించిన భాగాలను చదవడానికి ప్రయత్నించే ముందు. రాజ్‌నాథ్ సింగ్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో మళ్లీ రభస చోటుచేసుకుంది. పుస్తకం ప్రచురించబడిందా అని అడిగారు, ప్రచురించబడని రచన నుండి కోట్ చేయడం సరికాదని వాదించారు. పుస్తకం కాపీని కూడా సమర్పించమని రాహుల్‌గాంధీని రాజ్‌నాథ్ సింగ్ కోరారు. ప్రతిపక్ష నేత తన ప్రసంగం కొనసాగిస్తూ, "భారత భూభాగంలోకి నాలుగు చైనా ట్యాంకులు ప్రవేశించాయి" అని ప్రస్తావించగా, రాజ్‌నాథ్ సింగ్ తన సీటు నుండి లేచి మరోమారు అభ్యంతరం వ్యక్తంచేశారు, దీంతో రాహుల్‌కు అండగా, కె.సి. వేణుగోపాల్ జతకలిశారు. అమిత్ షా జోక్యం చేసుకుంటూ, "పత్రికలు ఏదైనా రాయవచ్చు... పుస్తకం ప్రచురించబడలేదని ఆయన చెబుతున్నారు. పుస్తకం ప్రచురించబడకపోతే, దానిని ఎలా కోట్ చేయవచ్చు?" అని అన్నారు. "సభను తప్పు దారి పట్టించడానికి ప్రయత్నించవద్దు... ఇక్కడ అనవసర మైన విషయాలు చెప్పకూడదు. అతను ఉటంకిస్తున్న ఈ పుస్తకం ప్రచురించబడలేదు" అని సింగ్ అన్నారు. సభ "నియమాలు, ప్రక్రియ మరియు సంప్రదాయం" ప్రకారం పనిచేస్తుందని బిర్లా రాహుల్ గాంధీకి పదేపదే గుర్తు చేశాడు, కానీ రాహుల్ పుస్తకంలోని ప్రస్తావిస్తూ ప్రసంగించడానికి ప్రయత్నించగా, స్పీకర్ మైక్ కట్ చేశారు. దీంతో సభలో మరోమారు గందరగోళం నెలకొంది. సభను కొద్దిసేపు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు, ఇలాంటి దృశ్యాలు కనిపించినప్పుడు ప్రతిపక్ష నేత మళ్ళీ ఈ అంశాన్ని లేవనెత్తారు. "ఇది జాతీయ భద్రతకు సంబంధించిన విషయం. చైనా దళాలు.. బలగాలు మన బలగాల ముందు ఉన్నాయి. మన బలగాలకు తూర్పు లడఖ్‌లో కైలాష్ శ్రేణి ఉంది.. చైనా దళాలు.." అని రాహుల్ గాంధీ అన్నారు, సింగ్ మరోసారి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక సభ్యుడు ఒక పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తుతున్నాడని షా లేవనెత్తాడు, నిషికాంత్ దూబేను ప్రస్తావిస్తూ, ఆయన రూల్ 349(ఐ)ని ఉదహరించారు. కాంగ్రెస్ హయాంలో సల్మాన్ రష్దీ ది సాటానిక్ వెర్సెస్‌ను నిషేధించిందని, బిజెపి నాయకులు అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కె అద్వానీ పుస్తకం గురించి చర్చించడానికి అనుమతించలేదని ఎత్తి చూపారు. "ఒక పరిమితి ఉంది" అని రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో సభ రేపటికి వాయిదా పడింది. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని నామినేటెడ్ సభ్యుడు, బిజెపి నాయకుడు సి. సదానందన్ మాస్టర్ ప్రవేశపెట్టడంతో ప్రతిపక్ష సభ్యుల నుండి, ముఖ్యంగా సిపిఐ(ఎం) సభ్యుల నుండి తీవ్ర నిరసన వ్యక్తమైంది. 1994లో రాజకీయ ప్రేరేపిత దాడిలో రెండు కాళ్లను కోల్పోయిన కేరళకు చెందిన మాజీ ఉపాధ్యాయుడు, ఆర్ఎస్ఎస్ కార్యకర్త అయిన మాస్టర్, సభలో కూర్చున్నప్పుడు తన కృత్రిమ అవయవాలను తన పక్కన ఉన్న టేబుల్‌పై ఉంచారు. సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ వెంటనే సభలో కృత్రిమ అవయవాల ప్రదర్శనను వ్యతిరేకిస్తూ, వస్తువులను ప్రదర్శించ కూడదనే నియమాలను ఉటంకిస్తూ ఒక పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తారు. చైర్మన్ ఆందోళనను అంగీకరించారు. వాటిని తొలగించమని సభ్యుడిని ఆదేశిస్తానని సూచించారు, కానీ "మీరు (మిస్టర్ బ్రిట్టాస్) సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్నప్పుడు కఠినతను పాటించాలన్నారు.

## ఫాస్టాగ్ వ్యవస్థలో హైవేస్ అథారిటీలో సంస్కరణలు

### వాహన వివరాలు ధృవీకరణ బాధ్యత బ్యాంకులదే..

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2:** ఫాస్ట్‌ట్యాగ్ విధానంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థఎన్‌హెచ్ఎఐ ఒక కీలకమైన సంస్కరణలు తెచ్చింది. ఇందులో భాగంగానే ఫాస్టాగ్ యాక్టివేషన్ సమయంలో వాహన వివరాలను ధృవీకరించే పూర్తి బాధ్యతను బ్యాంకులకే అప్పగించింది. ఇప్పటివరకు వాహన యజమానులు అన్ని చెల్లుబాటుఅయ్యే పత్రాలు సమర్పించి ఫాస్ట్‌ట్యాగ్ పొందిన తర్వాత ఈకెవైవి(నోయువర్ వెహికల్) పూర్తి చేసుకోవాల్సి ఉండేది. దాంతో యాక్టివేషన్ ఆలస్యం కావడం, టోల్ ప్లాజాల వద్ద ఇబ్బందులు ఎదురవడం, రిఫండ్స్ నిలిచిపోవడం వంటి సమస్యలు ఎదురయ్యేవి. కొత్త విధానంతో ఫాస్ట్‌ట్యాగ్ జారీ తర్వాత ప్రత్యేకంగా ఈకేవైవీ పూర్తి చేయాల్సిన అవసరం లేదు. బ్యాంకులు ముందుగానే వాహన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరిస్తాయి. ఫలితంగాఫాస్టాగ్ జారీ ప్రక్రియ వేగంగా జరుగుతుంది. ఇది లక్షల మంది వాహన వినియోగదారులకు మేలు చేస్తుంది. ఈకేవైవీ సడలింపు కేవలం కొత్తగా జారీ అయ్యే ఫాస్ట్‌ట్యాగ్‌లకు మాత్రమే కాకుండా ఇప్పటికే జారీ చేసిన వాటికి కూడా వర్తిస్తుంది. కాబట్టి ఇకపై కేవైవీ తప్పనిసరి కాదు.

# బీహార్‌లో 150కి పైగా కాకులు మృతి



**బర్డ్‌ఫ్లూ అనుమానంతో పరీక్షలకు పంపిన నమూనాలు**

**పాట్నా, ఫిబ్రవరి 2:** బీహార్‌లోని నౌగాచియా ప్రాంతంలో సుమారు 150కుపైగా కాకులు మరణించడంతో నామూనాలు సేకరించి ల్యాబ్స్‌కు పంపారు. బర్డ్ ఫ్లూ కారణంగా ఆ కాకుల చనిపోయినట్లు నిర్ధారణ అయింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. స్థానికులకు హెచ్చరికలు జారీ చేసింది. బీహార్‌లోని భాగల్పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గతనెల 11న నౌగాచియా సబ్‌డివిజన్‌లో మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన వారు వందలాది కాకులు మరణించడాన్ని గమనించారు. ఇతర పక్షులు కూడా అలాంటి స్థితిలో ఉండటం చూశారు. ఆందోళన చెందిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మరణించిన పక్షులను సురక్షితంగా తొలగించారు. అటవీ, పశుసంవర్ధక శాఖల సంయుక్త బృందం కలిసి సీరం నమూనాలు సేకరించారు. పరీక్ష కోసం పాట్నా, భోపాల్‌లోని ఉన్నత స్థాయి ప్రయోగశాలలకు పంపారు. బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా ఆ కాకులు మరణించినట్లు నిర్ధారణ అయ్యింది. మరోవైపు భాగల్పూర్ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రభావిత జోన్ పరిధిలోని 10 కిలోమీటర్ల వరకు శానిటైజేషన్ డ్రైవ్ చేపట్టింది. చుట్టుపక్కల ప్రాంతంలోని కోళ్ల ఫారాల నుంచి నమూనాలను సేకరిస్తున్నారు. బర్డ్ ఫ్లూపై నిఘా, పర్యవేక్షణను ముమ్మరం చేశారు. అయితే ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారులు తెలిపారు.

అనారోగ్యం చెందిన లేదా మరణించిన పక్షులను తాకవద్దని సూచించారు. పక్షుల మరణాలు గుర్తించిన వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. బర్డ్ ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేశారు.

# ఆర్మీజవాన్‌ను కారు బాయ్‌నెట్‌పై కిలోమీటరు ఈడ్చుకెళ్లిన దుండగులు!

**భోపాల్,ఫిబ్రవరి 2:** రిటైర్డ్ ఆర్మీ జవాన్‌ను కారు బానెట్‌పై డ్రైవర్ ఈడ్చుకెళ్లాడు. గాయపడిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదిత్య పురంలోని గణేష్ కాలనీలో రిటైర్డ్ సైనికుడు కళ్యాణ్ కిషోర్ కాంత్ శర్మ నివసిస్తున్నారు. ముందురోజు రాత్రి 11 గంటల సమయంలో తన బంధువుతో కలిసి బయట డిన్నర్ తర్వాత కారులో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. భిండ్ రోడ్డులోని రద్దీగా ఉండే ఆదిత్య హోటల్ సమీపంలో రిటైర్డ్ జవాన్ కళ్యాణ్ కిషోర్ కాంత్ కారు మరో కారును స్వల్పంగా రాసుకున్నది. అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఆయనను తిట్టారు. గొడవకు దిగడంతో పాటు మాజీ జవాన్, ఆయన బంధువును కొట్టారు. మరోవైపు ఇది చూసి జనం గుమిగూడారు. దీంతో అక్కడి నుంచి కారులో పారిపోయేందుకు ఆ వ్యక్తులు సిద్ధమవ్వగా అడ్డుకునేందుకు కళ్యాణ్ కిషోర్ కాంత్ ప్రయత్నించారు. కారు ముందు ఆయన నిల్చొని ఉన్నప్పటికీ ముందుకు దూకించారు. అయితే అదుపుతప్పిన మాజీ జవాన్ ఆ కారు బానెట్‌పై పడ్డారు. దానిని గట్టిగా పట్టుకుని ప్రమాదకరంగా వేలాడారు. అయినప్పటికీ కారును వారు ఆపలేదు. సుమారు కిలోమీటరు దూరం వరకు అలాగే ఈడ్చుకెళ్లారు. ఆ తర్వాత సడన్ బ్రేక్ వేయడంతో మాజీ జవాన్ కళ్యాణ్ కిషోర్ కాంత్ రోడ్డుపై పడ్డారు. కారులోని వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ కళ్యాణ్ కిషోర్ కాంత్ వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఆ కారును స్వాధీనం చేసుకున్నారు. ఒక నిందితుడ్ని అరెస్ట్ చేశారు. మరో నిందితుడి కోసం వెతుకుతున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. రిటైర్డ్ ఆర్మీ జవాన్‌ను కారు బానెట్‌పై ఈడ్చుకెళ్లిన వీడియో క్లిప్ వైరల్ అయ్యింది.

## జమ్ముకాశ్మీర్‌లో భూకంపం - రిక్టర్‌స్కేలుపై 4.8గా గుర్తింపు

**శ్రీనగర్, ఫిబ్రవరి 2:** జమ్ముకశ్మీర్‌లో సోమవారం ఉదయం భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ప్రాథమిక సమాచారం మేరకు ఈ తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.8గా నమోదైంది. ఈ ఉదయం గం.5:35 ప్రాంతంలో భూప్రకంపనలు సంభవించాయి. ఒక్కసారిగా భూమి కంపించడంతో జనం భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. బుద్గామ్ జిల్లాలో 33.9 డిగ్రీస్ నార్త్.. 74.76 డిగ్రీస్ ఈస్ట్ కోఆర్డినేట్స్ వద్ద 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్స్(జీఎఫ్‌జెడ్) తెలిపింది. భూకంపం సంభవించిన సమయంలో ఎపిక్ సెంటర్ ప్రాంతంలో మేఘాలు కమ్మేశాయి. ఉష్ణోగ్రత మైనస్ 0.9 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. తేమ శాతం 95 శాతంగా ఉండగా, పశ్చిమ దిశగా సెకనుకు 1 మీటరు వేగంతో తేలికపాటి గాలి వీచింది. భూప్రకంపనల కారణంగా 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న చారర్ ఐ షరీఫ్, 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుల్వామా, 21 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీనగర్, సోపియాన్‌లో భూమి కంపించింది. నిపుణుల అంచనాల ప్రకారం.. ఈ భూప్రకంపనల వల్ల విడుదలైన భూకంప శక్తి సుమారు 12 రెట్లు ఎక్కువ ఉన్నట్లు అంచనా. సుమారు 278 మెగావాట్ అవర్స్ లేదా 239 టన్నుల టిఎన్‌టి పేలుడుశక్తికి సమానంగా ఈ ప్రకంపనలున్నాయి. ఈ విద్యుత్‌అయస్కాంతశక్తి స్థాయి సహజంగా ప్రజలను నిద్రలేపేస్థాయిలో ఉండటంతోపాటు వారిన భయాందోళనలకు గురిచేస్తుంది. నేషనల్ సీస్మాలజీ సెంటర్‌ప్రకారం సోమవారంఉదయం అండమాన్ నికోబార్ దీవుల్లోను భూప్రకంపనలు సంభవించాయి. తెల్లవారుఝామున 3.31 గంటలప్రాంతంలో కంపించడంతో రిక్టర్‌స్కేలుపై 4.6గా నమోదయింది. నికోబార్ ప్రాంతంలో పదికిలోమీటర్ల లోతున ఈ భూకంపం కేంద్రీకృతం అయినట్లు సీస్మాలజీ అధికారులు తెలిపారు.



## పాక్‌భద్రతా దళాలపై ఫిదాయీల దాడులు

### 200 మందిని మట్టుబెట్టినట్లు బలోచ్ ప్రకటన

**క్వెట్టా, ఫిబ్రవరి 2:** పాక్ భద్రతా దళాలు ఇపుడు వణికిపోతున్నాయి. పరేషన్ హెరోఫ్ పదం పేరుచెపితేనే కలవరపడుతున్నారు. ఈ దాడుల్లో అత్యంత భయానకమైన అంశం ఏమిటంటే తొలిసారిగా మహిళా ఫిదాయిన్లు ఆత్మాహుతి బాంబర్లు ముందుండి దాడులు చేయడం. ఈ భారీ ఆపరేషన్‌లో సుమారు 200 మంది పాక్ సైనికులను మట్టుబెట్టినట్లు బీఎల్‌ఏ సంచలన ప్రకటన చేసింది. బీఎల్‌ఏకి చెందిన అత్యంత ప్రమాదకరమైన "మజీద్ బ్రిగేడ్"ఈ దాడులకు నాయకత్వం వహించింది. శక్తిమంతమైన ఐఈడీ పేలుళ్లు, ఆత్మాహుతి దాడులతో పాక్ సైనిక స్థావరాలను ఛిన్నాభిన్నం చేశారు. ఈ ఆపరేషన్‌లో 11 మంది మహిళా ఫిదాయిన్లు తమను తాము పేల్చుకుని పాక్ సైన్యానికి భారీ నష్టం చేకూర్చినట్లు తెలుస్తోంది. పాక్ సైన్యానికి చుక్కలు చూపించిన ఈ పోరులో తమ యోధులు కూడా ప్రాణాలు కోల్పోయారని బీఎల్‌ఏ ప్రకటించింది. మరణించిన 18 మందిలో 11 మంది మజీద్ బ్రిగేడ్ ఆత్మాహుతి సభ్యులు కాగా, మిగిలిన వారు ఫతే స్క్వాడ్ మరియు ఎస్టీఓఎస్ విభాగానికి చెందిన వారని వెల్లడించింది. దశాబ్దాలుగా సాగుతున్న బలూచ్ పోరాటంలో మహిళలు ఇలా ప్రత్యక్షంగా ఆత్మాహుతి దాడులకు దిగడం పాక్ రక్షణ విభాగాన్ని ఆందోళనలో పడేసింది.


# సంక్షిప్తంగా..

## చైనాలో నలుగురికి మరణశిక్ష



**బీజింగ్, ఫిబ్రవరి 2:** చైనాలో మరో నలుగురికి మరణశిక్ష అమలైంది. మయన్మార్ కేంద్రంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌ల్లోని సభ్యులకు ఈ శిక్షను అమలుచేసినట్లు షెంజెన్ ఇంటర్మీడియెట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది. హత్యలు, టెలికాం మోసం, డ్రగ్ ట్రాఫికింగ్‌తోపాటు ఆరుగురు చైనీయుల మరణానికి కారణమైనట్లు తేలడంతో గతేడాది కోర్టు ఈ శిక్ష విధించింది. ఆన్‌లైన్ మోసాలతోపాటు వివిధ కేసులు ఎదుర్కొంటున్న గ్యాంగ్‌లపై చైనా కొంతకాలంగా తీవ్ర చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మయన్మార్‌కు చెందిన 11 మంది సభ్యుల నేర ముఠాకు మరణశిణను అముల చేసినట్లు ఇటీవల స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

## దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా ఖండించిన చైనా



**బీజింగ్, ఫిబ్రవరి 2:** టిబెట్ బౌద్ధమత గురువు దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. ఆయన ఈ గుర్తింపును ఉపయోగించుకుని చైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. బెస్ట్ ఆడియో బుక్, నెరేషన్ అండ్ స్టోరీటెల్లింగ్ రికార్డింగ్ జాబితాలో దలైలామా ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. 90 యేళ్ల వయసులో తొలి గ్రామీ అవార్డును అందుకుని అందరి దృష్టినీ ఆకర్షించారు. ఈ వ్యవహారంపై చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఓ మీడియా సమావేశంలో స్పందించారు. ఆయన పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదని ఆరోపించారు. మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్న రాజకీయ ప్రవాసి అని పేర్కొన్నారు.

## బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు పదేళ్ల జైలుశిక్ష



**ఢాకా, ఫిబ్రవరి 2:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు పదేళ్ల జైలు ఖరారు చేశారు. ఆమె మేనల్లుడు రద్వాన్ ముజిబ్ సిద్దిక్, మేనకోడళ్లు తులిప్ రిజ్వానా సిద్దిక్, అజ్మినా సిద్దిక్‌లకు కూడా రెండు వేర్వేరు అవినీతి కేసుల్లో శిక్ష పడింది. రాజుక్ న్యూటౌన్ ప్రాజెక్టుకు సంబంధం ఉన్న ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో అవినీతి జరిగినట్లు షేక్ హసీనాతోపాటు ఆమె బంధువులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఢాకాలోని కోర్టు-4కు చెందిన ప్రత్యేక జడ్జి రాబిల్ ఆలమ్ సోమవారం ఆ కేసులో తీర్పును వెలువరించారు. ఒక్కొక్క కేసులో అయిదేళ్ల చొప్పున, మొత్తంగా హసీనాకు పదేళ్ల జైలుశిక్ష ఖరారు చేశారు. తులిప్ సిద్దిక్‌కు నాలుగేళ్లు, ఇక హసీనా మేనకోడళ్లకు ఒక్కొక్కరికి ఏడేళ్ల శిక్షను వేశారు.

## రష్యా దాడిలో 15 మంది ఉక్రెయిన్ పౌరుల మృతి

**క్వీవ్, ఫిబ్రవరి 2:** యుద్ధాన్ని ముగించేందుకు చర్చలు జరుగుతున్నప్పటికీ ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా నిప్రో నగరంపై రష్యా డ్రోన్ దాడి జరిపింది. ఈ దాడిలో బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రాణాలు కోల్పోగా మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులంతా గని కార్మికులేనని అధికారులు గుర్తించారు. దాడికి గురైన బస్సు తమ సంస్థకు చెందినదేనని ఉక్రెయిన్‌లో అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ డీటీఈకే వెల్లడించింది. నిప్రోపెట్రోవ్స్క ప్రాంతంలోని డీటీఈకే గనులను లక్ష్యంగా చేసుకుని రష్యా పెద్దఎత్తున దాడులకు పాల్పడిందని సంస్థ ఆరోపించింది. షిఫ్ట్ ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో కార్మికుల బస్సుపై డ్రోన్ దాడి జరిగినట్లు తెలిపింది.

## బడ్జెట్‌లో కేరళకు అన్యాయం అంటూ ఎంపిల నిరసన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కేరళకు చెందిన ప్రతిపక్ష ఎంపీలు నిరసన వ్యక్తంచేశారు. సోమవారం పార్లమెంట్ ఆవరణలో నిరసనకు దిగారు. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కేరళ వ్యతిరేక బడ్జెట్ అని మండిపడ్డారు. బడ్జెట్‌లో కేరళకు అన్యాయం జరిగిందని, బడ్జెట్‌లో కేరళ పేరు కూడా ప్రస్తావించకపోవడం దారుణమని అన్నారు. కేరళకు ఆయుర్వేద యూనివర్సిటీ కేటాయిస్తారని ఆశించామని, కేంద్ర మంత్రి ఆయుర్వేద యూనివర్సిటీని స్థాపించనున్నట్లు ప్రకటించినా, అది ఎక్కడ అనే విషయం మాత్రం వెల్లడించలేదని అన్నారు.

# డొనాల్డ్ ట్రంప్ సంస్థకు కనకవర్షం



## అధ్యక్షుడి కుటుంబంతో స్లైషేక్ డీల్!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 2:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్రిప్టో కరెన్సీకి ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. ఆయన రెండోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆ కరెన్సీ విలువ దూసుకెళ్లింది కూడా. ఆ వ్యాపారంలో ట్రంప్ కుటుంబానికి కనకవర్షం కురుస్తోంది. ఇప్పటికే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌తో డీల్ కుదుర్చుకోగా.. యుఎఇతో జరిగిన ఒప్పందం గురించి తాజాగా వెల్లడైంది. సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. 2025లో ట్రంప్ ప్రమాణస్వీకారానికి ముందు వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ సంస్థతో యుఎఇలోని అబుదాబీ రాజ కుటుంబానికి చెందిన షేక్ తహనూన్ బిన్ జయేద్ అల్ నహ్యాన్ ప్రతినిధులు ఒప్పందం చేసుకున్నారు. 500 మిలియన్ డాలర్లతో 49 శాతం వాటా కొనుగోలు చేశారని ఆ కథనాలు వెల్లడించాయి. కొనుగోలుదారులు సగం ముందస్తుగా చెల్లిస్తారు. అందులో ట్రంప్ కుటుంబసభ్యులకు 187 మిలియన్ల డాలర్లు వెళ్తాయి. ఈ డీల్‌పై అధ్యక్షుడి కుమారుడు ఎరిక్ ట్రంప్ కూడా సంతకం చేశారు. ఈ ఒప్పందం కారణంగా అమెరికా నుంచి యుఎఇకి ఎఐ హార్డ్‌వేర్ అందనుంది. అంతకుముందు జోబైడెన్ హయాంలో దీనికోసం ప్రయత్నించినా వీలు కాలేదు. స్పై షేక్‌గా పేరుపొందిన షేక్ తహనూన్.. యుఎఇ అధ్యక్షుడి సోదరుడు. అలాగే జాతీయ భద్రతా సలహాదారు. ప్రభుత్వానికి చెందిన వెల్త్‌ఫండ్‌కుకు అధిపతి కూడా. డొనాల్డ్ ట్రంప్ కుమారులు ఎరిక్, డొనాల్డ్ జూనియర్, అల్లుడు జెరెడ్ కుష్నర్‌లు కలిసి 2024లో వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ సంస్థను ప్రారంభించారు. దీంతోపాటు ఎరిక్, డొనాల్డ్ జూనియర్‌లు అమెరికన్ బిట్ కాయిన్ ఇన్‌కార్పొరేటెడ్ పేరిట ఓ బిట్‌కాయిన్ మైనింగ్ కంపెనీని ఏర్పాటు చేశారు. వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్ ప్రతినిధులు గత యేడాది ఏప్రిల్‌లో పాక్‌కు వచ్చి ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ సమక్షంలో 'పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్'తో ఒప్పందం చేసుకున్నారు.

# శబరిమలైలో చిత్రం షూటింగ్‌పై విజిలెన్స్ నివేదిక



**నిబంధనలు ఉల్లంఘించి షూటింగ్ జరిగిందని వెల్లడి**

**పతనంతిట్ట,ఫిబ్రవరి 1:** ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమలలో మరో వివాదం రాజుకుంది. ఇప్పటికే బంగారం చోరీ కేసు ఆరోపణలతో వార్తల్లో ఉన్న ఈ ఆలయంలో, ఇప్పుడు నిబంధనలకు విరుద్ధంగా సినిమా షూటింగ్ జరిపినట్లు దేవస్వోం విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. పవిత్ర సన్నిధానం పరిసరాల్లో ఆంక్షలు ఉల్లంఘించి చిత్రీకరణ జరిపినట్లు తేలింది. దేవస్వం విజిలెన్స్ ఎస్పీ సునీల్ కుమార్ సమర్పించిన నివేదిక ప్రకారం, ఒక సినిమా చిత్రీకరణను పంపానది పరిసరాలతో పాటు ఇతర ప్రాంతాల్లో పలు రోజుల పాటు నిర్వహించారు. అత్యంత పవిత్రమైన మకరవిళక్కు రోజున సైతం శబరిమల ఆలయ సముదాయానికి సమీపంలోని ఒక కొండపై చిత్రీకరణ జరిపినట్లు నివేదిక స్పష్టం చేసింది. సన్నిధానంలో ఎలాంటి షూటింగ్ జరపలేదని చిత్ర దర్శకుడు అనురాజ్ మనోహర్ గతంలో చేసిన వాదనలను ఈ నివేదిక తోసిపుచ్చింది. ఈ చిత్రీకరణపైఇప్పటికే దర్శకుడిపై కేసు నమోదైంది. ఆంక్షలు ఉన్న ప్రాంతాల్లో చిత్రీకరణ జరిగినప్పటికీ, దీనికి పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి పొందినట్లు విజిలెన్స్ నివేదికలో ప్రస్తావన లేకపోవడం గమనార్హం. షూటింగ్‌కు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన ఈ నివేదికను ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు కె. జయకుమార్‌కు అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల కోసం బోర్డు న్యాయ నిపుణుల సలహాను కోరింది. చిత్రీకరణ సమయంలో జరిగిన ఉల్లంఘనలను గుర్తించి, సమగ్ర నివేదిక ఇవ్వాలని న్యాయ విభాగాన్ని అధ్యక్షుడు ఆదేశించారు. న్యాయసలహా అందిన తర్వాతే బాధ్యులపై పరిపాలనాపరమైన లేదా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మండలమకరవిళక్కు యాత్ర సమయంలో భక్తుల రద్దీ, ఆలయ పవిత్రత దృష్ట్యా కఠినమైన నియమాలు అమల్లో ఉండగా ఈ ఘటన జరగడం వివాదాన్ని మరింత పెంచింది.

# ఫైర్‌సేఫ్టీరహిత బహుళ అంతస్తుల భవనాలకు అగ్నిమాపక శాఖ తాఖీదులు




అగ్నిప్రమాదాల నివారణపై ఫైర్‌సర్వీస్ అధికారులతో సమావేశమైన ఆ విభాగం డిజి విక్రంసింగ్‌మాన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** ఒఆర్‌ఆర్ పరిధిలో గల అన్ని బహుళ అంత స్తుల భవనాలలో ఫైర్ సేఫ్టీ ఉపకరణాలు లేని వాటికి వారం రోజుల్లో సమ కూర్చుకోవాలని అగ్నిమాపక శాఖ ఆదేశించింది. అక్రమంగా వున్న సెల్లార్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఖాళీ చేయాల్సిందేనని, వీటిని కేవలం పార్కింగ్ కోసం తప్ప దేనికీ వాడ రాదని ఫైర్ సర్వీస్ డిజి విక్రం సింగ్ మాన్ ఆదేశించారు. ఈ మేరకు అగ్నిమాపక శాఖ అధికారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. రాబోయేది వేసవికాలం అయినందున ఎక్కడా అగ్ని ప్రమా దాలకు తావు లేకుండా ఫైర్‌సర్వీస్ సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. నాంపల్లి అగ్నిప్రమాద ఘటనలో సెల్లార్‌లో ఐదుగురు హృద య విదారకంగా మర ణించడంపై సర్కారు తీవ్రంగా పరి గణించి కఠిన చర్యలకు ఆదేశించిందని, ఈ నేపథ్యంలో ఫైర్‌సర్వీస్ సిబ్బంది వరుసగా దాడులు చేసి ఆక్రమాలను నిరోధించాలని ఆయన ఆదేశించారు. బహుళ అంతస్తుల భవనాల నిర్మాతలు ఇక ముందు కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందేనని, సెల్లార్ల దుర్వినియోగాన్ని ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. సెల్లార్లు కేవలం పార్కింగ్ కోసమే వాడాలని, వేరే అవసరాలకు వాడితే సహించేది లేదని ఆయన హెచ్చ రించారు. నాంపల్లి దుర్ఘటన తరువాత ఫైర్‌సర్వీస్ అధికారులు తనిఖీలో అనేక చోట్ల సెల్లార్లలో గోదా ములుగానూ, నివాస గృహాలుగానూ మారినట్లు వెలుగు చూసిందని, వీటిపై భవనాల యజమానులకు నోటీ సులు ఇచ్చి వెంటనే వాటిని ఖాళీ చేయాలని ఆదేశిం చామని ఆయన తెలిపారు.

అనేకచోట్ల సెల్లార్లను ఇప్పటికే ఖాళీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. సెల్లార్ల దుర్వినియోగం నివారింపచేయడంతో పాటు భవనాలలోని ప్రతీ ఫ్లాట్‌లో ఫైర్‌సేఫ్టీ ఉపకరణాలు వుండాల్సిందేనని, అత్యవసర పరిస్థితుల్లో వీటిని వాడగలిగే నిపుణులైన సిబ్బంది కూడా ఉండాలని మాన్ తెలిపారు. దీంతోపాటు ఫైర్‌సేఫ్టీ ఉపకరణాలు సరిగ్గా పని చేస్తున్నాయా? లేదా అనేది యజమానులు నిరంతరం తనిఖీ చేయాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఎక్కడైనా ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే యజమా నులను బాధ్యులను చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ విషయంలో అందరు జాగ్రత్తగా ఉండి అగ్నిప్రమాదాల నివారణకు నడుం బిగించాలని ఆయన కోరారు. ఇప్పటివరకు 70కిపైగా వివిధ సంస్థలు, బడా భవనాలతోపాటు రెండు ఆస్పత్రులు, 26 వాణిజ్య సముదాయాలు, 27 మర్కంటైల్ భవనాలు, వాణిజ్య, జనసముదాయం వున్న మూడు భవనాలను, మ ల్టీప్లెక్స్, మాల్‌లను తనిఖీ చేశామని ఆయన వెల్ల డించారు.

## ఓపెన్ కానీ పాలీసెట్ వెబ్‌సైట్

### ఆందోళనలో విద్యార్థులు

### ఏప్రిల్ 20 వరకు దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడానికి నిర్వహించే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పాలీ సెట్)-2026 దరఖాస్తుల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు సాంకేతిక విద్యా మండలి అధికారులు ప్రకటించినప్పటికీ.. వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. సోమవారం ఉదయం నుంచే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినప్పటికీ.. ఉదయం నుంచి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇందుకు సంబంధించిన వెబ్ సైట్ ఓపెన్ కాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పాలీసెట్ దరఖాస్తులను సోమవారం(ఫిబ్రవరి 2) నుంచి ఏప్రిల్ 20 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు పాలీసెట్ కన్వీనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 100 అపరాధ రుసుంతో ఏప్రిల్ 21 వరకు, రూ. 300 అపరాధ రుసుంతో ఏప్రిల్ 22 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. మే 13న పాలీసెట్-2026 పరీక్షను నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహించిన అనంతరం 12 రోజుల్లో ఫలితాలను విడుదల చేయడానికి అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో డిప్లమా కోర్సులతోపాటు, ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి అగ్రికల్చర్ యూనివర్సిటీ, హార్టీ కల్చర్ యూనివర్సిటీ అందించే హార్టీ కల్చర్ డిప్లమా కోర్సులను, పశు సంవర్ధక శాఖ నిర్వహించే డిప్లమా కోర్సుల్లోనూ అడ్మిషన్లను పాలీసెట్-2026 ద్వారా చేపట్టనున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సోమవారం నుంచి ప్రారంభించగా.. అపరాధ రుసుంతో కలిపి ఏప్రిల్ 22 వరకు స్వీకరించనున్నారు. పరీక్షను మే 13న నిర్వహించి .. పరీక్ష ముగిసిన 12 రోజుల్లో ఫలితాలను ఇవ్వనున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.



### కెసిఆర్‌ను సిట్ విచారణ కోసం

## పిలిస్తే తప్పేంటి?

### తెలంగాణను విస్మరించిన తెలుగింటి

### ఆడబిడ్డ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల: కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి రెండేళ్లవుతున్నా సిట్ విచారణ ముగింపునకు రావడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విచారణ త్వరగా పూర్తిచేసి దోషులకు శిక్ష పడేలా చూడాలని ఆమె కోరారు. సోమవారం విలేకరుల సమావేశంలో కవిత పాల్గొని మాట్లాడారు. సిట్ విచారణలో ఏం జరిగిందో మాజీ సీఎం కేసీఆర్ చెబుతారని భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సిట్ విచారణను తప్పుపడుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడటం సరికాదని, చట్టాలను అందరూ గౌరవించాలని కవిత అన్నారు. చట్టానికి సహకరించాలని పేర్కొన్నారు. గుంట నక్కలతో కలిసి కాంగ్రెస్ పార్టీ డ్రామాలాడుతోందని, తన భర్త ఫోన్లు ట్యాప్ చేశారనే అనుమానాలున్నాయని చెప్పారు. సిట్ అధికారులు విచారణకు పిలిస్తే వెళ్లి సహకరిస్తానని స్పష్టం చేశారు. కేంద్రంలోని బీజేపీ తీరు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు ఐఐఎం, నవోదయాలు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఇంకా ఇవ్వట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మెట్రో రైల్ ఫేజ్2 గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే లేదన్న ఆమె తెలుగింటి ఆడబిడ్డ నిర్మల తెలంగాణ ప్రజలను విస్మరించారని మండిపడ్డారు. ఏపీ పునర్విభజన చట్టంలోని అంశాలు 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని దుయ్యబట్టారు. కొత్త ఎయిర్‌పోర్టులు, ఆర్‌ఆర్‌ఆర్‌ను పెండింగ్‌లోనే పెట్టారని ఆక్షేపించారు. రాష్ట్రప్రభుత్వం 47 అంశాల గురించి అడిగితే ఏమీ ఇవ్వలేదని, ఇద్దరు కేంద్రమంత్రులు ఉండి రాష్ట్రానికి ఏమీ తేలేకపోవడం బాధాకరమన్నారు. దేశంలో విద్య, వైద్యానికి 1, 2 శాతమే నిధులు కేటాయించటం దారుణమని కవిత ఆక్షేపించారు.

## జనగణనలో ఒబిసిల కులగణన చేపట్టాలి

### లేకపోతే ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

### జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** గతంలో కే ంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏప్రిల్ 1వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జాతి జనగణనలో బిసి కులగణన చేపట్టాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలోని దేశంలోని బిసిలంతా ఐక్యమై ఢిల్లీలో ఉన్న ఎన్‌డిఎ కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని హెచ్చరించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తుంటే గత యేడాది ప్రధాని నరేంద్రమోడీ జనగణనతోపాటు బిసిల కులగణన చేపడతామని నిర్ణయం తీసుకున్నారని, ఆ నిర్ణయాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసిల కులగణన చేపట్టకపోతే నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్ కోటా, బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, విద్యా, ఉద్యోగ రంగాలలో జనాభా దామాషా ప్రకారం బిసిలకు వాటా దక్కకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి కుందారం గణేషాచారి అధ్యక్షత వహించగా బిసి నేతలు దీటి మల్లయ్య, గుజ్జ కృష్ణ, కులక్కచర్ల శ్రీనివాస్, విక్రమ్‌గౌడ్ తదితరులు మాట్లాడారు.

# కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగానికి సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో ఆయిల్ పామ్‌పై దిగుమతి సుంకం పెంచ లేదన్నారు. దీని వలన రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు తీవ్ర నష్టం ఏర్పడే అవకాశం ఉంది. అలాగే కేంద్రం పసుపు బోర్డుకు నిధుల కేటాయించకపోవడం, ఈ పంటను హై వాల్యూ క్రాప్‌గా గుర్తించకపోవడం నిరాశను కలిగించిందన్నారు. కొకొనట్ బోర్డు ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి ప్రకటన లేదని చెప్పారు. ఎరువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని, ఇందువల్ల రైతులపై మరింత భారం పడుతుంది వివరించారు. ఇప్పటికే పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించే చర్యలు బడ్జెట్‌లో పూర్తిగా లేవని తెలిపారు. రైతులకు అత్యంత కీలకమైన కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హక్కు కల్పించడంలో కేంద్రం విఫలమైందని, ఇందువల్ల రైతుల ఆదాయ భద్రతపై అనిశ్చితి పెరిగిందని చెప్పారు. వ్యవసాయ మార్కె టింగ్, ధరల స్థిరీకరణ, మార్కెట్ సంస్కరణలపై స్పష్టమైన దిశానిర్దేశం లేక పోవడం కేంద్ర బడ్జెట్ లోని ప్రధాన లోపమన్నారు. కేంద్ర పథకాల ఏకీకరణ పేరుతో తెలంగాణకు వచ్చే నిధుల్లో కోత విధించడం సరికాదని తెలియచేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయాలన్న లక్ష్యం మాటలకే పరిమితమైందని విమ ర్శించారు. ఇందుకు స్పష్టమైన రోడ్‌మ్యాప్ బడ్జెట్‌లో ఎక్కడా కనిపించ లేదన్నారు. వ్యవసాయ రంగంలో బడ్జెట్‌లో ప్రస్తావించదగిన ఏకైక అంశం ఎ1 ఆధారిత కార్యక్రమాల ప్రస్తావన మాత్రమేనని పేర్కొన్నారు, అయితే ధర భద్రత, మార్కెట్ భరోసా లేకుండా కేవలం ఎ1 రైతు సమస్యలకు పరిష్కారం కాదని స్పష్టం చేశారు.

## కాంక్రీట్ నిర్మాణాలు ముందే దెబ్బతినడం ఆందోళనకరం

### స్ట్రక్చర్ రిపేర్, రెట్రోఫిటింగ్ సెమినార్‌లో

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** ప్రస్తుత రోజుల్లో భారీ వ్యయంతో నిర్మిస్తున్న వంతెనలు, కాలువలు, ప్రాజెక్టులు, ఇతర కాంక్రీటు నిర్మాణాలు ఆశించిన జీవితకాలం కంటే ముందే దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోందని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. నేటి పరిస్థితుల్లో రిపేర్, రిట్రో పిట్టింగ్ అనేది కీలక విభాగంగా మారుతుందని ఆయన అన్నారు. ఒకసారి నిర్మాణం దెబ్బతింటే దాన్ని సరిచేయడానికి భారీగా ప్రజా ధనం ఖర్చు అవుతుందని, దీని వలన ఆర్థిక భారమే కాకుండా కొత్త ప్రాజెక్టులు అమలు చేయడానికి ఆలస్యానికి కారణంగా మారింది అన్నారు. విశ్వేశ్వరయ్య భవన్‌లో ఇంజనీర్ల సంస్థ (ఇండియా), తెలంగాణ రాష్ట్ర కేంద్రం రిహాబ్ టెక్నాలజీస్‌తో కలిసి 2,3 తేదీలలో 'స్ట్రక్చర్స్ రిపేర్, రెట్రోఫిటింగ్'పై రెండు రోజుల ఆల్ ఇండియా సెమినార్‌ను నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యి , జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు పునాదుల్లాంటివని అందుకే ప్రారంభం నుంచే సరైన డిజైన్, నాణ్యమైన నిర్మాణం, సమయానుకూల రిపేర్, రెట్రోఫిట్టింగ్ అత్యంత అవసరమన్నారు. రిపేర్, రెట్రోఫిట్టింగ్ అనేది సమస్య వచ్చిన తర్వాత మాత్రమే చేసే చర్య కాదని, సమయానికి సరైన నిర్ణయాలు తీసుకుంటే భవనాలు, వంతెనలు, కాలువలు ఎక్కువకాలం నిలుస్తాయని, ప్రమాదాలు తగ్గుతాయని, ప్రజల భద్రత మరింత పెరుగుతుందని, పర్యావరణ పరిరక్షణ కోణంలో కూడా ఇది చాలా అవసరమని సుఖేందర్ రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, నాణ్యమైన నిర్మాణ విధానాలు, ముందస్తు నిర్వహణ, ఆధునిక రెట్రోఫిట్టింగ్ టెక్నాలజీలు విస్తృతంగా అమలు చేయాలని ఆయన చెప్పారు. దేశ అభివృద్ధి వేగంగా సాగాలంటే, మౌలిక సదుపాయాలు బలంగా ఉండాలని, ప్రాజెక్టులు దీర్ఘకాలం ప్రజలకు సేవలందించాలని, ప్రజాధనం సక్రమంగా, బాధ్యతతో వినియోగించబడాలని గుత్తా సుఖేందర్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఓయు వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్, రిహాబ్ టెక్నాలజీస్ సీఈవో డాక్టర్ పి శ్రీనివాస రెడ్డి, ఎఫ్ఐఈ చైర్మన్ పి సూర్య ప్రకాష్, ప్రొఫెసర్ కె గణేశ్ బాబు, ప్రొఫెసర్ వి బాలకిష్ట రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయిక్ బనోతు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

### కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) తప్పనిసరి అర్హత సాధించాలనే నిబంధన నుంచి మిన



సోమవారం ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హాయింపు ఇవ్వాలని నల్గొండ-వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి సోమవారం ఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు సర్వీ స్‌లో కొనసాగాలన్నా, పదోన్నతి పొందాలన్నా టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. 2024 సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు కూడా టెట్ నిబంధనను తప్పనిసరి చేస్తూ తీర్పుని వ్వడంతో పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పుల్గం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్, సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మిర్యాల సతీష్‌రెడ్డితో కలిసి పార్లమెంటు ఆవరణలోని విద్యా శాఖ మంత్రి కార్యాలయంలో కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన కేంద్ర మంత్రి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి రెండు వేర్వేరు తీర్పులలో టెట్ నిబంధనను తప్పనిసరి చేయడంతో సమస్య ఏర్పడిందని, ఈ సమస్యను అధిగమించడానికి న్యాయపరమైన సలహా తీసుకొని కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుం టుందని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వారు చెప్పారని ఎమ్మెల్సీ తెలిపారు.

## 60 సార్లు ఢిల్లీ వెళ్లి సిఎం సాధించిందేమిటో?

### మాజీమంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** కేంద్ర బడ్జెట్‌లో పేదలు, రైతు కూలీలకు ఉపయోగపడే ఉపాధి హామీని కుదించారని కెటిఆర్ విమర్శించారు. ఎరువుల రాయితీ, ఆహార రాయితీతో పాటు స్వచ్ఛ భారత్‌కు నిధులు కూడా తగ్గించారని అన్నారు. వ్యాక్సిన్లు, బల్క్ డ్రగ్స్, ఫార్మాకు హైదరాబాద్ కేంద్రం అయితే.. బయో ఫార్మా తయారీకి రూ.పది వేల కోట్లు కేటాయించి తెలంగాణకు రూ.10 కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. ఢిల్లీకి 60 సార్లు వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి సాధించిందేంటి..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపి పార్టీల నుంచి 8 మంది చొప్పున ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి కలిగిన ప్రయోజనం సున్నా అని విమర్శించారు. తెలంగాణకు బిజెపి ఇచ్చేది ఇదేనా..? అని ప్రశ్నించారు. హై స్పీడ్ రైల్ కారిడార్ కేటాయించామని గొప్పగా చెబుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ భౌగోళికంగా దేశానికి మధ్యలో ఉంది..కాబట్టి కారిడార్ హైదరాబాద్ మీదుగా వెళ్లక తప్పదని తెలిపారు. తెలంగాణకు హై స్పీడ్ ట్రైన్లు ప్రత్యేకంగా ఇచ్చినట్లు చెప్పడం హాస్యాస్పదం అని కెటిఆర్ అన్నారు. దావోస్ ఒప్పందాల ద్వారా వచ్చిన పెట్టుబడులు ఎన్ని మెటీరియలైజ్ అయ్యాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. దావోస్‌లో జరిగిన ఒప్పందాలు విచిత్రంగా ఉన్నాయని చెప్పారు. మహారాష్ట్రలో కేబినెట్‌లో ఉండే మంత్రి ఆ రాష్ట్ర సిఎంతో దావోస్ ఒప్పందం చేసుకున్నారని, అలాగే జూబ్లీహిల్స్‌లో ఉండే సిఎం రేవంత్‌రెడ్డి, మెగా కృష్ణారెడ్డి కూడా దావోస్‌లో ఒప్పందాలు చేసుకున్నారని ఎద్దేవా చేశారు.

## బి-ఫాం ఇచ్చిన అభ్యర్థులకు సహకరించి గెలిపించండి

### రెబెల్‌గా బరిలో ఉంటే 15 యేళ్లపాటు పార్టీ నుండి సస్పెన్షన్

### టిక్కెట్లు రానివారిని తగిన విధంగా గౌరవిస్తాం:

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి బి.ఫాం ఇచ్చిన వాళ్లు మాత్రమే ఎన్నికల బరిలో ఉండాలని, నామినేషన్లు వేసిన మిగిలిన బీజేపీ నాయకులంతా పార్టీ శ్రేయస్సు దృష్ట్యా తక్షణమే నామినేషన్లను ఉపసంహరించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనేక సర్వే నివేదికల ఆధారంగా, సామాజిక పరమైన అంశాలతో మరియు పార్టీ ప్రత్యేక అంశాలతో గెలిచే అవకాశాలు ఉన్నాయన్న అభ్యర్థులకే పార్టీలోని ముఖ్యమైన వారు సామూహికంగా కలిసి టిక్కెట్లు ఖరారు చేశామని పేర్కొన్నారు. టిక్కెట్ రానివాళ్లు బాధపడడం సహజం. గత అనేక సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధి కోసం గెలుపు కోసం పనిచేస్తున్న కార్యకర్తలు వారిని పార్టీ గుర్తుంచుకుంటుందని స్పష్టం చేశారు..పార్టీ కార్యకర్తల కృషి, బిజెపి పట్ల ప్రజలకున్న విశ్వాసంతోనే గ్రామ పంచాయతీ ఎన్నికలలో పార్టీ ఘనవిజయాలను సాధించింది. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కూడా కార్యకర్తల కృషితో ప్రజల మద్దతుతోనే పార్టీ మున్సిపల్ ఎన్నికలలో విజయ పరంపర కొనసాగిస్తుందన్న విశ్వాసం రాష్ట్ర పార్టీకి పూర్తిగా ఉందన్నారు.

వెంటనే నామినేషన్లను ఉపసంహరించుకుని వారి డివిజన్లు, వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాల్సిఅని కోరారు. పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకంగా రెబల్ అభ్యర్థులుగా పోటీ చేస్తే మాత్రం పార్టీ రాష్ట్ర నాయకత్వం సీరియస్‌గా పరిగణిస్తుందని తెలిపారు. ఎవరైనా నామినేషన్లను ఉపసంహరించుకోకుండా ఇండిపెండెంట్ గా పోటీ చేయాలనుకుంటే వాళ్లను 15 ఏళ్లపాటు పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులోనూ అలాంటి వారిని తిరిగి బీజేపీలో చేర్చుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

## తాడిచర్ల బొగ్గు గనులు తెలంగాణకే

### రాజ్యసభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** తాడిచర్ల 1 బొగ్గు గనులు తెలంగాణకే కేటాయించినట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే తాడిచర్ల 2 గనులు ఇంకా ఎవరికీ కేటాయించలేదని తెలిపింది. రాజ్యసభలో సోమవారం సభ్యులు అనిల్‌కుమార్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సమాధాన మిచ్చారు. 2015లో తెలంగాణ విద్యుత్ సంస్థకు కేటాయించామని తెలిపారు. 2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం తర్వాత 2020 జూన్ నుంచి గనుల కేటాయింపుల ప్రక్రియ మారిందని తెలిపారు. వ్యాపారానికి వాడే గనులను వేలంలో కేటాయించాలని కమిటీ సూచించిందని పేర్కొన్నారు. ప్రత్యేక, తప్పని పరిస్థితుల్లోనే బొగ్గు శాఖ నేరుగా కేటాయించాలని కమిటీ తెలిపిందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు తాడిచర్ల కోల్ బ్లాక్ ను తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కోకు కేటాయించినట్లు వివరించారు. దేశంలో ఏ కోల్ మైనింగ్ కంపెనీకి కూడా ఈ స్థాయిలో ఇబ్బందుల్లేవని వ్యాఖ్యానిచారు.



## రాష్ట్ర ఫెర్టిలైజర్స్ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** ఫెర్టిలైజర్లు, పెస్టిసైడ్స్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా నాగుర్ల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా రామడుగు మనోహర్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు దీనికి సంబంధించి హైదరాబాద్‌లో ఫెర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ డీలర్ల సంఘానికి జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు, కోశాధికారిగా సిద్ధి నాగరాజు లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ డీలర్లతో పాటు, రైతుల సంక్షేమం నిమిత్తం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల సరఫరాకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



### ముచ్చింతల్ చినజీయర్‌స్వామి ఆశ్రమంలో

## వైభవంగా సమతాకుంభ్-2026

### 108 దివ్యదేశాల 4వ బ్రహ్మోత్సవాలు

**హైదరాబాద్ (శంషాబాద్), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని చినజీయర్‌స్వామి ఆశ్రమంలో సోమవారం త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో సమతాకుంభ్-2026 బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సమతాకుంభ్-2026 శ్రీరామానుజాచార్య 108 దివ్యదేశాల 4వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోవ రోజు ఉదయం యాగశాలలో ప్రత్యేక ఆరాధనలు, తీర్థగోష్టి నిర్వహించారు. సమతమూర్తి ప్రాంగణంలో రామానుజ నూత్తందాది పారాయణం చేయడం మన అదృష్టం. రెండో రోజున జరిగిన గరుడ వాహనంపై ఊరేగిన 18 దివ్యదేశ మూర్తులకు తిరుమంజన సేవలు నిర్వహించి, అనంతరం అభిషేకం చేశారు. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం అనంతరం 37వ దివ్యదేశం నుండి 54 వరకు దివ్యదేశాధీశులకు 18 గరుడ సేవలు జరిగాయి. సాకేత రామచంద్ర ప్రభువు హనుమద్వాహనంపై దర్శనం ఇచ్చారు.

## కెసిఆర్‌పై రేవంత్‌రెడ్డి అక్కసు వెళ్లగక్కారు: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** మాజీ ముఖ్యమంత్రి, తమ పార్టీ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి తన అజీర్తిని, అక్కసును వెళ్లగక్కారని బీఆర్‌ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. హార్వర్డ్‌లో చదువుకున్న ముఖ్యమంత్రి తన గుణం మాత్రం మార్చుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. హేట్ స్పీచ్ గురించి పుస్తకాలు అక్కరలేదని, ముఖ్యమంత్రి ప్రసంగాలు వింటే చాలని విమర్శించారు. రావి నారాయణ రెడ్డి పురస్కార ప్రదాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్‌ఎస్ అధినేతపై విమర్శలు గుప్పించారు. ఈ మధ్య కొంతమంది వాళ్లకు వాళ్లే జాతిపిత అని టైటిల్ ఇచ్చుకుంటున్నారని, తమకు తామే ఉద్యమకారుడు అని రాసుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ జాతిపితకు నోటీసులు ఇస్తారా అని కొంతమంది ప్రశ్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్ రావు స్పందించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు ఉందా అని హరీశ్ రావు ప్రశ్నించారు. దేశానికి మహాత్మా గాంధీ జాతిపిత అయినట్లే తెలంగాణ సాధించిన కేసీఆర్ కూడా ఈ రాష్ట్రానికి జాతిపితనే అని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్న నాయకులు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు లేదని హరీశ్ రావు అన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అంబేద్కర్ డిగ్రీ పరీక్షలు వాయిదా

### 17 నుంచి మార్చి 10 వరకు నిర్వహణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11న మున్సిపల్ ఎన్నికలను దృష్టి లో పెట్టుకొని ఈ వాయిదా వేసినట్లు తెలిపారు. డిగ్రీ మూడవ, రెండో, మొదటి సంవత్సరం వేర్వేరు సెమిస్టర్లకు పరీక్షలను తిరిగి ఈ నెల 17 నుండి మార్చి 10 వరకు నిర్వహిసున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య భోజు శ్రీనివాస్ తెలిపారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు విశ్వవిద్యాలయ వెబ్ పోర్టల్‌లో హాల్ టిక్కెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు అభ్యర్థులు వారి సంబంధిత అధ్యయన కేంద్రాల్లో లేదా వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

## కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై బిజెపి చార్జ్‌షీట్ విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 2:** కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కోసమే మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఎన్నో మోసపూరిత వాగ్దానాలు చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్ళు దాటినప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై మోసపూరిత వాగ్దానాల పేరుతో ఛార్జ్‌షీట్ విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని, విద్య, వైద్యాన్ని నిర్లక్ష్యం చేశారని, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.4 వేల నిరుద్యోగ భృతి జాడ లేదని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంట్స్ కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయని అన్నారు.



# ఎపికి హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్

## అమరావతి నుంచి హైదరాబాద్‌కు గంటలోపే ప్రయాణం!

**విజయవాడ.ఫిబ్రవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తున్నాయి.ఏ ఇతర రాష్ట్రంలో లేనట్లుగా వేగవంతమైన రైళ్ళు విజయవాడ.విశాఖ తదితర నగరాలకు నడమ ప్రయాణం చేయనున్నాయి.ఏపీ మీదుగా ప్రధాన నగరాలకు పలు బుల్లెట్ రైళ్ళు రానున్నాయి.దేశంలోని వివిధ నగరాల మధ్య ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా ప్రకటించారు.వీటిలో అత్యధిక భాగంగా ఆంధ్రాలోని అన్ని ప్రధాన నగరాలను కలుపుకుంటూ ముందుకు దూసుకుని వెళ్తాయి.ఉంటుంది. హైస్పీడ్ రైల్ కారిడార్ పూర్తయితే వాటిపై బుల్లెట్ రైళ్ల గంటకు గరిష్ఠంగా 320 కిలోమీటర్ల వేగంతో పరుగులు పెడతాయి. అమరావతి నుంచి హైదరాబాద్‌కు గంటలోపే చేరుకోవచ్చు. అలాగే అమరావతి నుంచి తిరుపతి, చెన్నైలకు రెండు గంటల్లోపు చేరుకునే అవకాశం ఉంటుంది. హైదరాబాద్‌బెంగళూరు కారిడార్‌లో కర్నూలు, అనంతపురం నుంచి ఇటు హైదరాబాద్‌కు కానీ, అటు బెంగళూరుకు కానీ గంటలోపు ప్రయాణంతో చేరుకోవచ్చు. చెన్నై- బెంగళూరు కారిడార్‌లో చిత్తూరు నుంచి ఇటు చెన్నై కానీ, అటు బెంగళూరు కానీ కేవలం అరగంటలో చేరుకునే అవకాశం ఉంటుంది. దేశంలో మరే రాష్ట్రానికి ఈ స్థాయిలో హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ ప్రతిపాదన అనేది లేదు,ఏపీ మీదుగా వెళ్లే హైదరాబాద్అమరావతి – చెన్నై, హైదరాబాద్– బెంగళూరు, చెన్నై– బెంగళూరు కారిడార్లు ఉన్నాయి. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలలో కలిపి మొత్తం 1,671 కి.మీ. మేర నిర్మించే ఈ కారిడార్లలో అత్యధికంగా ఆంధ్రప్రదేశ్ లోనే 857 కి.మీ. ఇవి మన రాష్ట్రంలోని ప్రధానంగా 11 జిల్లాల మీదుగా వెళ్తాయి. ఈ కారిడార్లతో విజయవాడ నుంచి విశాఖ వైపు మినహా మిగిలిన దక్షి ణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ వచ్చినట్లు అవుతుంది.హైదరాబాద్–అమరావతి–చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ అమరావతి మీదుగా, కొత్తగా నిర్మించనున్న విమానాశ్రయానికి సమీపం నుంచి వెళ్లనుంది. దీనిని తెలంగాణ, ఏపీ, తమిళనాడుల్లో కలిపి మొత్తం 760 కిలోమీటర్ల మేర నిర్మించనుండగా, ఇందులో ఏపీలో 504 కిలోమీటర్లు ఉంటుంది. ఏపీలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల మీదుగా ఇది వెళ్తుంది.దాచేపల్లి, అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి వద్ద సైతం స్టేషన్లను నిర్మిస్తారు. ఈ ప్రాజెక్ట్‌కు రూ.1.90 లక్షల కోట్లు వ్యయమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కారిడార్, ఇందులోని స్టేషన్లకు కలిపి మొత్తం 1,873.7 హెక్టార్ల భూమి అవసరం పడుతుంది. మరో 90.31 హెక్టార్ల అటవీ భూమినీ సేకరించాల్సి ఉంటుంది.హైదరాబాద్‌బెంగళూరు కారిడార్ కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా వెళ్తుంది. ఇందులో కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, కియా కార్ల పరిశ్రమకు సమీపంలోని దుద్దేబండ, హిందూపురంలలో స్టేషన్లను నిర్మిస్తారు. ఈ లైన్ తెలంగాణ, ఏపీ, కర్ణాటకలో కలిపి మొత్తం 605 కి.మీ. మేర నిర్మించనున్నారు. ఒక్క ఏపీలోనే 263 కిలోమీటర్లుగా ఉండనుంది. ఈ ప్రాజెక్ట్‌కు రూ.1.51 లక్షల కోట్లు వ్యయమవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. దీనికోసం ఏపీలోని 988.62 హెక్టార్ల భూమి, 4.21 హెక్టార్ల అటవీ భూమి సేకరించాల్సి ఉంటుంది. చెన్నై- బెంగళూరు మధ్య 306 కి.మీ. మేర హైస్పీడ్ రైల్ కారిడార్‌ను నిర్మించనున్నారు.

# క్రీడారంగానికి బడ్జెట్ బూస్ట్

## రూ.4,480 కోట్ల భారీ కేటాయింపులు

## సరికొత్తగా ఖేలో ఇండియా మిషన్

## కామన్వెల్త్ క్రీడలకు భారీగా నిధులు

## క్రీడా సామాగ్రిలో గ్లోబల్ హాబ్‌గా భారత్

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం క్రీడారంగం అభివృద్ధికి బడ్జెట్‌లో భారీగా చేయూత నిచ్చింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్రీడలకు పెద్దపీట వేసింది. గత ఏడాదితో పోలిస్తే క్రీడా మంత్రిత్వ శాఖకు కేటాయింపులను ఏకంగా రూ.1,133 కోట్లు పెంచింది. దీంతో మొత్తం కేటాయింపులు రూ.4,479.88 కోట్లకు చేరుకున్నాయి. క్రీడాకారుల శిక్షణ, మౌలిక వసతుల కల్పనతో పాటు భారత్‌ను ప్రపంచ స్థాయి క్రీడా పరికరాల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ బడ్జెట్ అడుగులు వేస్తోందని కేంద్రం ప్రకటించింది. ఇక ఈ బడ్జెట్‌లో క్రీడా పరికరాల రంగానికి తొలిసారిగా రూ.500 కోట్ల భారీ నిధులు కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయం. పరిశోధనలు, సరికొత్త డిజైన్లు, మెటీరియల్ సైన్స్‌పై దృష్టి సారించి భారత్‌ను ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా మార్చడమే దీని లక్ష్యంగా పునరుద్ఘాటించింది. మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తితో ఈ నిధులు క్రీడా స్టార్టప్‌లకు, చిన్న తరహా పరిశ్రమలకు కొండంత అండగా నిలవనున్నాయి. అలాగే ప్రస్తుతం ఖరీదైన క్రీడా పరికరాల వల్ల పేద, మధ్యతరగతి యువత ఆటలకు దూరమవుతున్నారు. తాజా నిర్ణయంతో నాణ్యమైన సామాగ్రి దేశీయంగానే తక్కువ ధరకే అందుబాటులోకి రానుంది. దీనివల్ల దిగుమతులపై ఆధారపడటం తగ్గి, సబ్సిడీల రూపంలో వర్ధమాన క్రీడాకారులకు ప్రత్యక్ష లబ్ధి చేకూరుతుంది. తద్వారా దేశీయ స్థానిక కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్‌లో గట్టి పోటీని ఇచ్చే స్థాయికి ఎదుగుతాయి. ఇక ప్రతిభావంతులైన క్రీడాకారులను అట్టడుగు స్థాయి నుంచి గుర్తించేందుకు 2017లో ప్రారంభించిన ఖేలో ఇండియా పథకాన్ని ప్రభుత్వం మరింత విస్తరించింది. రాబోయే పదేళ్లలో క్రీడారంగాన్ని సమూలంగా మార్చే లక్ష్యంతో ఖేలో ఇండియా మిషన్‌ను ప్రారంభించనున్నారు.

దీని ద్వారా ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు శిక్షణ కేంద్రాలను అనుసంధానం చేస్తారు. ఈ పథకానికి ఈ ఏడాది రూ.924.35 కోట్లు కేటాయించారు. కేవలం ఆటలకే పరిమితం కాకుండా క్రీడా శాస్త్రం, టెక్నాలజీని శిక్షణలో భాగం చేయనున్నారు. కాగా క్రీడాకారులను తీర్చిదిద్దే కోచ్‌లకు కూడా ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కింది. పుల్లెల గోపీచంద్ నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ సిఫార్సుల మేరకు కోచ్‌లకు మెరుగైన శిక్షణ, ఆర్థిక తోడ్పాటు అందించనున్నారు.

అథ్లెట్ల శిక్షణ బాధ్యతలు చూసే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) నిధులను రూ.917.38 కోట్లకు పెంచారు. క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలను కూడా రూ.28 కోట్ల నుంచి రూ.40 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే సాయాన్ని రూ.425 కోట్లకు పెంచారు. ఇదే సమయంలో ఈ ఏడాది జూలై, ఆగస్టులో గ్లాస్గో వేదికగా జరగనున్న కామన్వెల్త్ గేమ్స్ కోసం కేంద్రం నిధులను భారీగా పెంచింది. గత ఏడాది రూ.28.05 కోట్లు ఉండగా, ఈసారి 78 శాతం పెంచి రూ.50 కోట్లు కేటాయించింది.

ఇది అంతర్జాతీయ వేదికలపై భారత అథ్లెట్లు మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఉపయోగపడనుందని భావిస్తోంది. అయితే, డోపింగ్ నియంత్రణ సంస్థలైన నాడా, ఎన్డీటీఎల్ నిధుల్లో మాత్రం ప్రభుత్వం స్వల్పంగా కోత విధించింది.

భారత్ ప్రస్తుతం 2030 కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడంతో పాటు, 2036 ఒలింపిక్స్ నిర్వహణ కోసం బిడ్ దాఖలు చేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో క్రీడారంగంలో మౌలిక వసతులు, శిక్షణ, దేశీయ తయారీరంగాలను బలోపేతం చేయడం ద్వారా ప్రపంచ క్రీడా పటంలో భారత్‌ను అగ్రస్థానంలో నిలపాలని ప్రభుత్వం ఈ బడ్జెట్ ద్వారా సంకల్పించింది.

# సింధు జలాల వివాదంపై సిఓఎ విచారణకు భారత్ నో!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** సింధూ జలాల ఒప్పందంపై మళ్లీ విచారణ చేపట్టనున్నట్లు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ తెలిపిన వేళ, భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ విచారణలో తాము పాల్గొనబోమని స్పష్టం చేసింది. భారత్ పాకిస్థాన్ సింధు జలాల ఒప్పందానికి సంబంధించి కొత్త విచారణలు, ఆదేశాలతో హేగ్‌లోని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కోర్ట్ (సీవోఏ) ముందుకు సాగుతున్న వేళ, ఈ విచారణల చట్టబద్ధతను గుర్తించబోమని భారత్ తేల్చిచెప్పింది. జల విద్యుత్ కేంద్రాల కార్యాచరణ పాండేజ్ లాగ్‌బుక్‌లను సమర్పించాలని వారం క్రితం సీవోయే భారత్‌కు తెలిపింది. ఈనెల 23 తేదీన ఈ కేసును విచారిస్తామని కోర్టు తెలిపింది. భారత్ ఇంతవరకు ఎలాంటి ప్రతివాద నివేదికను దాఖలు చేయలేదని పేర్కొంది. అయితే, మధ్యవర్తిత్వకోర్టు వ్యాఖ్యలపై భారత్ మండి పడింది. చట్టవిరుద్ధంగా ఏర్పాటైన సీవోయే, అసంబద్ధమైన విచారణలను కొనసాగిస్తోందని పేర్కొంది. సీవోయే చట్టబద్ధతను తాము గుర్తించనందున, ఆ సంస్థ ఆదేశాలపై స్పందించబోమని తేల్చిచెప్పింది. అదనంగా ఇండస్ వాటర్‌ట్రీటీ నిలిపివేసినందున భారత్ స్పందించాల్సిన అవసరమే లేదని స్పష్టంచేసింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌కు జలాలను తరలించే సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపేసింది. నీరు, రక్తం కలిసి ప్రవహించలేవని చెప్పిన కేంద్రం సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేసినట్లు ప్రకటించింది.

# ఆంధ్ర టూ ఒరిస్సా రైస్.. ఒరిస్సా టూ ఆంధ్ర గంజా!

## రహస్యంగా అక్రమ రవాణా...

## కరవైన అధికారుల నిఘా

**సాలూరు, (పార్వతీపురం మన్యం జిల్లా ) పిబ్రవరి 2 ప్రభాతవార్త :** సర్కార్ ద్వారా పేదలకు అందవలసిన టన్నుల కొలది పీడీఎస్ బియ్యం ఆంధ్ర నుంచి ఒరిస్సాకు అక్రమంగా రవాణా అయిపోతున్నాయి. బంగారు భవిష్యత్ ఉన్న యువత జీవితాలను నాశనం చేసే గంజాయి ఒరిస్సా నుంచి ఆంధ్రతో పాటు ఇతర రాష్ట్రాలకు హద్దులు దాటి రవాణా సాగిపోతుంది. దీని వెనుక పెద్ద రాకెట్ నడుస్తోందని తెలుస్తోంది. ఇంత జరుగుతున్న ఇటు బియ్యం రవా ణాన్ని గాని, అటు గంజాయి రవాణాన్ని పోలీస్, విజిలెన్స్, ఎక్సైజ్ అధికారులు నియంత్రించలేకపోతుండడం పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. అక్రమార్కులకు పోలీసులే తెరవె నుక స్నేహ హస్తం అందిస్తున్నారా? లేదంటే అక్రమ రవాణా దారులు పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బియ్యం, గంజాయి అక్రమ రవాణా నిత్యం సాగుతున్న అధికారులు అప్పుడప్పుడు మాత్రమే అక్రమార్కులను పట్టుకున్నట్లు, కేసులు నమోదు చేస్తున్నట్లు మీడియాకు వివరించడం పై సర్వత్ర ఆశ్చర్య వ్యక్తం అవుతుంది.

ఇదిలా ఉండగా పట్టణంలోని ఎక్కడపడితే అక్కడ శివారు ప్రాంతాల్లోనూ గంజాయి వినియోగదారుల సంఖ్య పెరుగుతున్న పోలీస్ అధికారులు వాటి నియంత్రణకు పెద్దగా దృష్టి పెట్టలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

**చేతులు మారుతున్న పిడిఎఫ్ బియ్యం:**

సాలూరు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో కూడా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)కు సంబంధించిన బియ్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేతులు మారుతుంది. పిడిఎస్ బియ్యం కేవలం పేదల వినియోగానికి మాత్రమే పంపిణీ చేస్తుండగా చేతుల భారీ భారీ స్థాయిలో అక్రమ రవాణా జరిగిపోతుంది. కొంతమంది రేషన్ డీలర్లతో పాటు పలువురు అక్రమార్కులు చేతులు కలిపి ఈ రేకటి నడిపిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

**మాస్ ఏరియా గల్లీల్లో గంజాయి పేకెట్స్ దందా**

ఒరిస్సా హద్దులుదాటి గంజా పలురకాలుగా ఆంధ్రలోకి అక్రమంగా రావడం ఇతర రాష్ట్రాలకు జిల్లాలకు తరలించి స్మగ్లర్స్ సొమ్ము చేసుకోవడం నిత్య కృత్యంగా మారిందని బాహాటంగా వినిపిస్తుంది. సాలూరు పట్టణం లో పేకట్ల రూపంలో గంజాయి దొరుకుతుందనేది సమాచారం. గుర్తు తెలియని వ్యక్తులు ఒరిస్సా నుండి అక్రమంగా బ్యాగుల్లో గంజా ప్యాకెట్లు పెట్టుకుని పట్టణంలో ఉన్న మాస్ ఏరియాలోకి వచ్చి వ్యాపారం సాగిస్తున్నారని వినికిడి. పోలీసులు, విజిలెన్స్, ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి బియ్యం గంజాయి అక్రమ రవాణా దార్లపై ఉక్కు పాదం మోపాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేకు రూ.10,134 కోట్లు

## పురోగతిలో రూ. 92,649 కోట్ల పనులు

## వివరాలు వెల్లడించిన ద.మ రైల్వే జిఎం శ్రీవాస్తవ

**హైదరాబాద్ (తార్నాక), ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధి కోసం 2026- 27 సంవత్సరానికి గరిష్ట స్థాయిలో రూ. 10,134 కోట్ల నిధుల కేటాయింపు జరిగిందని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. రైల్వేలకు కేటాయింపులతో కూడిన కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో సమర్పించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేంద్ర రైల్వే, సమాచార ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్, న్యూఢిల్లీ నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన కేటాయింపుల ముఖ్యాంశాలపై సోమవారం వర్చువల్ గా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన విలేకరుల సమావే శంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మరియు ఇతర సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ 2026- 2027 సంవత్స రానికి గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రికార్డు స్థాయిలో రూ. 10,134 కోట్ల బడ్జెట్ కేటాయింపులు మంజూరు అయ్యాయని తెలియజేశారు. 200914 సంవత్సరాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వార్షి క సగటు బడ్జెట్ వ్యయం రూ.886 కోట్లు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులు ఉమ్మడి రాష్ట్రానికి 2009- 14 మధ్యకాలంలో జరిగిన సగటు కేటాయింపులతో పోలిస్తే 11 రెట్లు పెరిగిందని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ. 92,649 కోట్ల కోట్ల విలువైన వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అమలు చేయబడుతున్నాయని, ఆంధ్రప్రదేశ్‌లో ని రైల్వే నెట్‌వర్క్ ఇప్పుడు 100శాతం విద్యుదీకరణ చెందిందని తెలియజేశారు. మంత్రి దేశవ్యాప్తంగా ఏడు హై స్పీడ్ రైలు కారిడార్లను ప్రకటించారు. ఈ ఏడింటిలో, హైదరాబాద్ – బెంగళూరు మరియు హైదరాబాద్ – చెన్నై అనే రెండు హై స్పీడ్ రైలు కారిడార్లు ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుండా వెళ్తాయి. దీనితో రాష్ట్ర ప్రజలకు అపారంగా ప్రయోజనం చేకూరుస్తాయి. ఈ రెండు హై స్పీడ్ రైలు కారిడార్లు ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడంలో సహాయపడతాయి. ఈ కారిడార్లు ఆర్థిక వృద్ధి కారిడార్లుగా పనిచేస్తూ విద్య, ఆరోగ్యం, వ్యాపారం మొదలైన వాటికి సౌకర్యం కల్పిస్తాయి. ఈ హై స్పీడ్ రైళ్ల ప్రవేశంతో హైదరాబాద్ – బెంగళూరు మధ్య ప్రయాణ సమయం 2 గంటలు మరియు హైదరాబాద్ – చెన్నై మధ్య ప్రయాణ సమయం 2 గంటల 55 నిమిషాలుగా ఉంటుందని అంచనా.

# ఇంధన స్విచ్ లోపంతో నిలిచిపోయిన ఎయిరిండియా విమానం

**లండన్, ఫిబ్రవరి 2:** లండన్ నుంచి బెంగళూరు రావాల్సిన విమానం సాంకేతిక లోపం కారణంగా బయల్దేరడానికి కొద్ది గంటల ముందే ఆగిపోయింది. ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 విమానం సోమవారం లండన్ నుంచి బెంగళూరు బయల్దేరాల్సి ఉంది. ముందస్తుగా నిర్వహించిన తనిఖీల్లో ఫ్యుయల్ కంట్రోల్ స్విచ్‌లో లోపం ఉండటాన్ని పైలట్ గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ అంశంపై ఓఈఎం (విమానం, విడిభాగాల తయారీ సంస్థ)కు తెలిపినట్లు అధికారులు తెలిపారు. అలాగే డీజీసీఏకు కూడా సమాచారమిచ్చినట్లు చెప్పారు. సాంకేతిక లోపాన్ని గుర్తించడంతో విమానాన్ని పూర్తిగా నిలిపివేసినట్లు ఎయిర్ ఇండియా అధికారులు వెల్లడించారు. ఫ్యుయల్ స్విచ్‌లో లోపం గురించి పైలట్ సమాచారం అందించడంతో చర్యలు తీసుకున్నామని, బోయింగ్ సంస్థకు చెప్పామని ఎయిర్ ఇండియా ప్రతినిధులు అన్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిచ్చి, ఆ విమాన సేవల్ని నిలిపివేశామని తెలిపారు. అంతకుముందు జరిపిన తనిఖీల్లో ఈ విషయం బయటపడలేదని అధికారులన్నారు. డీజీసీఏ సూచనల మేరకు అన్ని బోయింగ్ విమానాల్లో ఈ తరహా తనిఖీలు చేశామన్నారు. గత ఏడాది జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో 260 మంది మరణించిన సంగతి తెలిసిందే.

# ధర అమోఘం.. సాగు శూన్యం

## చిక్కిపోతున్న చిరు ధాన్యాల సాగు

## రాష్ట్ర వ్యాప్తంగా ఈ రబీలో వందల ఎకరాల్లోనే సాగు

## మారిన ఆహార అలవాట్లతో చిరు ధాన్యాలకు అధిక డిమాండ్

## సాగు తగ్గడంతో డిమాండ్ మేర తగ్గిన సరఫరా

## రాగులు క్వింటాల్‌కు రూ.5వేలు, జొన్న, సజ్జలకూ 6వేల మించి ధర

**హైదరాబాద్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుతం చిరు ధాన్యాలకు రికార్డు స్థాయిలో ధర పలుకుతున్నా సాగు చేసేందుకు అన్నదాతలు ఆసక్తి చూపడం లేదు. ఇందుకు చిరుధాన్యాల సాగుపై రైతుల్లో అవగాహన కొరవడడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇటీవలి కాలంలో చిరుధాన్యాల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెరిగినా సాగుపై మాత్రం అన్నదాతలకు తగిన అవగాహన లేదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. నెల రోజులుగా రాష్ట్రంలోని పలు వ్యవసాయ మార్కెట్‌లలో రాగులు, కొర్రలు, సజ్జలు, జొన్నతోపాటు వేరుశనగ తదితర పంటలకు రికార్డుస్థాయిలో ధర పలుకుతోంది. రాగులు క్వింటాల్‌కు రూ.5వేల ధర పలుకుతోంది. జొన్నకు క్వింటాల్ రూ.6వేలకు పైగా ఉండగా, కొర్రలు క్వింటాల్‌కు రూ.10వేలపైనే పలుకుతున్నాయి. మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌తోపాటు వరంగల్, ఖమ్మం తదితర వ్యవసాయ మార్కెట్లకు కొద్దిమొత్తంలో రోజూ రాగులు, సజ్జలు వంటి చిరు ధాన్యం వస్తోంది. రాగులు క్వింటాల్‌కు రూ.5వేల ధర ధర వస్తుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే అంతా కలిపి కనీసం రోజూ 50 క్వింటాళ్ల మేర కూడా ఏ మార్కెట్‌కు రాని పరిస్థితి నెలకొంది. దీంతో మార్కెట్‌లో చిరు ధాన్యాలకు ధర ఉన్నా దిగుబడి లేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత మారిన జీవనశైలి నేపథ్యంలో ఒకప్పుడు నిరుపేదల ఆకలి తీర్చిన చిరు ధాన్యాలు ఇప్పుడు ప్రతీ ఒక్కరి నిత్య జీవితంలో ఆహారమయ్యాయి.

మూడు పదుల వయసు దాటకముంటే బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులు వెంటాడుతున్న ఈ రోజుల్లో పేద, ధనిక అన్న తేడా లేకుండా ఆహారంలో చిరు ధాన్యాలవైపే దృష్టి పెట్టారు. రాగులు, కొర్రలు, సజ్జలు, సామలు తదితరాల వినియోగం అనేక రకాల జీవనశైలి వ్యాధుల నుంచి ఊరటనిస్తోంది. ఆహారంలో నిత్యం రాగులు, కొర్రలు, సజ్జల వినియోగిస్తే నరాల శక్తితోపాటు మానసిక సామర్థ్యం పెంపు, ఆర్థరైటిస్, పార్కిన్సన్ రోగాల నుంచి విముక్తి కల్పిస్తాయి. జీవనశైలి వ్యాధుల నుంచి ఊరటనిస్తోంది. ఆహారంలో నిత్యం రాగులు, కొర్రలు, సజ్జల వినియోగిస్తే నరాల శక్తితోపాటు మానసిక సామర్థ్యం పెంపు, ఆర్థరైటిస్ , పార్కిన్సన్ రోగాల నుంచి విముక్తి కల్పిస్తాయి.

అధిక రక్తశుద్ధి, రక్తహీనత, డయాబెటిస్, మలబద్ధకం తదితర అనారోగ్య సమస్యలు దరి చేరవని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. లివర్, కిడ్నీ ఆరోగ్యంతోపాటు కామెర్ల వ్యాధి నియంత్రణకూ చిరు ధాన్యాల ఆహారం ఎంతో మేలు చేస్తుందని పరిశోధనల్లో తేలింది. థైరాయిడ్, కంటి సమస్యలు, ఊబకాయం వంటి వ్యాధుల నుంచి చిరు ధాన్యాల ఆహారంతో విముక్తి లభిస్తుందని అనేక వైద్య పరిశోధనలు తేల్చి చెబుతున్నాయి.

చిరుధాన్యాలకు ఇంతటి ప్రాధాన్యం ఉన్నా తెలంగాణలో వీటి సాగు నానాటికీ ప్రమాదకరస్థాయిలో తగ్గిపోతోండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ యాసంగి (రబీ) సీజన్‌లో తెలంగాణలో ఇప్పటి వరకు కేవలం రాగులు 67 ఎకరాల్లో, కొర్రలు 23 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. ఇక జొన్న మాత్రం 2, 06, 001 ఎకరాల్లో సాగయింది. సజ్జలు 40 ఎకరాల్లోనే రబీలో సాగయ్యాయి.

అయితే దశాబ్ద క్రితం వరకు కొద్దో గొప్పో విస్తీర్ణంలో చిరుధాన్యాలు సాగైనా వాటిని ఎక్కడ విక్రయించాలో రైతులకు అవగాహన లేకపోవడంతో ఇటీవలి కాలంలో ప్రమాదకరస్థాయిలో సాగు తగ్గుముఖం పడుతోంది. దీంతో రాష్ట్ర సాగు ముఖచిత్రంలో చిరుధాన్యాలు కనిపించకుండా పోతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో చిరు ధాన్యాల సాగుపై రైతుల్లో అవగాహన కల్పించాలని ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ మార్పులను తట్టుకునే చిరుధాన్యాల విత్తనాలను సబ్సిడీపై అందించాలని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ తదితర స్వచ్ఛంద సంస్థలతోపాటు వ్యవసాయ నిపుణులు కోరుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో స్వయంగా ప్రభుత్వమే చిరు ధాన్యాలను కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.

# దేవాదాయ శాఖ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇళ్ల స్వాధీనం



ఇళ్లకు సీల్ వేస్తున్న సిబ్బంది



వివరాలు తెలుసుకుంటున్న ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్ (సైదాబాద్), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** చారిత్రక నేపథ్యం కలిగిన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయానికి అనుబంధంగా ఉన్న బాన్సూరివాల కృష్ణ మందిరానికి చెందిన స్థలంలో అక్రమంగా నిర్మించిన ఇండ్లను అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సర్వే నెం. 110లో దేవాలయానికి చెందిన 2.35 ఎకరాల స్థలం ఉంది. దీనిలోని 20 గుంటల స్థలాన్ని చాలా ఏళ్ల క్రితం కొందరు ప్లాట్లుగా చేసి విక్రయించడంతో కొనుగోలు చేసిన వారు ఇండ్లు కట్టుకున్నారు. కబ్జాకు గురికాబడిన ఈ స్థలంలో ప్రస్తుతం 21 ఇండ్లు ఉన్నాయి. అయితే దేవాలయానికి చెందిన ఈ స్థలాన్ని అక్రమంగా కబ్జాచేసి ఇండ్లు కట్టుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. దీంతో ఇండ్లలో నివాసం ఉంటున్న వారికి, దేవాదాయ శాఖకు మధ్య చాలా కాలంగా కేసు నడుస్తుంది. ఇటీవల ట్రిబ్యునల్‌లో దేవాదాయ శాఖకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో 9 మంది హైకోర్టును ఆశ్రయించగా తుది తీర్పు వచ్చే వరకు రూ.3,500 చొప్పున కిరాయి చెల్లిస్తూ ఇండ్లలోనే ఉండవచ్చని సూచించింది. దాదాపు ఏడాది క్రితమే ఒక ఇంటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరో 11 మంది మాత్రం కిరాయి చెల్లించడానికి అంగీకరించలేదు. అప్పీల్‌కు కూడా వెళ్లలేదు. దీంతో వారికి ఇండ్లు ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. ట్రిబ్యునల్ జారీ చేసిన ఎవిక్షన్ ఉత్తర్వుల కాల పరిమితి మూడు నెలలు ముగిసినప్పటికీ 11 మంది ఇండ్ల నివాసితుల నుండి స్పందన లేదు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుఝామున దేవాదాయ శాఖ అధికారులు స్థానిక పోలీసులతో కలిసి భారీ బందోబస్తుతో ఇండ్ల వద్దకు చేరుకున్నారు.

### 11 ఇళ్ల స్వాధీనం.. ఉద్రిక్తత

అధికారులు తమ ఇండ్లను స్వాధీనం చేసుకోవడానికి రానున్నారన్న సమాచారంతో 11 ఇండ్ల యజమానులు వారి ఇండ్లకు ముందే తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. సోమవారం తెల్లవారుఝామున ఇండ్ల వద్దకు చేరుకున్న అధికారులు ఇంటి తాళాలు పగుల గొట్టి ఇండ్లలోని సామాగ్రిని తమ సిబ్బందితో బయటకు తీసుకువచ్చారు. ఇండ్ల తాళాలు పగులగొడుతున్న విషయం తెలుసుకున్న ఇండ్ల యజమానులు తమ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడకు చేరుకుని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ఇండ్ల యజమానులకు అండగా నిలిచారు. అధికారుల తీరును నిరసిస్తూ కొందరు పెట్రోలు పోసుకోవడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఉద్రిక్తతల మధ్యలోనే అధికారులు 11 ఇండ్లను స్వాధీనం చేసుకుని సీల్ వేశారు. దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమీషనర్ టి.శేఖర్, దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎస్.లావణ్య, ఎల్‌బినగర్ ఎసిపి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### 35 యేళ్లుగా ఇక్కడే ఉంటున్నాం..

35 యేళ్లుగా ఇండ్లు కట్టుకుని ఇక్కడే ఉన్న తమను, ఇప్పుడు ఇది దేవాలయ స్థలమని ఖాళీ చేసి వెళ్లిపోవాలని చెప్పడం అన్యాయమని ఇండ్లలో ఉంటున్న వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీలో ప్రభుత్వ పరంగా డ్రైనేజీ, రోడ్లు, త్రాగునీరు, కరెంటు ఉన్నాయని ఇప్పుడు దేవాదాయ శాఖ స్థలమని చెబుతూ ఖాళీ చేయాలని చెప్పడం ఎంత వరకు సబబని వారు వాపోయారు. పైసా పైసా కూడబెట్టి ఇండ్లు కట్టుకున్నామని, ఇప్పుడు తాము ఎక్కడకు వెళ్లాలని, తమకు చావే దిక్కని వారు కన్నీరు మున్నీరయ్యారు.

# జోగి రమేష్‌కు భద్రత కల్పించండి

## హైకోర్టు ఆదేశం

**విజయవాడ,ఫిబ్రవరి2,ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి భద్రత కల్పించాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది.ఈ కేసులో బాధ్యు లను గుర్తించి చర్యలు తీసుకోవా లని, ఎవ్వరిపై కేసులు నమోదు చేసింది వెల్లడించాలని కోరింది. బాధితుల వాదన,సాక్ష్యాలను పరి గణనలోనికి తీసుకోవాలని సూచిం ది. తన భద్రత విషయమై ఎపి హైకోర్టును ఆశ్రయించారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం లోని తన నివాసంపై టిడిపి కార్యకర్తలు దాడి చేశారని ఆరోపిస్తూ .. తనకు భద్రత కల్పించాలని కోరుతూ ఆయన లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఆయన కుమారుడు జోగి రోహిత్ కుమార్ కూడా హైకోర్టులో మరో లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. తమ ఇంటిపై దాడి జరిగే అవకాశం ఉందని పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదని రోహిత్ తన పిటిషన్‌లో ఆరోపించారు. గుంపులుగా వచ్చిన వ్యక్తులు దాడి చేస్తుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకుండా కేవలం ప్రేక్షకపాత్ర పోషించారని పేర్కొన్నారు. తమకు, తమ కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, వెంటనే భద్రత కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

NOTICE
IN THE COURT OF THE HONBLE 1ST ADDL SENIOR CIVIL COURT AT NEREDMET
O.S.NO. 487 OF 2025
BETWEEN
D. Lavanya & others — Plaintiffs
and
The Thasildar R.R.Dist & All Concerned — Defendants
To,
All Concerned
Please Take notice that my clients 1.D. Lavanya 2.Mrs Bhaylaxmi 3.Mr. Pradeep Raj has filed the suit for declaration to declare them as the legal heirs of deceased namely D.Shankar Raj alis D. Rajamani for the purpose of legal status against you
The main suit is posted on 18th February 2026 at 10:30 AM before the Honble 1ST Addl. Senior Civil Court at Neredmet. You are hereby inform to attend the court to above mention date and time if you fail to appear then the Honble court will proceed with the matter as per law.
HENCE THIS NOTICE
FROM
N. Chandra Sheela
(Advocate & Associates)
Office at 13-2-757/2, Rahimpura Puranapul, Hyderabad
Cell.No. 8008635104
E Mail Id. Sheelachandra49@gmail.com

# సంక్లిష్ట సమయంలో ఆయన 'మార్క్' పాలన సాధ్యమయ్యేనా!?




## ధార్మికసంస్థ టిటిడి నూతన ఇఒగా ముద్దాడ రవిచంద్ర రేపు బాధ్యతలు

తిరుమల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: దేశంలో అత్యున్నత హోదా అధికారవర్గాల్లో ఐఎఎస్, ఐపిఎస్ కేడర్ అధికారులుగా వివిధ శాఖల్లో పనితీరు సాగించడం వారి అనుభవం, అవగాహన బట్టి ఉంటుంది. అయితే అదే కేడర్‌లో హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో కార్యనిర్వహణాధికారి (ఇఒ)గా, సంయుక్త కార్యనిర్వహణాధికారి (జెఇఒ)గా, ముఖ్య నిఘా భద్రత అధికారి(సివిఎస్ఒ)గా పాలన చేయడం అందుకు భిన్నంగా ఉంటుంది. ప్రభుత్వ పరిపాలనలో అటు ప్రజలతో ఇటు ప్రభుత్వంలోని క్రిందిస్థాయి ఉద్యోగులతో సానుకూల దృక్పథంతో, సమయానుకూలంగా మెలగడం ఒక ఎత్తయితే టిటిడిలో ఇఒ హోదాలో శ్రీవారి భక్తులతో మమేకమై ఉద్యోగులతో కలసి బోర్డుతో సమన్వయంగా పనిచేయాల్సి ఉండటం కత్తిమీద సాములాంటిదే. ఏ చిన్న తేడా వచ్చినా, బేధాభిప్రాయం కలిగినా ఆ హోదాలో ఉన్న అధికారికి అందరి సహకారం దూరమతుంది. అంతటి సున్నితమైన పదవి టిటిడిలో ఇఒ, అదనపు ఇఒ, జెఇఒ స్థానాలు. ఇక్కడ ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా, వాటిని ఆమోదించాలన్నా బోర్డు సూచనలతో బాటు సుదీర్ఘ అనుభవం ఉన్న ఉద్యోగుల సలహాలు కూడా వినడం ప్రధానం. మరీ అలాంటిది ఇప్పటివరకు పలు హోదాల్లో వివిధ చోట్ల పనితీరు సాగిస్తూ, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావడంలో తనదైన మార్కు సాధించిన సీనియర్ ఐఎఎస్ అధికారి, ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి హోదాలో సేవలందిస్తున్న ముద్దాడ రవిచంద్ర టిటిడి ఇఒగా నియమితులు కావడం తెలిసిందే. ఆయన తొలిసారిగా బుధవారం ఉదయం తిరుమల ఆలయంలో స్వామివారి చెంత సంప్రదాయంగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసి ఇఒగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సిఎం నుండి టిటిడి పరిపాలన, ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై తగిన సూచనలు తీసుకున్నారు. మంగళవారం(నేడు) మధ్యాహ్నం తిరుపతికి చేరుకుంటున్న ముద్దాడ తిరుమలకు చేరుకుని రాత్రికి ఇక్కడే బసచేస్తారు. బుధవారం ఉదయం ఆయన ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్న తరువాత ఆలయంలోపల ఇఒగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లా కలెక్టర్‌గా 2008-2009 మధ్యకాలంలో పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ జిల్లాకు సుపరిచితులే. మంచి అధికారిగా కూడా పేరుంది. అప్పట్లోనే ఉద్యోగుల పాలిట పక్షపాతిగా సమస్యల పరిష్కారంలో సున్నితత్వంతో వ్యవహరించారనేది అధికారవర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన టిటిడి ఇఒగా వస్తుండటం, ముక్కుసూటి అధికారిగా అధికారవర్గాల్లో నానుడి ఉండటంతో ఈ పదవిలో ఆయన తన పాలన అనుభవంతో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది.

- సంక్లిష్ట సమయంలో...

ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో కార్యనిర్వహణాధికారిగా (ఇఒ) హోదాలో ఆత్మస్థైర్యంతో, ముక్కుసూటితనంతో అటు బోర్డుతో సమన్వయంగా మెలగి ప్రభుత్వం ఆదేశించిన అంశాలను సమర్ధవంతంగా అమలుచేయడం ప్రధానం. ప్రస్తుతం తిరుమలలో కల్తీనెయ్యి వ్యవహారంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారుల ప్రమేయం ఉందనేది సిబిఐసిట్ ఇచ్చిన నివేదిక. దీన్ని అమలుచేయడంలో ముద్దాడ ఒకింత ముక్కుసూటిగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఇందుకు బోర్డు కూడా ఆయనకు సహకారం అందించాల్సిన పరిస్థితి. అదేగాక బోర్డు ఇప్పటికే తీసుకున్న పలు నిర్ణయాలు, ఆమోదించిన కీలక అంశాల అమలుపై నూతన ఇఒ రవిచంద్ర పట్టుకలిగిన అధికారిగా అడుగువేయాల్సి ఉంటుంది. టిటిడి పాలనలో సుప్రీమ్ అయిన టిటిడి ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులతో సఖ్యతగా వ్యవహరించి పలు కీలక విషయాలను ముందుకు నడిపించాల్సిన అవసరం ఉంటుంది. అలిపిరిలో బేస్‌క్యాంప్, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ అమలుపై కూడా సమీక్షించుకుని తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది. టిటిడిలో పూర్తిస్థాయిలో క్రిందిస్థాయి అధికారులతో, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ పాలన సాగించగలిగితే ఇఒగా ముద్దాడ సఫలీకృతులవుతారు. తిరుమల పవిత్రతను కాపాడటంలో ఎక్కడా ఎలాంటి ఒత్తిళ్ళకు తలొగ్గరాదని, నిబంధనలు అమలయ్యేలా చూడాలని చంద్రబాబు నిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. కొన్ని అనూహ్య నిర్ణయాలను అమలుచేయడంలో ఇఒ కీలకపాత్ర వహించాల్సి ఉంటుంది. అలాంటిది కొన్ని నిర్ణయాలను అమలు చేయడానికి, అన్యమత ఉద్యోగులపై కీలకనిర్ణయం తీసుకునేందుకు కూడా ఇఒగా ఆయన ఒకింత అధ్యయనం అవసరం. 2019-24 మధ్యకాలంలో వైసిపి మద్దతుదారులైన కొందరు ఉద్యోగులను, అధికారులను బదిలీ చేయాలనే నిర్ణయాలను కూడా ముద్దాడ సమర్ధవంతంగా అమలుచేయాల్సి ఉంది. కొందరు అధికారుల, ఉద్యోగుల తీరుతో విసిగిపోయిన ప్రస్తుత టిటిడి బోర్డు ఆదేశాలను తూచ తప్పక పాటించడంలో నేర్పరిగా ఎలా నెట్టుకొస్తారనేది చూడాల్సిందే.

### శ్రీవారి చెంత సేవచేసే భాగ్యం అదృష్టమే

- మరింత బాధ్యతను గుర్తుచేసింది
- నేడు టిటిడి నూతన ఇఒ ముద్దాడ రాక

తిరుమల, ఫిబ్రవరి 2 పభాతవార్త ప్రతినిధి: హిందూ పుణ్యక్షేత్రం తిరుమల ఆలయ పవిత్రతను కాపాడటంతోబాటు సాధారణ భక్తులకు మరింత మెరుగ్గా సేవలందించేందుకు సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగించుకుని పాలన సాగించడంపై దృష్టి పెడతానని టిటిడి నూతన ఇఒగా నియమితులైన ముద్దాడ రవిచంద్ర అభిప్రాయం. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీర్వాదబలం, తన పూర్వజన్మ సుకృతం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నమ్మకంతోనే ఇఒగా నియమించడం జరిగిందని తెలిపారు. దేవుని చెంత పనిచేసే అవకాశం తనలో మరింత బాధ్యతను గుర్తుచేయడమేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల సూచనలు స్వీకరించి టిటిడి సేవలు మెరుగుపరచడంపై ఒకింత దృష్టి సారించనున్నారు. గతంలోనూ తిరుమలకు కుటుంబంతో కలసి వచ్చానని గుర్తుచేసుకున్నారు. కాగా 2026-27 వార్షిక బడ్జెట్‌పై కూడా ముద్దాడ మార్కుపాలన చూపాల్సి ఉంది.

## తిరుమల సమాచారం



### తిరుమలేశుని సేవలో జాతీయ అంధుల క్రికెట్ జట్టు

తిరుమల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల శ్రీవేంకటేశ్వర స్వామిని తమ హృదయాలతో దర్శనం చేసుకుని, సకల శుభాలు కలగాలని ఆశీస్సులందుకున్నామని భారత జాతీయ అంధుల క్రికెట్ టీమ్ దీపిక తెలిపారు. తిరుమలలో తమకు చక్కటి ఏర్పాట్లతో ఆ స్వామి దర్శనం కలిగిందని, చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందించారు.

### శ్రీవారి ఆశీస్సులతో అద్భుతంగా న్యూజిలాండ్ సిరీస్

#### భారత క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్ దిలీప్



తిరుమల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో భారత క్రికెట్ జట్టుకు మంచి రోజులు వచ్చాయని, ఇటీవల న్యూజిలాండ్ సిరీస్ అద్భుతంగా జరిగిందని భారత క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్ దిలీప్ ఆనందం వ్యక్తం చేశారు. బ్యాటింగ్‌తోబాటు బౌలింగ్, ఫీల్డింగ్ అద్భుతంగా ఆడారన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు అందుకుంటామని విశ్వాసం వెలిబుచ్చారు. సిరీస్ నుండి తిరుమలకు వచ్చిన వెంటనే తనకు ఆ దేవదేవుని దర్శనం కలిగిందని, చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయ అధికారులు చక్కగా సేవలందించారన్నారు. సోమవారం ఉదయం తిరుమలకు వచ్చిన భారత క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్ దిలీప్ ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయం వెలుపల క్రికెట్ అభిమానులు ఫోటోలు దిగారు.



### వెంకన్న సేవలో విద్యాదీశతీర్థస్వామి

తిరుమల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: భగవంతుని నామస్మరణతోనే అంతా శుభాలు కలుగుతాయని వ్యాసరాజమఠం మఠాధిపతి విద్యాదీశతీర్థస్వామి తెలిపారు. సోమవారం ఉదయం శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి టిటిడి ఇన్‌ఛార్జి ఇఒ, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఆలయమర్యాదలతో మహద్వారం వద్ద స్వాగతం పలికారు. స్వామి ఆలయం లోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనంద నిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఇన్‌ఛార్జి ఇఒ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ గురురాజారావు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



### ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

తిరుమల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: ఆ దేవుని దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా అన్నప్రసాదాలు అందిస్తున్న ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కు దాతలు విరాళాలందిస్తున్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన సాయిసిద్ధార్థ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడును కలసి రూ.10.51లక్షల విరాళం డిడిని అందజేశారు.




### జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పద్మావతి వర్సిటీకి పతకం

యూనివర్సిటీ(తిరుపతి), ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ఇటీవల తమిళనాడులో జరిగిన జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ 9వ ఫెడరేషన్ నేషనల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ మహిళా జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మూడవ స్థానం కైవసం చేసుకుంది. అందులో తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలో బిపిఎడ్ మొదటి సంవత్సరం చదువుతున్న పి.రమ్య అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినట్లు యూనివర్సిటీ వ్యాయామ విభాగ అధిపతి ఆచార్య జి. సరోజినీ తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఉషా విద్యార్థిని ప్రదర్శన పట్ల హర్షం వ్యక్తం చేసి మరెన్నో విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.

### ఎస్వీ ఆయుర్వేద వైద్యశాలలో టిటిడి జెఇఒ డాక్టర్ శరత్ తనిఖీలు



## శ్రీవారి వైద్య సేవకుల సౌకర్యాలపై ఆరా

తిరుపతి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: ధార్మికసంస్థ టిటిడిలో త్వరలో ప్రారంభించనున్న శ్రీవారి వైద్య సేవకులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై చర్యలు చేపట్టినట్లు టిటిడి జెఇఒ (వైద్యం, విద్య) డాక్టర్ ఎ.శరత్ వెల్లడించారు. ఎస్వీ ఆయుర్వేద వైద్యశాల, స్విమ్స్, ఎస్వీ వేదిక్ యూనివర్శిటీలోని అవసరమైన భవనాల నవీనీకరణలో భాగంగా అధికారులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సూచనల మేరకు టిటిడిలో శ్రీవారి వైద్య సేవకు అవసరమైన వైద్య రంగంలోని వివిధ విభాగాల నిపుణులకు అవసరమైన వసతి సౌకర్యం కల్పించేందుకు వీలుగా ఎస్వీ ఆయుర్వేద వైద్యశాల, స్విమ్స్, ఎస్వీ వేదిక్ యూనివర్శిటీలోని వసతి గదులను పరిశీలించామ న్నారు. సంబంధిత వైద్యులు వైద్య సేవ చేసేందుకు వీలుగా వారం రోజులపాటు బస చేసేందుకు వసతి గదుల నవనీకరణ, మౌలిక సౌకర్యాలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతి, తిరుమలలో ఉన్న టీటీడీ ఆస్పత్రుల్లో ముఖ్యంగా అశ్వినీ ఆసుపత్రి, ఆయుర్వేద, స్విమ్స్, బర్డ్, చిన్న పిల్లల ఆసుపత్రుల్లో రోగులకు సేవ చేసేందుకు శ్రీవారి వైద్య సేవను త్వరలోనే ప్రారంభించేందుకు వీలుగా చర్యలు చేపట్టామ న్నారు. వైద్య రంగానికి చెందిన వివిధ విభాగాల వైద్య నిపుణు లు సేవలు అందించేందుకు ముందుకు వచ్చారని డాక్టర్ శరత్ తెలిపారు. ఇప్పటికే టిటిడిలోని వివిధ విభాగాలలో శ్రీవారి సేవకులు వారం రోజుల సేవకు నాలుగు వేల మంది నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారన్నారు. శ్రీవారి సేవను వైద్య, విద్య, ఐటీ రంగాలకు విస్తరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. టీటీడీ సీఎంఒ డాక్టర్ కుసుమ కుమారి, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్, బర్డ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరెడ్డి, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారిరవి, ఎస్ఇలు వేంకటేశ్వర్లు, మనోహరం, నరసింహామూర్తి, ఆర్ఎంఒ భరత్, వైద్యులు పాల్గొన్నారు.

## ముగ్గురిపై చిరుతపులి దాడి

### బొందలవాడలో భయం.. భయం

అనంతపురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడ గ్రామంలో సోమవారం చిరుతపులి దాడిచేసి ముగ్గురిని గాయపర్చిన సంఘటన చర్చనీయాంశంగా మారింది. బొందల వాడ గ్రామానికి చెందిన కోనంకి నాయుడు, లక్ష్మిదేవి, అంకె నారాయణ స్వామి అనే వ్యక్తులపై చిరుతపులి దాడి చేయడంతో వారు గాయపడ్డారు. ఈ సంఘటనతో ఒంటరిగా ఎవరు పొలాలకు వెళ్లరాదని కట్టెలు, కటార్లు తీసుకునే బయటకు వెళ్లాలని బొందలవాడలో అధికారులు చాటింపు వేశారు. పొలానికి పురుగుల మందు పిచికారి చేయడానికి పొలం వద్దకు వెళ్లిన కోనంకి నాయుడుపై చిరుతపులి దాడి చేయడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా గ్రామంలో ఇంటి పనులు చేస్తుండగా వెనకాల నుంచి చిరుత లక్ష్మిదేవిపై దాడి చేసింది. ఈ విధంగా బొందల వాడ గ్రామంలో ముగ్గురిపై చిరుత దాడి చేయడంతో అటవిశాఖ అధికారులు గ్రామంలోకి వచ్చి అందరు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. చిరుతలు సంచరించిన వాటి అడుగుజాడలను పరిశీలించి చిరుతను పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.




### బంగ్లాదేశ్ చెర నుంచి మత్స్యకారులకు విముక్తి

శ్రీకాకుళం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: బంగ్లాదేశ్ నౌకాదళం చెరలో చిక్కుకున్న తొమ్మిది మంది విజయనగరం జిల్లా మత్స్యకారుల విడుదల వ్యవహారం సుఖాంతమైంది. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తన శాఖాపరంగా తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ, దౌత్యపరమైన ఒత్తిడి కారణంగా మత్స్యకారులు సోమవారం క్షేమంగా విశాఖ తీరానికి చేరుకున్నారు. అధికారులు వారికి స్వాగతం పలికారు. మూడు నెలలుగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడటంతో వారి సంబరాలు మిన్నంటాయి. వారిని నివాసాలకు చేరుకున్నారు. గత అక్టోబర్ లో మత్స్యకారులు అన్యదేశంలో బందీలుగా చిక్కుకుపోయారన్న వార్త తెలియగానే మంత్రి అచ్చెన్నాయుడు అత్యంత వేగంగా స్పందించారు. కేవలం ఆదేశాలకే పరిమితం కాకుండా, ప్రతి దశలోనూ వ్యక్తిగత పర్యవేక్షణ చేశారు. మత్స్యశాఖ మంత్రిగా అధికారులను వెంటనే అప్రమత్తం చేసి, పడవ రిజిస్ట్రేషన్ వివరాలు, మత్స్యకారుల చిరునామాలను సేకరించి కేంద్ర విదేశాంగ శాఖకు నివేదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వద్దకు స్వయంగా సమస్యను వివరించారు. మత్స్యకారుల దీనస్థితిని వివరించి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాయించడంలో కీలక పాత్ర పోషించారు. మూడు నెలల కాలంలో విడుదల కావడంలో మంత్రి అచ్చెన్నాయుడు చేసిన కృషి అభినందనీయమని మత్స్యకారులు తమ సంతోషాన్ని పంచుకున్నారు. భారత కోస్ట్‌గార్డ్, బంగ్లాదేశ్ అధికారులతో మత్స్యశాఖ ఉన్నతాధికారులు నిరంతరం టచ్‌లో ఉండేలా చూస్తూ, విడుదల ప్రక్రియలో ఎదురైన సాంకేతిక అడ్డంకులను తొలగించారు. బంగ్లాదేశ్ సరిహద్దుల నుంచి విడుదలైన మత్స్యకారులు సోమవారం ఉదయం విశాఖ చేరుకున్నారు. తమను సురక్షితంగా రప్పించడంలో అహర్నిశలు కృషి చేసిన మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు మత్స్యకారుల కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మత్స్యశాఖ మంత్రిగా మా మత్స్యకారుల క్షేమమే మాకు ప్రథమ ప్రాధాన్యం. బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు ఉన్నా, కేంద్ర ప్రభుత్వ సాయంతో వారిని రప్పించగలిగాం. ఆపదలో ఉన్న మత్స్యకారులను ఆదుకోవడంలో ఈ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

## తనకేం జరిగినా లోకేష్‌దే బాధ్యత

- నన్ను మట్టుపెట్టాలని ఇంటిపై దాడి
- ఏం జరిగినా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటా
- తేల్చి చెప్పిన మాజీ మంత్రి జోగి రమేష్




విజయవాడ, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ప్రతినిధి: భవిష్యత్తులో తనకు, తన కుటుంబానికి ఏ హాని జరిగినా దానికి మంత్రి నారా లోకేష్ పూర్తి బాధ్యుడని, మాజీ మంత్రి జోగి రమేష్ వ్యాఖ్యానించారు. తన ఇంటిపై ఆదివారం జరిగిన దాడి కూడా లోకేష్ ఆదేశాలతోనే ఎంపీ కేశినేని చిన్ని నేతృత్వంలోనే జరిగిందని మాజీ మంత్రి స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం లోని తన నివాసంలో పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసుల అండతో వారి సమక్షంలోనే టీడీపీ గూండాలు పెట్రోల్ బాంబులతో దాడి చేసి తనని, తన కుటుంబాన్ని భౌతికంగా లేకుండా చేయాలన్న కుట్ర చేశారని జోగి రమేష్ వెల్లడించారు. తన దైవం తిరుమలేశుడు అని, తన నాయకుడు వైయస్ జగన్ అని చెప్పారు. మరి ఆ జగన్‌గారిపై నిందలేస్తే ఎలా ఊర్కుంటామని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులు నొక్కాలని చూస్తున్నారని, తమను ఎలా, ఎంత వేధించినా ఎక్కడా వెనక్కు తగ్గబోమని జోగి రమేష్ తేల్చి చెప్పారు.

### దాడులతో వైయస్సార్సీపీని భయపెట్టలేరు

"వరుస దాడులతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను భయపెట్టాలని చూస్తున్నారు. కొన్ని వందల మంది తెలుగుదేశం పార్టీ గూండాలను నా ఇంటి మీదకు పంపించి దాడి చేశారు. పోలీసుల సమక్షంలోనే జరిగిన ఈ దాడిని ప్రజాస్వామ్యంపై, వెనుకబడిన వర్గాల మీద జరిగిన దాడిగానే చూడాలి. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే ఈ ప్రభుత్వం ఓర్వలేక పోతుంది. ప్రజలకు వాస్తవాలు తెలుస్తున్నాయని వణికిపోతున్నారు. జోగి రమేష్ లాంటి వెనుకబడిన తరగతులకు చెందిన నాయకులను కేసులతో బెదిరించి, దాడులతో భయపెట్టి, జైళ్లకు పంపి మానసికంగా వేధిస్తే వైయస్సార్సీపీ తరఫున గొంతు వినిపించేందుకు ముందుకురారు అనేది వారి ఆలోచన. అందుకే ఇలాంటి భయోత్పాతం సృష్టించారు. బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌ని రంగంలోకి దించి నా ఇంటిపై పెట్రోల్ బాంబులతో దాడి చేసి నిప్పంటించారు. నన్ను, నా కుటుంబ సభ్యులను బతికుండగానే సజీవ దహనం చేసే కుట్రకు ఈ ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడలేదు. జగన్ ప్రోత్సాహంతో వైయస్సార్సీపీలో బీసీలు ఎదుగుతుంటే చంద్రబాబు చూసి ఓర్వలేకపోతున్నాడు. తాను తప్పు చేసినట్టు ఎలాంటి ఆధారాలు లేని అక్రమ కేసులో మూడు నెలలు జైలుకు పంపినా వారి కక్ష తీరలేదు. నెల్లూరు, విజయవాడ, మదనపల్లె జైళ్లలో అక్రమంగా నిర్బంధించి చంద్రబాబు, లోకేష్ రాక్షసానందం పొందారు. నేను ఏ తప్పూ చేయలేదని దుర్గమ్మ ఆలయంలో ప్రమాణానికి సిద్ధమని చెప్పాను. నార్కో అనాలిసిస్ టెస్టుకు సిద్ధమని సవాల్ చేశా. సీబీఐ ఎంక్వయిరీ అడిగాను. అవన్నీ చేయకుండా చేతిలో అధికారం ఉంది కదా అని అక్రమంగా నన్ను, నా కుమారుడిని, తమ్ముడిని జైలుకు పంపి ఇబ్బంది పెట్టారు. జైలు నుంచి వచ్చాక వైయస్సార్సీపీ తరఫున గళం వినిపిస్తుంటే చంద్రబాబుకి నచ్చడం లేదు. చివరకు నేను ఆరాధించే తిరుమల వెంకటేశుడి లడ్డూ ప్రసాదంపై తప్పుడు ప్రచారం చేస్తుంటే తట్టుకోలేకపోయాను. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని టీడీపీ ఫ్లెక్సీలు వేసి శ్రీవారి ప్రతిష్టను దిగజార్చుతుంటే మనసు కన్నీరు పెట్టింది. రాజకీయ లబ్ధి కోసం వైయస్ జగన్ గారి వ్యక్తిత్వాన్ని హననం చేసే కుట్రలపై తిరగబడ్డాను. కానీ తిరుమల లడ్డూ ప్రసాదంపై కూటమి నాయకుల తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ వారిని విమర్శిస్తే దాడులు చేస్తారా? లోకేష్‌కి చిప్ దొబ్బింది అని ప్రశ్నించడం తప్పా? ఇదెక్కడి ప్రజాస్వామ్యం?. పక్కా ప్రణాళికతోనే ఇనుప రాడ్లు, కర్రలు, పెట్రోల్ బాంబులతో దాడులు చేశారు. డిసిపి ఉన్నం రామకృష్ణ, సిఐ, ఇతర పోలీస్ సిబ్బంది సమక్షంలో వారి అండతోనే తెలుగుదేశం గూండాలు మా ఇంటిపై ఈ దాడులకు తెగబడ్డారు. మాకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు దాడులు చేసే వారికి ఎస్కార్టుగా నిలబడ్డారు" అని జోగి రమేష్ ఆరోపణలు గుప్పించారు. మీడియా సమావేశంలో పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎంపీలు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి ౖ, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## 10 తర్వాత పూర్తి స్థాయిలో ఇండిగో విమానాల కార్యాచరణ

- రూ.50 కోట్ల గ్యారెంటీకి డిజిసిఎ ఆదేశం
- ఎంపి రఘునాథరెడ్డి ప్రశ్నకు పౌర విమానయాన శాఖ స్పష్టం



రాజంపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ఈనెల 10 తర్వాత మినహాయింపులు లేకుండా కార్యాచరణ అవసరాలను తీర్చ డానికి తగినంత పైలట్లు, సిబ్బంది ఉంటారని ఇండిగో అధికారికంగా డైరెక్టరేట్ జనరల్ అఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ)కి హామీ ఇచ్చింది. తాత్కాలిక సడలింపులు ముగిసిన తర్వాత కార్యాచరణ స్థిరత్వాన్ని కొనసాగించాలని ఆదేశించినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి మొహుల్ మురళీధర్ పేర్కొన్నారు. పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సందర్భంగా రాజ్యసభ సభ్యులు ఎంపీ మేడా రఘునాథరెడ్డి ఇండిగో సంస్థ ఎదుర్కొంటున్న విమాన అంతరాయాలపై డైరెక్టరేట్ జనరల్ అఫ్ సివిల్ ఏవియేషన్ తన విచారణను పూర్తి చేసిందా అని ప్రశ్నించారు. అంతేకాకుండా ఏ మేరకు చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. అందుకు మంత్రి లిఖిత పూర్వక సమాధానంలో గత ఏడాది డిసెంబర్ 3, 5 మధ్య ఇండిగో చేసిన పెద్ద ఎత్తున జాప్యాలు, సర్వీసుల రద్దుల కారణంగా, 1937 ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్‌లోని 133తి నిబంధన కింద ఆదేశాలను పాటించనందుకు 22.20 కోట్ల ఒకేసారి ఆర్థిక జరిమానా విధించినట్లు తెలిపారు. దీర్ఘకాలిక దిద్దుబాటు చర్యలను నిర్ధారించడానికి డీజీసీఏ రూ.50 కోట్ల బ్యాంక్ గ్యారెంటీని అందించాలని ఇండిగోను ఆదేశించామన్నారు. పరిహారం చెల్లింపు ప్రక్రియ కూడా జరిగినట్టు తెలిపారు. బాధిత ప్రయాణీకులకు వాపసు, పరిహార మొత్తాలను సకాలంలో చెల్లించడానికి వీలుగా ఆన్లైన్ ట్రావెల్ ఏజెంట్లు పనిచేస్తాయన్నారు. విమాన రాకపోకలు, ప్రయాణీకుల డిమాండ్ పెరుగుదల నుండి ఉత్పన్నమయ్యే అవసరాలను తీర్చడానికి, గరిష్ట సమయాల్లో విమాన రాకపోకలను బలోపేతం చేయడానికి, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఇప్పటికే ఉన్న విమానాశ్రయ మౌలిక సదుపాయాల విస్తరణ, మార్పు, అప్‌గ్రేడ్‌లు ఎప్పటికప్పుడు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో కొత్త టెర్మినళ్ల నిర్మాణం, ఉన్న టెర్మినళ్ల విస్తరణ, ఆధునీకరణ, రన్‌వేలు, అప్రాన్‌లను బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. భూమి లభ్యత, సాంకేతికఆర్థిక సాధ్యాసాధ్యాలు, ఆర్థిక వనరుల లభ్యత, సమర్థ నియంత్రణ అధికారుల నుండి అవసరమైన అనుమతులు వంటి అంశాలకు లోబడి, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో సహా సంబంధిత విమానాశ్రయ నిర్వాహకులు, డెవలపర్లు అభివృద్ధి పనులను చేపడతారు మంత్రి సమాధానమిచ్చారు.



## సహజంగా మెరవండి!

పండుగల వేళ, పెళ్లి సమయాల్లో అమ్మాయిలకు మోము కాంతులీనాలంటే.. ముఖానికి మేకప్ తప్పనిసరి. అలాగని అందరికీ ఒకే తరహా నప్పదు. ముఖ్యంగా కొట్టొచ్చినట్లు కనబడే రంగులు, జిగేల్మనిపించేలా ఐడ్స్, బోల్డ్‌గా తీర్చిదిద్దిన పెదాలను కొందరు మెచ్చుకున్నారు. ఇలాంటివారికి కనీస మేకప్ చక్కని ఎంపిక. అందంగా మందంగా ఉండే ఫౌండేషన్‌కి బదులు టింటెడ్ మాయిశ్చరైజర్ని ఎంచుకోవాలి. ముఖ్యంగా ముక్కు, చెంపలు, నుదురు వంటి చోట్ల తక్కువగా రాసి... తడి స్పాంజ్‌తో బ్లెండ్ చేయాలి. తర్వాత కళ్లకింద కన్సీలర్ కొద్దిగా రాసి అంతటా పరవాలి. ఆపై కళ్లకు సన్నగా ఐలైనర్ గీయండి. ఐషాడోగా న్యూడ్, లైట్ బ్రౌన్షేడ్లను వేస్తే కళ్లెంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. చివరిగా బుగ్గలపై పీచ్ బ్లష్, పెదాలకు న్యూడ్, పింక్, కోరల్ లిప్స్టిక్ లు వేస్తే చాలు. సింపుల్గా, సహజంగా మెరిసిపోతారు.

## జుట్టు పెరిగేందుకూ మసాజ్ !

గోరు వెచ్చని నూనెతో మాడుకు నెమ్మదిగా మర్దన చేసుకుంటుంటే ఎంత హాయిగా ఉంటుందో కదా! ఈ విధంగా మర్దన చేసుకోవడం వల్ల కేవలం మాడుకు రక్తప్రసరణ సక్రమంగా జరగడమే కాకుండా జుట్టు ఎదుగుదల కూడా బాగుంటుంది. ఈ క్రమంలో మర్దన చేసుకోవడం వల్ల కలిగే ఇతర లాభాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గుర్తించి తెలుసుకుందాం.



**కుదుళ్లకు పోషణ అందిస్తూ....** మాడుకు మర్దన చేసేటప్పుడు ఉపయోగించే నూనె జుట్టుకు పోషణనందించే జొజోబా లేదా బాదం వంటిదైతే మంచిది. దీనివల్ల కుదుళ్లకు రక్తప్రసరణ సాఫీగా జరగడమే కాకుండా కురులకు పోషణ కూడా లభిస్తుంది. ఇలా తరచూ మర్దన చేయడం వల్ల జుట్టు ఎదుగుదల బాగుంటుంది.

**కురులు మెరిసేలా...** నూనెతో తరచూ మర్దన చేసుకోవడం వల్ల కురులు మిలమిలా మెరుస్తాయి. అలాగే ఒత్తుగా కూడా కనిపిస్తాయి. చివర్లు చిట్లడం వంటి సమస్యలను దూరంగా ఉంచడం లోనూ మసాజ్ ఉపయోగ పడుతుంది.



**చుండ్రు రానీయ కుండా..** తరచూ మర్దన చేసుకోవడం ద్వారా తలలో చుండ్రు చేరకుండా జాగ్రత్త పడచ్చు. శిరోజాలు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ప్రకాశవంతంగా మెరుస్తుంటాయి.

**ముఖం ప్రకాశవంతంగా....** తలకు మర్దన చేస్తే ముఖం ఎందుకు ప్రకాశవంతంగా కనిస్తుందాని ఆశ్చర్యపోతున్నారా? మాడుకు మృదువుగా మర్దన చేయడం వల్ల ఒత్తిడి తగ్గి రక్తప్రసరణ సక్రమంగా ఉంటుందని చెప్పుకున్నాం కదా! అలాగే తలకు మర్దన చేయడం వల్ల ముఖానికి కూడా రక్తప్రసరణ సవ్యంగా జరిగి మోము కాంతివంతంగా మారుతుంది.

**ఈ జాగ్రత్తలు...** మర్దన చేసే క్రమంలో ఎక్కువ మొత్తంలో నూనె ఉపయోగించి, ఆ తర్వాత సరిగా శుభ్రం చేసుకోకపోతే తల జిడ్డుగా మారడమే కాదు.. కేశ సంబంధిత సమస్యలను కూడా కొనతెచ్చు కున్నట్లు అవుతుంది. మర్దన చేసే క్రమంలో స్ట్రోక్స్ సరిగా ఇవ్వకపోతే తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. 3. చేతివేళ్లతో మర్దన చేసుకుంటాం కాబట్టి వాటికి గోళ్లు లేకుండా జాగ్రత్త పడాలి. లేదంటే అవి మాడుకు గీసుకుపోయే అవకాశం ఉంటుంది. తలకు మర్దన చేసుకున్న తర్వాత ముఖానికి కూడా కాస్త మృదువుగా మసాజ్ చేసుకుంటే మరిన్ని సత్ఫలితాలు పొందవచ్చు.



## ప్రకృతి సేద్యంలో శిక్షణ ఇస్తూ..

ప్రమాదం తర్వాత ఎదురైన మానసిక వేదన నుంచి బయటపడేందుకు ఆమె ఎంపిక మార్గం మొక్కల్ని పెంచడం. అదే అనుభవం ఆమెను సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేసేలా చేసింది. పాతికేళ్ల నుంచి ప్రకృతి సేద్యం చేస్తూనే ఆసక్తి ఉన్న వారికి శిక్షణ కూడా ఇస్తున్నారు కె.ఎస్. శ్రీజ. కొన్ని గాయాలు పైకి కనిపించకపోయినా మనిషిని మానసికంగా కుంగదీస్తుంటాయి. అలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు. కేరళకి చెందిన 53 ఏళ్ల శీజ. 2014లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నబిడ్డ కాలుని కోల్పోయాడు. చికిత్స కోసం తరబడి తమిళనాడు లో ఉండాల్సి వచ్చింది. అప్పుడే ఆమెకు సేంద్రియ వ్యవసాయ నిపుణురాలు పాటియమ్మతో పరిచయం ఏర్పడింది. ఆమె దగ్గర వ్యవసాయంలో మెలకువలు నేర్చుకున్నారు శ్రీజ కేరళ తిరిగొచ్చిన తర్వాత మొక్కలను పెంచడం హాబీగా మార్చుకున్నారామె. ప్రస్తుతం ఇంటి తోట, టెర్రస్‌తోపాటు మరో ఎకరం భూమిలో సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్నారు. ఇందుకోసం అనేక వర్క్‌షాపులూ, కోర్సులూ పూర్తిచేశారు. బెండ, వంగ, దోస, గుమ్మడి, బీట్రూట్‌తోపాటు, మిరియాలను పండిస్తున్నారు. వీటితోపాటు అరటి, పనస, జామ, యాపిల్, మల్బరీ, డ్రాగన్ ఫ్రూట్, ఆపిల్ పండ్ల మొక్కల్ని కూడా పెంచుతున్నారు. సాధారణంగా సేంద్రియ వ్యవసాయంలో పశువుల ఎరువులు వాడుతుంటారు. కానీ, శీజ మాత్రం పెడకు బదులుగా కోడి పెంటను వినియోగిస్తున్నారు. వీటిలో ఉండే నత్రజని మొక్కలకి పోషణని అందించడంతోపాటు దిగుబడిని పెంచుతాయంటారీమె. డ్రిప్ ఇరిగేషన్, ప్రిసిషన్ ఫార్మింగ్ పద్ధతిలో భూమిని సాగుచేసేదాన్ని, కానీ, అడవి జంతువుల దాడులు, వాతావరణ మార్పులు పంటలకు ఎన్నో సవాళ్లను తెచ్చేవి. అయినా నేను వెనక్కి తగ్గలేదు. తెలివిగా సమస్యలను పరిష్కరించా. ఒక మహిళ ఒంటరిగా ఏం చేయగలదు అనే ప్రశ్నలకు పచ్చని ప్రకృతితో సమాదానం చెప్పా నంటారీమె. అంతటితో ఆగిపోలేదు శీజ. ఆసక్తి ఉన్న విద్యార్థులకు, గ్రామస్థులకు సాగుపాఠాలు చెబుతున్నారు. షీ గార్డెన్ పేరుతో యూట్యూబ్లో ఎంతోమంది మహిళలను వ్యవసాయం దిశగా అడుగులు వేస్తున్నారు. మన ఆరోగ్యం మన ఆహారంతో ముడిపడి ఉందని నమ్మే శీజ భవిష్యత్తులో తన సాగును మరింత విస్తరింపజేయాలని కోరుకుంటున్నాను అని చెప్పారు.

## ఆదర్శ మార్గాలు

ఆదర్శ మార్గాలు కాలాన్ని దైవంగా భావిస్తూ సాగడానికి, కుటుంబ వ్యవస్థ సవ్యంగా నడపటానికి రామాయణ, భారత, భాగవతాది ఇతిహాస పురాణాల్లో ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. రాముడు సోదరులతో సఖ్యంగా ఉన్న తీరు, తమ్ముళ్లు అన్నను గౌరవించిన తీరు. ఇవన్నీ ప్రతి తరంలోనూ పెద్దలు ముందు తాము తెలుసుకుని, అనుసరించి చిన్నలకు చెబుతుండాలి. యాగరక్షణకు శ్రీరాముణ్ణి మాత్రమే పంపమని విశ్వామిత్రుడు దశరథుణ్ణి కోరితే.. లక్ష్మణుడు స్వచ్ఛం దంగా అన్న సేవకోసం అడవులకు బయల్దేరాడు. కైకేయి ఆదేశం మేరకు శ్రీరాముడు అరణ్యా లకు వెళ్తుంటే.. సొంత సుఖాలను వదులుకొని లక్ష్మణుడు పద్నాలుగేళ్లు అన్నను వెన్నంటే ఉన్నాడు. మహా భారతంలో యక్ష ప్రశ్నల సందర్భం కూడా సోదర బంధాన్ని ప్రతిబింబిస్తుంది. యక్షమాయ వల్ల భీమార్జున నకుల సహదేవులు మరణించినప్పుడు ధర్మరాజు యక్షప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాడు. దానికి మెచ్చిన యక్షుడు మరణించిన వారిలో ఒక్కరిని మాత్రమే బతికిస్తానన్నాడు. ధర్మరాజు నకులుణ్ణి కోరుకున్నాడు. అంతులేని బలపరానరకమవంతులైన భీమార్జునులను కాదని,నకులుణ్ణే ఎందుకు కోరావని-యక్షుడు అడిగాడు. కుంతికి జన్మించిన వారిలో తాను బతికే ఉన్నానని, సవతి తల్లి మాద్రి కొడుకుని కూడా బతికించడం తన బాధ్యత కనుక అలా కోరానన్నాడు ధర్మరాజు. ఆయన మాటల్లో ధర్మం కుటుంబానికి ఇచ్చిన ప్రాధాన్యత, సోదరబంధ సౌందర్యం కనిపించడంతో.. యక్షుడు సంతోషించాడు, అందరినీ బతికించాడు. ఇవి కొన్ని ఉదాహరణలే ఇలా కుటుంబ సభ్యులందరూ ఒకరి కష్టంలో ఒకరు పాలు పంచుకోవటం, సుఖసంతోషాల్లో కలిసి ఆనందించటం అనే తత్త్వం ప్రపంచ వ్యాప్తంగా పెరగాలి. కాలం విలువను తెలుసుకుని జీవితాన్ని సార్థకం చేసుకోవాలననదే ఆధ్యాత్మిక వేత్తల లక్ష్యం. ఈ లక్ష్య సాధనలోనే అనంతమైన ఆనందం,విశ్వశాంతి ఇమిడి ఉన్నాయి.

## అటుకుల బూరెలు



బియ్యప్పిండితో చేసే బూరెలు అందరికీ తెలుసు కానీ.. అటుకులతో చేసినవి ఎప్పుడూ తిని ఉండరు కదూ! మరి అటుకుల బూరెలు రుచి చేసి చూదాం. ఎంతో సులువుగా చేసే ఈ బూరెలు మహా రుచిగా ఉంటాయి. కప్పు అటుకులకు అర కప్పు బెల్లం, చారెడు గోధుమ పిండి, పావు చెంచా యాలకుల పొడి, రెండు స్పూన్ల నెయ్యి, వేయించేందుకు నూనె అవసరమౌతాయి. ఎలా చేయాలంటే అటుకులను కచ్చాపచ్చా దంచాలి. బెల్లం కరిగించి.. అందులో అటుకులు, గోధుమ పిండి, యాలకుల పొడి, నెయ్యి వేయాలి. సన్న సెగ మీద ఉండలు కట్టకుండా కలియ తిప్పుతూ రెండు నిమిషాలయ్యాక దించేయాలి. ఈ మిశ్రమాన్ని చల్లారనిచ్చి.. చిన్న ఉండలుగా చేసి బూరెలుగా ఒత్తుకునికాగిన నూనెలో బంగారు రంగు వచ్చేదాకా వేయించి తీయాలి. అంతే అటుకుల చిట్టి బూరెలు తయారైపోతాయి. మీరూ చేసి చూడండి.తప్పకుండా నచ్చుతాయి.

## ప్రసవం తర్వాత ఆఫీసుకు !



ఆఫీసులో తీసుకున్న ప్రతి సెలవులు మహిళకు పూర్తయ్యాయి. విధుల్లో చేరాల్సిన సమయం దగ్గరపడటంతో ఆమెకు ఒత్తిడి మొదలైంది. ఇలా ఆఫీసు పని పునః ప్రారంభించాల్సినప్పుడు ఆందోళన పడకుండా ప్రణాళికతో అడుగు ముందుకెలా వేయాలో నిపుణులు చెబుతు న్నారు. తల్లిగా కొత్త బాధ్యత లు, వాటితోపాటు తిరిగి ఆఫీసు పని... ఈ రెండిం టినీ సమన్వయం చేయడం ఒత్తిడితో కూడుకున్నది. దీనికితోడు భావోద్వేగాలనూ బ్యాలెన్స్ చేయాలి. వీటన్నింటినీ ప్రణాళికగా దాటాలి. ముందు ఆఫీసులో విధులు సాఫీగా సాగేలా అక్కడి వాతావరణం ఉందో లేదో తెలుసుకోవాలి. జాయిన్ అవ్వాల్సిన తేదీని కన్ఫమ్ చేసుకోవడం, అలాగే ప్రసూతి సెలవు మరి కొన్నాళ్ల పాటు కొనసాగించడానికి లేదా ఇంటి నుంచే కొద్ది రోజులు విధులు నిర్వహించే అవకాశం వంటివి ఉన్నాయేమో ప్రయత్నించాలి. అలా ఇంటి నుంచి చేయడానికి ఛాయిస్ ఉంటే గడువులోపల ఓ కార్యాచరణ ప్రణాళిక వేసుకోవాలి. రోజూవారీ చేసే పనుల సమయాలను మార్చడం, ఆఫీసు విధుల కంటూ సమయాన్ని కేటాయించి చూడాలి. పాపాయి నిద్ర సమయాన్ని మార్చి చెక్ చేయాలి. తనకు ఆహారం అందించడంలో ఇతరుల సాయం తీసుకోవ డం వంటి ఏర్పాట్లు చేసుకోవాలి. **ఆఫీసుకు వెళ్లాలంటే...** ఇంట్లో పెద్దవాళ్లుంటే పాపాయి అవసరాలు, సమయానికి అలవాటు చేయాలి. అలాకాకుండా డేకేర్ తప్పనిసరి అంటే వాటి వివరాలు సేకరించాలి. అక్కడి పరిస్థితిని నేరుగా వెళ్లి చూడాలి. విధులకు వెళ్లేలోపే రెండుమూడు రోజులు ముందుగా పాపాయిని డేకేర్‌లో ఉంచి చూడాలి. అక్కడి వాతావరణం పాపాయి కి సౌకర్యంగా ఉందోలేదో తెలుస్తుంది. బాగుం దంటే కొనసాగిం చొచ్చు. అయితే కేర్ సెంటర్లో దింపిన తర్వాత వేరొకరి సంరక్షణలో పాపాయిని వదిలినట్లుగా మనసుకు అనిపిస్తుంది.

# తెర

## ప్రేక్షకులకు కృతజ్ఞతలు : నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి



పుష్యమి ఫిలిం మేకర్స్ బ్యానర్ పై బెల్లం సుధారెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి రచనా దర్శకత్వంలో స్వీయ నిర్మాతగా రూపొందిన చిత్రం "దేవగుడి". ఈ సినిమాలో ఈ అభినవ శౌర్య, నరసింహా, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రల్లో నటించారు. "దేవగుడి" సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సాధించింది. అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో ఈ సినిమా సక్సెస్ ఫుల్‌గా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మా "దేవగుడి" సినిమాకు సపోర్ట్ చేసిన మీడియా మిత్రులకు, మూవీకి ఘన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెబుతున్నాం. అన్నారు.హీరో అభినవ్ శౌర్య మాట్లాడుతూ, కొన్నేళ్లుగా హీరో కావాలని నేను కన్న కలను, పడిన శ్రమను "దేవగుడి" సినిమాకు వస్తున్న స్పందనతో మర్చిపోయాను. నరసింహా తోషి మాట్లాడుతూ "దేవగుడి" సినిమాకు విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్.హీరోయిన్ అనుశ్రీ మాట్లాడుతూ , ఒక తెలుగు అమ్మాయిగా "దేవగుడి" చిత్రంతో హీరోయిన్‌గా మీ ముందుకు వచ్చాను. తిరుపతిలో మా సినిమా చూసి బయటకు వస్తుంటే శ్వేతా రెడ్డి అని ఆడియెన్స్ పిలుస్తున్నారు.నటుడు రఘుకుంచె మాట్లాడుతూ, మంచి కంటెంట్ ఉంటే తప్పకుండా చిన్న సినిమాను కూడా ఆదరిస్తామని తెలుగు ఆడియెన్స్ "దేవగుడి" విజయంతో మరోసారి ప్రూవ్ చేశారు.

## 'హనీ' ఈవెంట్‌లో హీరో నవీన్ చంద్ర



నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది.సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలవెన్స్, హారర్ అంశాలతో రూపొందిన హనీ ఫిబ్రవరి 6న థియేటర్ లో రిలీజ్ అవుతుంది.హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ట్రైలర్ కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా ఫిలిం మేకింగ్ ప్రాసెస్ నేను చాలా ఎంజాయ్ చేశాను. ఇది మోత్ టాక్ తో నిలబడే సినిమా. డైరెక్టర్ కరుణ కుమార్ మాట్లాడుతూ,అందరికి నమస్కారం. నా ప్రతి ప్రయత్నాన్ని ఆదరిస్తున్న మీడియా మిత్రులకు ధన్యవాదాలు. ఈసారి కొత్త ప్రయత్నం చేశాను. సాహిత్యం కోసం చీకటి అనే కథ రాశాను. దాన్ని సినిమా తీద్దామని మా నిర్మాతలు వచ్చారు. రాజా రవీంద్ర మాట్లాడుతూ, డైరెక్టర్ కథ చెప్పినప్పుడు నచ్చింది కానీ ఎలా తీస్తారో అని అనిపించింది చెప్పిందానికంటే చాలా అద్భుతంగా తీశారు. హీరోయిన్ దివి మాట్లాడుతూ, కరుణ కుమార్‌తో పని చేయాలని నాకు ఎప్పటినుంచో ఉండేది. పలాస సినిమా సమయంలో కలిశాను. కానీ కుదరలేదు. ఆయన నుంచి కాల్ వచ్చిన వెంటనే వెళ్లాను. హీరోయిన్ దివ్యపిళ్లై మాట్లాడుతూ, డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు భయపడ్డాను. చాలా కొత్త కథ ఇది. నాకు ఈ అవకాశం ఇచ్చిన కరుణ కుమార్‌కి రవికి థాంక్యూ అని అన్నారు.

## 'వన్ బై ఫోర్' సక్సెస్ మీట్ లో మూవీ టీమ్

తేజస్ గుంజల్ ఫిలిమ్స్, రోహిత్ గుంజల్ ఫిలిమ్స్ బ్యానర్లపై వెంకటేష్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్, హీనా సోని హీరో, హీరోయిన్స్‌గా నటించిన యాక్షన్ క్రైమ్ డ్రామా చిత్రం "వన్ బై ఫోర్" (వన్/4). బ్లాక్ బస్టర్ బాహుబలి చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన బాహుబలి పళని కె ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. రంజన రాజేష్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా ఈ మూవీ ని నిర్మించారు. డైరెక్టర్ బాహుబలి పళని మాట్లాడుతూ మా "వన్ బై ఫోర్" (వన్/4) సినిమాను ప్రేక్షకులు బ్లాక్ బస్టర్ చేశారు. ప్రతి థియేటర్ లో కలెక్షన్స్ బాగున్నాయి. కంటెంట్ బాగుంటే చిన్న చిత్రానికి కూడా మంచి విజయం అందిస్తామని ప్రేక్షకులు మరోసారి ప్రూవ్ చేశారని అన్నారు



ప్రొడ్యూసర్ రంజన రాజేష్ గుంజల్ మాట్లాడుతూ ఎంటర్ టైన్ మెంట్ తో పాటు మంచి మెసేజ్ ఉన్న మా"వన్ బై ఫోర్" (వన్/4) సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. స్ట్రాంగ్ కంటెంట్ ఉండటం వల్లే ఈ విజయం దక్కింది. ప్రొడ్యూసర్ రోహిత్ రాందాస్ గుంజల్ మాట్లాడుతూ తెలుగు సినిమాలపై అభిమానంతో మేము ముంబై నుంచి టాలీవుడ్ కు వచ్చాం. మా తొలి ప్రయత్నంలోనే మంచి విజయం దక్కింది. మేము ఈ చిత్రం ద్వారా ఇవ్వాలనుకున్న సందేశం ప్రేక్షకులకు రీచ్ అయ్యింది. కలెక్షన్స్ బాగున్నాయి. హీరో వెంకటేష్ పెద్దపాలెం మాట్లాడుతూ "వన్ బై ఫోర్" (వన్ /4) సినిమా కోసం మేమంతా ఎంతో కష్టపడ్డాం. బయట ఇండస్ట్రీలోని ఇతర పెద్ద సినిమాల వల్ల రిలీజ్ విషయంలోనూ ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కానీ మా ప్రొడ్యూసర్స్ పట్టుదలగా ఈ అడ్డంకులన్నీ దాటుకుని సినిమాను విడుదల చేశారు.

## 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' షూటింగ్ స్టార్ట్



ఫహాద్ ఫాజిల్ తన మొదటి స్ట్రెయిట్ తెలుగు సినిమా చిత్రీకరణను ప్రారంభించారు. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' షూటింగ్‌ను ఆదివారం (ఫిబ్రవరి1)న గ్రాండ్‌గా ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో హైదరాబాద్‌లో వేసిన సెట్‌కి ఆయన అభిమానులు భారీగా వచ్చారు. వెర్సటైల్ యాక్టర్ ఫహాద్ ఫాజిల్ తన మీద అభిమానంతో వచ్చిన ఫ్యాన్స్‌ను చూసి హ్యాపీగా ఫీలయ్యారు. అభిమానుల సందోహం మధ్యే ఆయన తన షూటింగ్‌ను ప్రారంభించారు.అలాగే షూటింగ్ నుంచి కాసేపు విరామం తీసుకుని ఫహాద్ ఫాజిల్ తన అభిమానుల్ని పలకరించారు. అభిమానుల ప్రేమ, ఉత్సాహాన్ని గుర్తించి అక్కడకు వచ్చిన వారిని హృదయపూర్వకంగా పలకరించాడు. 'ప్రేమలు' సినిమాతో పంపిణీదారుగా ఎస్ ఎస్ కార్తికేయ భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇక షోయింగ్ బిజినెస్ బ్యానర్ ద్వారా నిర్మాతగా మారారు. అర్కా మీడియావర్క్స్, షోయింగ్ బిజినెస్ సంయుక్తంగా నిర్మిస్తోన డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'చిత్రంతో నిర్మాతగా ఎస్ఎస్ కార్తికేయ ఎంట్రీ ఇవ్వబోతోన్నారు. డైరెక్టర్ శశాంక్ యేలేటి ఈ మూవీని బలమైన భావోద్వేగ అంశాలు, కంటెంట్ బేస్డ్‌గా, ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించనున్నారు. ఫహాద్ ఫాజిల్ ఈ ప్రాజెక్టుకు ప్రధాన ఆకర్షణ కానున్నారు. రిఫ్రెషింగ్, ఓ ప్రత్యేకమైన సినిమాటిక్ అనుభవాన్ని అందించేలా సినిమాని రూపొందిస్తున్నారు.

## 'దక్షిణ కాళీ' చిత్రంలో అమ్మవారిగా అర్చన

సుబ్బు, ప్రియాంక హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'దక్షిణ కాళీ. ఈ చిత్రానికి కథను అందించి శ్రీనిధి క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు సత్యవాణి మీసాల. డివోషనల్ కథతో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు తోట కృష్ణ. ఈ సినిమా ఈ నెల 6న తెలుగు, తమిళ,కన్నడలో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర సాంగ్స్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ దర్శకుడు వి సముద్ర, నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. పాటల విడుదల అనంతరం దర్శకుడు వి సముద్ర మాట్లాడుతూ 'దక్షిణ కాళీ' సినిమా పాటలు, ట్రైలర్ చాలా బాగున్నాయని అన్నారు అన్నారు. నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ, కొత్త సినిమాలు ఇండస్ట్రీకి రావాల్సిన అవసరం ఉందన్నారు. 'దక్షిణ కాళీ' సినిమా కంటెంట్ చూస్తుంటే తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్మకం కలుగుతోంది అన్నారు. దర్శకుడు తోట కృష్ణ మాట్లాడుతూ, అమ్మవారి మహిమలు తెలిపేలా దక్షిణ కాళీ చిత్రాన్ని రూపొందించామని అన్నారు. ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు ఓ కీలక పాత్రలో నటించానని తెలిపారు. ప్రేక్షకుల్ని నిరాశపరచకుండా, వాళ్లు కోరుకునే అన్ని అంశాలతో సినిమా ఆకట్టుకుంటుందని ఆయన అన్నారు.



## 'లగ్గం టైం'ని చూసి మనస్ఫూర్తిగా నవ్వుతూ వెళ్తారు

**నిర్మాత కె. హిమబిందు**

రాజేష్ మేరు, నవ్య చిట్యాల జంటగా కె. యశ్వంత్ కుమార్ సమర్పణలో 20 సెంచ్యూరీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద కె. హిమ బిందు నిర్మించిన చిత్రం'లగ్గం టైం'. ఈ మూవీకి ప్రజోత్ కె వెన్నం దర్శకత్వం వహించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 6న రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈ కార్యక్రమంలో హీరో రాజేష్ మేరు మాట్లాడుతూ,'లగ్గం టైం' కథ కంటే ముందు నేను విన్న కథలన్నీ కూడా రక్తపాతంతో కూడుకున్నవే. కానీ ఈ కథ విన్న వెంటనే సినిమాని చేయాలని అనిపించింది. ఎంతో కష్టపడి ఈ మూవీని తీశాం. అని అన్నారు. నిర్మాత కె. హిమబిందు మాట్లాడుతూ, ఎన్నో కష్టాలు, ఎంతో ఖర్చు పెట్టి ని 'లగ్గం టైం' నిర్మించాం. మా సినిమాని ఫిబ్రవరి 6న రిలీజ్ చేయబోతోన్నాం అని అన్నారు.దర్శకుడు ప్రజోత్ కె వెన్నం మాట్లాడుతూ, 'లగ్గం టైం' మూవీని టీం అంతా కలిసి చాలా బాగా తీశాం. మేమంతా కొత్త వాళ్లం. అలా అందరం కొత్త వాళ్లమే సినిమాని తీసినప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాం. అని అన్నారు. ఎడిటర్ విశ్వనాథ్ కూచనపల్లి మాట్లాడుతూ,నాకు ఎక్కువ గా ప్రేమ కథా చిత్రాలంటే ఇష్టం. కానీ ఇంతవరకు హారర్, థ్రిల్లర్ సినిమాలు చేశాను.'లగ్గం టైం'కి పని చేయడం ఆనందంగా ఉంది. సంగీత దర్శకుడు పవన్ మాట్లాడుతూ,'లగ్గం టైం'లో మంచి పాటలుంటాయి. ఇందులోని మెలోడీస్ అందరినీ ఆకట్టుకుంటాయిని అన్నారు.






# విజేతగా హార్యానా థండర్స్

## ఢిల్లీ వారియర్స్‌పై 5-4 తేడాతో విక్టరీ

**న్యూఢిల్లీ:** ఢిల్లీ దంగల్ వారియర్స్‌తో హోరాహోరీగా జరిగిన చివరి పోరులో హర్యానా థండర్స్ ప్రో రెజ్లింగ్ లీగ్ 2026 టైటిల్‌ను కైవసం చేసుకుని విజేతగా నిలిచింది. ఎనిమిది బౌట్‌ల తర్వాత స్కోరు 4-4తో సమంగా ఉండటంతో, చివరి మహిళల 62 కిలోల పోటీ కీలకమైంది. పారిస్ ఒలింపిక్ రజత పతక విజేత ఇరినా కొలియాడెంకో ఒత్తిడిలో మాస్టర్‌క్లాస్‌ను అందించడంతో నాటకీయంగా 5-4 విజయంతో హర్యానా థండర్స్ విజే టైటిల్‌ను సాధించింది. ఈ పోటీల్లో 74 కిలోల పురుషుల బౌట్‌లో అపజయం లేని తురాన్ బేరామోవ్ ద్వారా ఢిల్లీ ప్రారంభంలోనే 8-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మహిళల విభాగంలో (76 కిలోల) హర్యానా స్పందించి అండర్20 వరల్డ్ ఛాంపియన్ కాజల్ ధోచాక్ యూరోపియన్ ఛాంపియన్ అనస్తాసియా అల్బీవాను 3-1తో ఓడించి టైను సమం చేసింది. పురుషుల బౌట్‌లో (65) ఢిల్లీ కెప్టెన్ సుజీత్ కల్కల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ రజత పతక విజేత తుమూర్ ఓచిర్ తుల్గాను 8-6 తేడాతో ఓడించడంతో జోరు మళ్లీ మారింది. హర్యానా ప్రపంచ ఛాంపియన్ అయిన యుయి సుసాకి ద్వారా సారికపై 2-2తో నిలిచింది. పురుషుల విభాగంలో (86) ఢిల్లీ జట్టు రోనక్ 4-3తో ఆధిక్యంలో నిలిపాడు.

హర్యానా పట్టు వదలకుండా నేహా సంగ్వాన్ (57) మహిళల బౌట్‌లో అంజలిని ఓడించి 4-4తో మరోసారి స్కోరును సమం చేయడంతో ఫైనల్స్ ఆశను సజీవంగా ఉంచింది. దీంతో నిర్ణయాత్మక (62) మహిళల బౌట్‌లో ఇరినా కొలియాడెంకో పారిస్ ఒలింపిక్ రజత పతక విజేత అంజలిని ఓడించడంతో 16-0 టెక్నికల్ సుపీరియారిటీ విజయాన్ని సాధించి హర్యానా థండర్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.







# ఆట

## స్క్వాష్ ఓపెన్‌లో.. ఛాంపియన్‌గా అనాహత్

**న్యూఢిల్లీ:** స్క్వాష్ ఆన్ ఫైర్ ఓపెన్-2026లో భారత్ టీనేజ్ అథ్లెట్ ఏస్ అనాహత్ సింగ్ ఘనమైన ఫామ్‌ను కొనసాగించి తన కెరీర్‌లో 15వ టైటిల్‌ను గెలుచుకుంది. అమెరికాలోని వాషింగ్టన్‌లో జరిగిన ఆమె తొలి పిఎస్ఎ స్క్వాష్ టూర్ టోర్నమెంట్‌ను గెలుచుకుని ఛాంపియన్‌గా నిలిచింది. అంతకుముందు ఆమె 14 పిఎస్ఎ ఛాలెంజర్ టైటిళ్లను కైవసం చేసుకుంది. ఈ టీనేజర్ ఇంగ్లాండ్‌కు చెందిన టాప్ సీడ్ మరియు ప్రపంచ 10వ ర్యాంక్ క్రీడాకారిణి జార్జినా కెనెడ్డీని 12-10, 11-5, 11-7 తేడాతో ఓడించింది. 17 ఏళ్ల ఆమె ఇప్పుడు పిఎస్ఎ ర్యాంకింగ్స్‌లో ప్రపంచంలోని టాప్ 20లో చోటు దక్కించుకునే అవకాశం ఉంది. మహిళల సింగిల్స్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలైన ఆసియా క్రీడాకారిణి, మరియు మూడవ భారతీయురాలిగా నిలిచింది. అనాహత్ ఇక్కడ టోర్నమెంట్ అంతటా అద్భుతమైన ప్రదర్శన కొనసాగించి ప్రపంచ టైటిల్‌ను గెలుచుకునే ముందు ఉన్నత ర్యాంక్ ఉన్న ప్రత్యర్థులపై మూడు విజయాలు సాధించింది. ఆమె తదుపరి వారం చికాగోలో జరిగే విండీ సిటీ ఓపెన్ 2026 యొక్క పిఎస్ఎ ప్లాటినం ఈవెంట్‌లో కఠినమైన పరీక్షను ఎదుర్కొనబోతోంది.

## టాటా స్టీల్ చెస్.. కీమర్‌తో గుకేష్ డ్రా



**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ చెస్ విజ్క్ ఆన్ జీ-2026లో భారతదేశపు అగ్రశ్రేణి గ్రాండ్ మాస్టర్ల దారుణమైన ప్రదర్శన ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న నలుగురు గ్రాండ్ మాస్టర్లలో ఒక్కరు కూడా టాప్ 8 లో చోటు దక్కించుకోలేకపోయారు. చివరి రోజు జరిగిన మ్యాచ్‌లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్, భారత్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ తన ప్రత్యర్థి విన్సెంట్ కీమర్‌తో జరిగిన మ్యాచ్‌ను డ్రా చేసుకున్నాడు. గుకేష్ 13 ఆటలలో 3 విజయాలు, 3 ఓటములు, 7 డ్రాలతో 6.5 పాయింట్లతో 9వ స్థానంలో నిలిచాడు. చివరి మ్యాచ్ రోజున, గుకేష్ కఠినమైన ఆట నుండి బయటపడ్డాడు. తెల్లటి పావులతో జర్మనీకి చెందిన కీమర్‌తో జరిగిన మ్యాచ్‌లో 57మూవ్‌ల డ్రాను ముగించాడు. మరోపక్క చివరి రోజున ఎరిగైసి అర్జున్ పేలవమైన ప్రదర్శన కొనసాగింది, అతను తన చివరి గేమ్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్‌బెక్ అబ్దుసాటోరోవ్‌తో జరిగిన మరో ఓటమిని ఎదుర్కొన్నాడు. తన టోర్నమెంట్‌ను అర్జున్ కేవలం 4.5/13 పాయింట్లతో రెండవ చివరి స్థానంలో ముగించాడు. దీంతో ఇప్పుడు లైవ్ క్లాసికల్ రేటింగ్‌లలో ప్రపంచ టాప్ 10 నుండి దిగజారిపోయాడు. ఇక మరో గ్రాండ్ మాస్టర్ అరవింద్ చిదంబరం కూడా చివరి రౌండ్‌లో స్లోవేనియాకు చెందిన వ్లాదిమిర్ ఫెడోసీవ్ చేతిలో ఓటమితో 4.5/13 పాయింట్లతో టోర్నమెంట్‌ను ముగించాడు. అలాగే డిఫెండింగ్ ఛాంపియన్ ప్రజ్ఞానందా రమేష్ బాబు డచ్ గ్రాండ్ మాస్టర్ జోర్డాన్ వాన్ ఫారెస్ట్ తో జరిగిన మ్యాచ్ లో డ్రాగా ముగిసి 5.5/13 పాయింట్లతో 11వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.



# జాతీయ షూటింగ్ పంజాబ్ క్లీన్ స్వీప్

న్యూఢిల్లీ: నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లోని డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్స్‌లో జరుగుతున్న షాట్‌గన్ 1, 2లో హర్విరాజ్ సింగ్, హరజీజ్ సింగ్ అత్వాల్, గుర్ఫతే సింగ్ సంధు వరుసగా మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకోవడంతో జూనియర్ పురుషుల స్కీట్ టి2 ఫైనల్‌లో పంజాబ్ షూటర్లు పోడియంను క్లీన్ స్వీప్ చేశారు. ట్రయల్స్ 2 ఫైనల్‌లో గెలవడానికి ఒక పాయింట్ అవసరం కావడంతో అనంత్‌జీత్ సింగ్ నరుకా జ్యోతిరాదిత్య సింగ్ సిసోడియాను ఓడించింది, అయితే యశస్వి రాథోడ్ మహిళల ట్రయల్స్ 2లో కేవలం ఒక షాట్ మాత్రమే మిస్ చేసుకుని అగ్రస్థానాన్ని దక్కించుకుంది. హోరాహోరీగా జరిగిన ఫైనల్లో, 120 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచిన అనంత్ 36 షాట్‌లు కొట్టగా, జ్యోతిరాదిత్య కూడా 34వ లక్ష్యం వరకు పరిపూర్ణ స్కోరును కొనసాగించాడు. కానీ 35 హిట్‌లతో ఫైనల్స్‌ను ముగించడానికి తన చివరి షాట్‌ను మిస్ చేశాడు. అభయ్ సింగ్ సెఖోన్ 30 హిట్‌లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. మహిళల ఫైనల్లో యశస్వి రాథోడ్ కేవలం ఒక లక్ష్యాన్ని మాత్రమే కోల్పోయి 35 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. పరినాజ్ 33 హిట్స్‌తో ముగించగా, ఒలింపియన్ మహేశ్వరి చౌహాన్ 29 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచింది. ట్రయల్స్ 1లో 121 స్కోరుతో పరినాజ్ అగ్రస్థానంలో ఫైనల్‌కు అర్హత సాధించగా, 119 స్కోరుతో గణేమత్ సెఖోన్ తర్వాతి స్థానంలో నిలిచింది. యశస్వి రాథోడ్ 117 స్కోరుతో మూడవ స్థానంలోనూ, దర్శన రాథోడ్ 116 స్కోరుతో నాల్గవ స్థానంలోనూ, రైజా ధిల్లాన్ మరియు మహేశ్వరి చౌహాన్ 115 స్కోరుతో ఐదు మరియు ఆరు స్థానాల్లోనూ నిలిచారు.

## వాణిజ్యం




# మారుతిసుజుకి ఆల్‌టైమ్ రికార్డు సేల్స్!

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2:** మారుతిసుజుకి ఇండియా జనవరి నెల అమ్మకాలు 12శాతంపెరిగాయి. దేశీయంగా డిమాండ్ తగ్గినా ఎగుమతులు పెరిగాయి. దేశంలోని చిన్నకార్ల తయారీ దిగ్గజంగా ఉన్న మారుతి జనవరి నెలలో 2,36,963 యూనిట్లు విక్రయించింది. ఎగుమతులు కూడా 88శాతంపెరిగాయి. ఆల్‌టైమ్ రికార్డుస్థాయికి పెరిగాయి. 51,020యూనిట్లుగా ఉన్నాయి. దేశీయంగా అమ్మకాలు తేలికపాటి వాణిజ్య వాహనాలు స్వల్ప వృద్ధితో ఉన్నాయి. 0.4శాతంపెరిగి 1,85,943 యూనిట్లు విక్రయిస్తే ప్యాసింజర్ వాహణాలు 0.5శాతంపెరిగి 1,74,529 యూనిట్లకు చేరాయి. జిఎస్టీ రేట్ కట్స్ చిన్నకార్ల విక్రయాలకు మరింత మద్దతునిచ్చాయి. ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ ఉత్పత్తిదారులు అంటే ఒఇఎంలు కూడా స్వల్పంగా 2శాతంపెరిగి 7643యూనిట్లకు చేరాయి. ఏప్రిల్‌నుంచి జనవరి వరకూ మొత్తం అమ్మకాలు 8శాతంపెరిగి 19.8లక్షల యూనిట్లుగా ఉన్నాయి. ఇయర్‌టు డేట్ దేశీయ అమ్మకాలు కూడా 15.28 లక్షలయూనిట్లుగా ఉన్నాయని, ఎగుమతులు 3.6 లక్షలయూనిట్లు ఉన్నట్లు తెలిపింది. అలాగే డిసెంబరు త్రైమాసికంలోకూడా భారీ ఆదాయం సాధించింది. 29శాతం రాబడులు పెరిగి రూ.49,892 కోట్లకు చేరాయి. నాలుగుశాతం నికరలాభాలుపెరిగి రూ.3794 కోట్లు ఆర్జించింది. మారుతిషేర్లు09.7శాతం దిగువన అంటే రూ.14,100గా ట్రేడ్ అయ్యాయి. వార్షికపద్ధతిలోచూస్తే కంపెనీ స్టాక్ సెన్సెక్స్‌లో ఏడుశాతం ఎగువన ఉంది.

# వారం ప్రారంభంలో లాభాల బోణీ

## సెన్సెక్స్, నిఫ్టీ కంపెనీల షేర్లు పైపైకి..

**ముంబయి,ఫిబ్రవరి 2:** దేశీయ స్టాక్ సూచీలు వారం ప్రారంభంలో సానుకూలంగా ముగిసాయి. సెన్సెక్స్ 902.12 పాయింట్లుపెరిగి 81,625.06వద్ద స్థిరపడితే నిఫ్టీ 50 సూచీ 262.95 పాయింట్లుపెరిగి 25,088.40 పాయింట్లవద్దస్థిరపడింది. ప్రారంభంలో కొంతమేర అమ్మకాలు ఉన్నప్పటికీ ఇంట్రాడే తర్వాతనుంచి షేర్లు లాభపడ్డాయి. బడ్జెట్ రోజున నిఫ్టీసెన్సెక్స్‌రెండూ కూడా 10 లక్షలకోట్లమేర టర్నోవర్ నష్టపోయిన సంగతి తెలిసిందే. నిఫ్టీ50 సూచీలో టాటామోటార్స్ ప్యాసింజర్ వాహనాలు,



ఆదానిపోర్టులు సెజ్, ఆసియన్ పేయింట్స్ రెండుశాతంమేర పెరిగాయి. శ్రీరామ్‌ఫైనాన్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ భారీగా నష్టపోయాయి. మూడుశాతం వరకూ నష్టాలు ఎదుర్కొన్నాయి. మార్కెట్లపరంగాచూస్తే కొంతమేర ప్రతికూలతే కనిపించింది. 1282 షేర్లు పెరిగితే 2116 షేర్లుక్షీణించాయి. 142 స్థిరంగా కొనసాగాయి. ఎంపికచేసిన రంగాల్లోనే కొనుగోళ్లుపెరిగినట్లు మార్కెట్ నిపుణులు చెపుతున్నారు. బ్రెంట్‌ముడిచమురు 4.34శాతం క్షీణించి బ్యారెల్‌కు 66.31 డాలర్లుగా నడించింది. ద్రవ్యోల్బణ ఒత్తిడులు సడలి భారత వాణిజ్యం సమతూకంలోకి వచ్చింది. ఈక్విటీ మార్కెట్లకు కొంత ఉపశమనం కలిగింది. ఉత్పత్తిరంగం, గ్లోబల్ డేటా సెంటర్స్ వ్యవసాయం, పర్యాటకరంగాలకు బడ్జెట్‌లోకేటాయింపులు మార్కెట్లకు బలాన్నిచ్చాయి. డాలరుతో రూపాయి కొంతమేర పటిష్టం అయింది. 37 పైసలు పెరిగి 91.56గా నడిచింది. ముడిచమురు ధరలు తగ్గడం సహజంగానే బడ్జెట్‌ప్రభావం ఉంటుందని అందరికీ తెలిసిందే. ఇక కంపెనీలపరంగా యాక్సిస్‌బ్యాంకు, ఇన్ఫోసిస్, టిసిఎస్, ట్రెంట్ టైటాన్‌షేర్లు నష్టాల్లోకి వెళ్లాయి. ఇక పసిడిధరలపరంగాచూస్తే అంతర్జాతీయ మార్కెట్‌లోఔన్స్ బంగారం 4680 డాలర్లవద్దట్రేడ్ అవుతోంది. ఇక బిఎస్ఇలో అయితే 2039 షేర్లు పెరిగితే 2220 షేర్లు క్షీణించగా 169 కంపెనీలుమాత్రం స్థిరంగాకొనసాగాయి.




# ఒరాకిల్‌కు కృత్రిమమేధ షాక్

## 30 వేలమంది సిబ్బందిపై పడుతున్న వేటు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** ఐటీసహా వివిధ రంగాల్లో ఉద్యోగాల తొలగింపునకు కృత్రిమమేథ ప్రధాన కారణంగా మారుతోంది. ఇప్పుడు ఏఐ ప్రభావంతో మరో సంస్థ కూడా భారీ సంఖ్యలో సిబ్బందిని తొలగించేందుకు సిద్ధమవుతోంది. ఒరాకిల్ సంస్థ ఏకంగా 30వేల వరకు ఉద్యోగాల్ని తొలగించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీనికి కారణం ఓపెన్‌ఏఐ. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాండ్ టీడీ కోవెన్ ప్రకారం ఓపెన్‌ఏఐ సంస్థతో ఒరాకిల్ 300 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్‌తో భారీ స్థాయిలో ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేయాలనుకుంటోంది. కంపెనీ ఖర్చులు తగ్గించుకునేందుకు ఏకంగా 20వేలనుంచి 30వేల మంది సిబ్బందిని తొలగించేందు ఒరాకిల్ రెడీ అవుతోంది. దీనివల్ల కంపెనీకి 8 బిలియన్ డాలర్ల నుంచి 10 బిలియన్ డాలర్ల వరకు మిగులుతుంది. ఓపెన్‌ఏఐతో ఒప్పందమే ఒరాకిల్ సంస్థను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోంది. గడిచిన రెండు నెలల్లోనే 58 బిలియన్ డాలర్లు ఒరాకిల్ కోల్పోయింది.




# వెండి బంగారం ధరల్లో భారీ పతనం

**ముంబయి,ఫిబ్రవరి 2:** బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరిన తర్వాత, గత నాలుగైదు రోజులుగా పసిడి, వెండి ధరలు నేలచూపులుచూస్తున్నాయి. ఈ క్రమంలో ఇవాళ ఒక్కరోజే బంగారం ధర రికార్డు స్థాయిలో పడిపోయింది. ఈ పరిణామం పెట్టుబడిదారులకు షాక్ ఇవ్వగా, కొనుగోలుదారులకు ఊరటనిచ్చింది. సోమవారం హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.9,050 తగ్గి రూ.1,51,530కి చేరింది. అలాగే, 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.8,300 తగ్గి రూ.1,38,900 వద్ద ట్రేడ్ అయింది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా దాదాపు ఇదే పరిస్థితి కొనసాగింది. అక్కడ 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,51,680గా నమోదైంది. బంగారం బాటలోనే వెండి ధరలు కూడా కొనసాగుతున్నాయి. కిలో వెండి ధర ముందురోజుతో పోలిస్తే ఏకంగా రూ.50,000 పతనమైంది. ప్రస్తుతం హైదరాబాద్, ఢిల్లీ మార్కెట్లలో కిలో వెండి ధర రూ.3 లక్షల వద్ద ఉంది. కొద్ది రోజుల క్రితం కిలో వెండి ధర రూ.4.25 లక్షల వరకు చేరడం గమనార్హం. ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరడంతో పెట్టుబడిదారులు భారీ ఎత్తున లాభాల స్వీకరణకు (ప్రాఫిట్ బుకింగ్) మొగ్గు చూపడమే ఈ పతనానికి ప్రధాన కారణంగా బులియన్ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ధరల పతనం పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తుండగా, కొనుగోలు చేయాలనుకునే వారికి ఊరటనిస్తోంది.

# ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 49%కి విదేశీ పెట్టుబడులు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2:** దేశంలోని ప్రభుత్వరంగ బ్యాంకుల్లో విదేశీ ఇన్వెస్టర్లు 49శాతంవాటా వరకూ పెట్టుబడులు పెట్టేందుకు కేంద్రం నిబంధనలు సడలిస్తోంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు ఆర్థికవృద్ధిని సాధించాలంటే ప్రైవేటురంగ భాగస్వామ్యం తప్పనిసరి అని పెట్టుబడుల ఉపసంహారణశాఖ చెపుతోంది. రుణం జిడిపి నిష్పత్తిని 56 శాతం నుంచి 150శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని ఫెడరల్‌బ్యాంకింగ్ కార్యదర్శి నాగరాజు వెల్లడించారు. భారతీయ స్టేట్‌బ్యాంకు, మరో ఇతర 11 ప్రభుత్వ బ్యాంకుల్లో విదేశీ పెట్టుబడుల వాటా 20శాతానికి మాత్రమే కట్టడి అయి ఉంది. ఈ సారి బడ్జెట్‌కు ముందునుంచే ప్రభుత్వం వ్యూహాత్మక నియంత్రణ పట్టును పెంచుకోవాలనిచూస్తోంది. ప్రైవేటురంగ బ్యాంకుల్లో 74శాతం విదేశీపెట్టుబడులకు ఉన్న అనుమతులు ప్రభుత్వరంగంలో మాత్రం 20శాతానికే కట్టుబడి ఉన్నాయి.

# పెట్టుబడుల మళ్లింపుతో వెండి ఇటిఎఫ్‌ల భారీ పతనం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 2:** బంగారంధరలతోపాటే వెండికి కూడా బడ్జెట్‌షాక్ తగిలింది. అంతర్జాతీయ మార్కెట్లలో భారీ పతనం దేశీయ మార్కెట్‌పైనా చూపింది. వెండి ఇటిఎఫ్‌లపై కూడా ఈప్రభావం కనిపిస్తోంది. గతవారాంతానికి 20శాతం పతనం అయితే ఒక్క సోమవారం రోజే 19శాతం పతనం అయింది. రిటైల్ ఇన్వెస్టర్లకు కాసులు కురిపించిన సిల్వర్ ఈటీఎఫ్‌లు పడిపోవడంతో ఇన్వెస్టర్లు కలవరం వ్యక్తంచేస్తున్నారు. భారత ఎంసిఎక్స్‌లో కిలో వెండి మార్చి కాంట్రాక్టుధర రూ.2.27 లక్షలుగా ఉంది.




గతవారంలో ఈ ధర రూ.4,20,048గా కొనసాగింది. గరిష్టాలతోపోలిస్తే కిలో వెండి సుమారురూ.2 లక్షలమేర పతనం అయింది. ఈప్రభావంతోనే వెండి ఈటిఎఫ్‌లు కూడా క్షీణించాయి. టాటా సిల్వర్ ఈటిఎఫ్ 19.15, ఎస్‌బిఐ సిల్వర్ ఈటిఎఫ్ 14.98, ఆదిత్యబిర్లా సన్‌లైఫ్ ఇటిఎఫ్ 14.6 శాతం చొప్పున క్షీణించాయి. గ్రోసిల్వర్ ఈటిఎఫ్ 16.17, జెరోధా సిల్వర్ ఈటిఎఫ్ 15.41, నిప్పన్ ఇండియా ఈటిఎఫ్ 15.69, ఐసిఐసిఐప్రుడెన్షియల్ సిల్వర్ ఈటిఎఫ్ 14.05శాతం, కోటక్ సిల్వర్ ఈటిఎఫ్ 17.38శాతం హెచ్‌డిఎఫ్‌సి సిల్వర్ ఈటిఎఫ్ 16.65శాతం మోతీలాల్ ఓస్వాల్ సిల్వర్ ఈటిఎఫ్ 16.02శాతం చొప్పున పతనం అయ్యాయి. డాలర్ విలువలు బలపడటం, ట్రెజరీ బాండ్లపై రాబడులు పెరుగుతుండటంతో ఇన్వెస్టర్లు బులియన్‌రంగంనుంచి కరెన్సీ బాండ్ల మార్కెట్‌వైపు పెట్టుబడులను మళ్లించడంతో పసిడి, వెండిధరల్లో భారీ క్షీణత కనిపించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.